


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

జపాన్‌కు జననాల తగ్గుదల తిప్పలు

సోషల్ మీడియా భస్మాసుర హస్తం కారాదు!

లోపలి పేజీల్లో

సంపుటి 27, సంచిక: 112 | ఆదివారం | 06-10-2024 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00



## హర్యానా పీఠం కాంగ్రెస్‌దే...

### జమ్ము కశ్మీర్‌లో కూటమికి అవకాశం
### ఎగ్జిట్‌ఫోల్స్ విడుదల చేసిన సర్వే సంస్థలు

**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్, హర్యానాలో అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. ఈ నేపథ్యంలో రెండు రాష్ట్రాలకు సంబంధించి శనివారం ఎగ్జిట్ పోల్స్ వచ్చాయి. దాదాపు పదేళ్ల తర్వాత జరిగిన జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి మెజారిటీ సీట్లు రాబోవని సర్వే సంస్థలు అంచనా కట్టాయి. అయితే నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కూటమికి ఎక్కువ సీట్లు వస్తాయని వెల్లడించాయి. హర్యానాలో కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజారిటీ వస్తుందని, ఆ పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. వివరాల్లోకి వెళితే... 90 అసెంబ్లీ నియోజకవర్గాలున్న హర్యానాలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే కనీసం 46 స్థానాల్లో విజయం సాధించాల్సి ఉంటుంది. మెజార్టీ సర్వే సంస్థలు కాంగ్రెస్ పార్టీయే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అభిప్రాయపడ్డాయి. పీపుల్స్ పల్స్ సర్వే ప్రకారం.. కాంగ్రెస్ 55 స్థానాల్లో విజయం సాధించే అవకాశం ఉంది. బిజెపి 26, ఐఎన్ఎల్‌డి 23, జెజెపి 0–1, ఇతరులు 3–5 స్థానాల్లో విజయం సాధించే అవకాశం ఉంది. రిపబ్లిక్ మ్యాట్రిజ్ – కాంగ్రెస్: 55–62, బిజెపి 18–24, ఐఎన్ఎల్‌డీ+బిఎస్‌పి: 36, జెజెపి: 03, ఇతరులు: 2–5, ధ్రువ్ రీసెర్చ్ – కాంగ్రెస్: 57–64, బిజెపి: 27–32, ఇతరులు: 5–8, దైనిక్ భాస్కర్ – కాంగ్రెస్: 44–54, బిజెపి: 19–29, జెజెపి: 0–1, ఐఎన్ఎల్‌డి 1–5, ఇతరులు 4–9, పిమార్క్– కాంగ్రెస్+: 44–54, బిజెపి: 15–29, జెజెపి:0, ఐఎన్ఎల్‌డీ+: 3–6, ఇతరులు:0, ఇండియాటుడే సి ఓటర్ – కాంగ్రెస్: 50–58, బిజెపి: 20–28, జెజెపి: 0–2, ఇతరులు: 10–14 గెలుచుకుంటారని సర్వే సంస్థలు తరువాయి 2లో



“కెసిఆర్, కెటిఆర్‌కు నిజంగా పేదలపై ప్రేమ ఉంటే ఫామ్ హౌస్‌లో కొంత భూమిని పేదలకు పంచాలి. మీరు ఫామ్ హౌస్‌ల్లో జమీందారుల్లా బతుకుతారు.. పేదలు మాత్రం మూసీ ముంపులో బతకాలా? అవసరమైతే మలక్‌పేట్ రేస్ కోర్టును, అంబర్‌పేట్ పోలీస్ అకాడమీని హైదరాబాద్ బయటకు తరలించి పేదలకు ఇండ్లు కట్టిద్దాం. బిఆర్‌ఎస్ నేతలు కెటిఆర్, హరీష్ రావు, బిజెపి నేత ఈటలకు ఫాంహౌస్‌లను కాపాడుకోవడంపై ఉన్న శ్రద్ధ మూసీ పరీవాహక ప్రాంత వాసులపైలేదు.

– సిఎం రేవంత్‌రెడ్డి

# అనాథలను చేయం

## మూసీ పరీవాహక ప్రాంత ప్రజలు ఆందోళన చెందొద్దు

- ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసే బాధ్యత ప్రభుత్వానిదే
- మూసీ రివర్‌బెడ్, బఫర్‌జోన్‌లో ఉన్నవారిని ఆదుకుంటాం
- రెచ్చగొట్టేవారి మాటలు నమ్మొద్దు
- కాలకేయ ముఠాలా అడ్డుపడడం సరికాదు
- మూసీ ప్రజలను ఎలా ఆదుకుందామో సూచనలివ్వండి
- ‘కాకా’ 95వ జయంతి వేడుకల్లో సిఎం రేవంత్ రెడ్డి




ప్రజాపక్షం/హైదరాబాద్

“మూసీ పరీవాహక ప్రాంత ప్రజలను ఎలా ఆదుకుందామో సూచనలు ఇవ్వండి. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరిపైనా కోపం లేదు. ప్రజలకు మేలు చేయడమే ప్రభుత్వ ఉద్దేశం.పేదోళ్లకు ఏం చేద్దామో ఆలోచన చేద్దాం... ముందుకు రండి. బిజెపి నేత ఈటల, బిఆర్ఎస్ నేతలు కెటిఆర్, హరీష్‌కు సూచన చేస్తున్నా. మీ ఆస్తులు ఇవ్వకపోయినా పరవాలేదు. మీ అనుభవంతో ఏం చేద్దామో చెప్పండి. అంతే కానీ.. ప్రభుత్వం ఏం చేసినా కాలకేయ ముఠాలా అడ్డుపడటం సరి కాదు” అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. కేంద్ర మాజీ మంత్రి గడ్డంవెంకటస్వామి (కాకా) 95వ జయంతి వేడుకలు శనివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఎం రేవంత్ రెడ్డి హాజరు కాగా, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపిలు మల్లు రవి, గడ్డం వంశీ కృష్ణ, ఎం.అనిల్‌కుమార్ యాదవ్, ఎంఎల్‌ఎలు గడ్డం వినోద్, గడ్డం వివేక్, ప్రేమ్ సాగర్‌రావు, నాగ రాజు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, మాజీ ఎంపి మధు యాష్కీ తదితరులు పాల్గొన్నారు. సభలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ “మూసీ ప్రక్షాళనతో మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలు ఆందోళనకు గురికావద్దు. ప్రభుత్వం మిమ్ములను అనాథలను చేయదు. మీకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసే బాధ్యత ప్రభుత్వానిది. మూసీ రివర్ బెడ్, బఫర్ జోన్‌లో ఉన్నవారిని ప్రభుత్వం ఆదుకుంటుంది. రెచ్చగొట్టే వారి మాటలు నమ్మొద్దు. ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు వెళుతుంది.ఫామ్ హౌస్‌లను కాపాడుకునేందుకు పేదల ముసుగు అడ్డుపెట్టుకునే వారి మాటలు వినొద్దు. మీ మంచి కోసమే ప్రభుత్వం తరువాయి 2లో

## మూసీనది నిర్వాసితుల జీవనోపాధి కోసం ప్రత్యేక కమిటీ

మూసీనది ప్రక్షాళనలో భాగంగా నిర్వాసిత కుటుంబాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ఇప్పటికే నదీగర్భంలో నివాసాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయిస్తున్న విషయం తెల్సిందే. విద్య, ఉపాధి కల్పన కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సెర్ప్ సిఇఒ చైర్మన్‌గా, జిహెచ్‌ఎంసి కమిషనర్, వైస్ చైర్మన్‌గా 14 మంది సభ్యులతో జీవనోపాధి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వులలో పేర్కొంది. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి దానకిషోర్ కన్వీనర్‌గా ఉన్న ఈ కమిటీలో మైనారిటీ, తెలంగాణ గురుకుల పాఠశాలల కార్యదర్శులు సభ్యులుగా ఉంటారని ప్రభుత్వం స్పష్టం చేసింది. సభ్యులు తమ తమ శాఖలకు సంబంధించిన కార్యాచరణను రూపొందించి, 30 రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులలో ఆదేశించింది.

## హైడ్రాకు ‘హై పవర్స్’

### ఆర్డినెన్స్‌కు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం




హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)కు హైపవర్స్ వచ్చాయి. రాష్ట్ర రాజధానిలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తూ సంచలనంగా మారిన హైడ్రాకు ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా చట్టబద్ధత కల్పించింది. జిహెచ్ఎంసి చట్టం 1955ను సవరిస్తూ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదముద్ర వేయడంతో ప్రభుత్వం శనివారం తాజాగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. జిహెచ్ఎంసి చట్టంలో కొత్తగా 374 (బి) సెక్షన్‌ను చేర్చినట్లు గెజిట్‌లో పేర్కొంది. ఆ సెక్షన్ ద్వారా హైదరాబాద్ మహానగరంలో ప్రభుత్వ ఆస్తులు, నీటి వనరులు, పార్కులు, రహదారుల పరిరక్షణ కోసం అధికారిని లేదా సంస్థను ఏర్పాటు చేసే అధికారాన్ని ప్రభుత్వానికి కట్టబెట్టింది. రాష్ట్రంలోని తరువాయి 2లో

## అతిత్వరలో కొత్త రెవెన్యూ చట్టాలు

### పేదలకు ప్రభుత్వ భూములు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి పొంగులేటి



ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి

ప్రస్తుతం ఉన్న రెవిన్యూ చట్టంలో మార్పులు చేసి దేశానికే రోల్ మోడల్ గా ఉండేలా నూతన రెవెన్యూ (ఆర్ఓఆర్ ) చట్టాన్ని తీసుకురానున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం ఉన్న రెవెన్యూ చట్టంలో తప్పొప్పులను సవరించి ,అన్ని రకాల భూ సమస్యలను పరిష్కరించి నూతన చట్టాన్ని తీసుకువచ్చేందుకు ఉద్దేశించి పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన నాగార్జునసాగర్ నియోజకవర్గం, తిరుమలగిరి (సాగర్) మండలం, నెల్లికల్ గ్రామంలో శనివారం నిర్వహించిన రైతుల ముఖాముఖి కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో కెసిఆర్ ప్రభుత్వం 2020 రెవెన్యూ చట్టం, ధరణి తీసుకురావడం వల్ల రాష్ట్రంలోని రైతులు, ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని 2020 చట్టాన్ని అలాగే ధరణిలోని తప్పొప్పులను సవరించేందుకు దేశంలోని అన్ని రెవెన్యూ చట్టాలను పరిశీలించి మేలైన చట్టం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను సేకరించి పబ్లిక్ డొమైన్ లో ఉంచినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే తిరుమలగిరి (సాగర్) మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయడం జరిగిందని, నూతన రెవెన్యూ చట్టంపై ప్రజల అభిప్రాయాలను తీసుకున్న తర్వాతే చట్టం తీసుకురావాలని , అలాగే ప్రధాన ప్రతిపక్ష పార్టీల సూచనలు సైతం పరిగణలోకి తీసుకొని అతి కొద్ది రోజుల్లోనే నూతన రెవెన్యూ చట్టాన్ని ప్రజల ముందుకు తీసుకురాబోతున్నామని మంత్రి వెల్లడించారు. అర్హులైన పేదవారికి. ప్రభుత్వ భూములు అందాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని , ప్రత్యేకించి తిరుమలగిరి (సాగర్)లో కొంతమంది పొజిషన్లో ఉన్నప్పటికీ పట్టాలు లేవని, పట్టాలున్న వారికి భూమిలేదని, అలాగే ఎవాక్యూవేషన్ ప్రాపర్టీ కి సంబంధించి, ఇతర ప్రభుత్వ భూములకు సంబంధించిన చేస్తున్న సర్వే పూర్తయిన తర్వాత సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు. తిరుమలగిరి (సాగర్)లో సుమారు 1300 ఎకరాల కు బోగస్ పట్టా పాస్ పుస్తకాలు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు తమ దృష్టికి తీసుకువచ్చారని, ప్రభుత్వం పేదలకు మంచి చేయాలన్నదే తపనతో డిసెంబర్ 9న రాష్ట్ర ముఖ్యమంత్రిని నాగార్జునసాగర్ నియోజకవర్గానికి తీసుకువచ్చి ఇక్కడే బహిరంగ సభ ఏర్పాటు చేసి నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని వేలాది ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పంచుతారని మంత్రి వెల్లడించారు. గతంలో చెప్పినట్లుగానే పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని, నెలాఖరులోపు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు మొదటి విడతన 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లను ఇస్తామని , నాగార్జునసాగర్ నియోజకవర్గానికి 5000 ఇండ్లు ఇస్తామని మంత్రి ప్రకటించారు. గతంలో ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి సర్టిఫికెట్లు లేక బ్యాంకులో మార్ట్‌గేజ్‌లో ఉన్న వాటిని అప్పు నిలిపి వేసి లబ్ధిదారులకే ఆ ఇండ్లు సొంతం అయ్యేలా చూడాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు.

**పాతచట్టంలో తప్పులను సరిచేయడానికే పైలెట్ ప్రాజెక్టు : మాజీ మంత్రి జానారెడ్డి**

ధరణితో ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ధరణిలోని తప్పులను, పాత చట్టంలోని తప్పులను సరి చేసేందుకు తిరుమలగిరి సాగర్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయడం తరువాయి 2లో




### సవరణల పేరుతో వక్ఫ్ చట్టాన్ని
## సమాధి చేస్తే సహించం

### ‘ఆల్ ఇండియా తంజీవే ఇన్సాఫ్’ జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపి అజీజ్ పాషా

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి

వక్ఫ్ చట్టానికి సవరణ పేరుతో సమాధి చేయాలని మోదీ సర్కార్ పథకాలు వేస్తుందని, ఇది ఎంత మాత్రం సహించమని ఆల్ ఇండియా తంజీమే ఇన్సాఫ్ జాతీయ అధ్యక్షులు మాజీ ఎంపి అజీజ్ పాషా హెచ్చరించారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో రెండు రోజులపాటు జరిగే ఆలిండియా తంజీవ్ ఇన్సాఫ్ జాతీయ సమితి సమావేశాలు శనివారం శుభం కన్వెన్షన్ హాల్లో ఘనంగా ప్రారంభం అయ్యాయి. జాతీయ సమావేశాల ప్రారంభోత్సవం సందర్భంగా ‘వక్ఫ్ సవరణ చట్టం–2024’ అనే అంశంపై జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్ లో అజీజ్ పాషా మాట్లాడుతూ, మైనార్టీ హక్కులను కాలరాసే విధంగా కేంద్ర సర్కార్ వ్యవహరించే తీరును ఆయన తప్పు పట్టారు. భారతదేశంలో రైల్వే రక్షణ శాఖ తర్వాత ఆస్తులున్నది వక్ఫ్ బోర్డుకేనని ఇది జీర్ణించుకోలేని మోదీ సర్కార్ మైనార్టీలను అణగదొక్కాలని చూసేందుకు కొత్త చట్టాన్ని తీసుకువస్తుందని ఆయన తెలిపారు. ఈ చట్టం విషయంలో లౌకిక, ప్రజాస్వామిక వాదులంతా కలిసికట్టుగా ప్రభుత్వం పై పోరాటం చేయాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. దేశంలో 14 శాతం ఉన్న మైనార్టీలకు 30% ఆస్తుల ఎందుకనే ఈర్ష తోనే ఈ చట్టానికి రూపకల్పన జరిగిందన్నారు. ప్రధాన మోదీ తప్పును విధానాలతో దేశంలో మతసామరస్యాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించడం దుర్మార్గమైన చర్యగా ఆయన అభివర్ణించారు. వక్ఫ్ఆస్తులకు పరిరక్షణకు దేశంలోని లౌకిక శక్తులు ఏకం కావాల్సిన తరుణం ఆసన్నమైందని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ మైనార్టీల హక్కులను ఆస్తులను హరించే విధంగా మోదీ సర్కార్ తరువాయి 2లో

## మా ఓర్పు నశించింది

### రాష్ట్రాల తీరుపై ‘సుప్రీం’ అసహనం
### వచ్చేనెల 19లోపు వలస కార్మికులకు రేషన్‌కార్డులివ్వాల్సిందే



**న్యూఢిల్లీ :** రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరిపట్ల సుప్రీం కోర్టు శనివారంనాడు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. వలస కార్మికులకు రేషన్ కార్డులు ఇవ్వాలని జారీ చేసిన ఉత్తర్వులను ఏ మాత్రం పాటించకపోవడంతో జస్టిస్ సుధాంషు ధూలియా, జస్టిస్ అసదుద్దీన్ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం “మా ఓర్పు నశించింది” అని తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. వలస కార్మికులకు నవంబరు 19వ తేదీనాటికల్లా రేషన్ కార్డులు ఇవ్వాలని, అందుకు అవసరమైన అత్యవసర చర్యలు చేపట్టాలని ఆదేశించింది. “మా ఓర్పు నశించింది, ఇంకెంతమాత్రం ఇష్టానుసారంగా వ్యవహరించవద్దని మేం మా వైఖరిని చాలా స్పష్టంగా ఇప్పటికే తెలియజేశాం, మీరు అంగీకరించిన విధంగా మా ఉత్తర్వులకు కట్టుబడేందుకు మీకు చివరి అవకాశం ఇచ్చాం, మీ కార్యదర్శి మా ఎదుట హాజరు కావాలి” అని ధర్మాసనం ఆదేశించింది. ఐతే ‘అంత్యోదయ అన్న యోజన’ కింద ప్రాధాన్యతా ప్రాతిపదికపై ఒక ఇంటికి ఒక రేషన్‌కార్డు మాత్రమే ఇచ్చామని కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ తరువాయి 12లో

## ఎన్‌కౌంటర్ మృతులు@31

### మృతుల్లో మావోయిస్టు అగ్రనేతలు ?

ప్రజాపక్షం/భద్రాచలం



ఛత్తీస్‌గఢ్‌లో శుక్రవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు సంఖ్య 31కి చేరింది. దీనిని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి శనివారం ధృవీకరించారు. బస్తర్ రేంజ్‌లో గల దంతెవాడ–నారాయణ్‌పూర్ జిల్లా మాడ్ అటవీ ప్రాతంలోని ఓర్చా,బర్సూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని గోవెల్, నెందుర్, తుల్తుడి గ్రామాల అటవీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీకి చెందిన నేతలతో సహా 50 నుండి 60 మంది సభ్యులు దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన కమలేష్, కమాండర్ నందు, సురేష్ సలాం, కమల, మల్లేష్, నీతు తదితరులు సమావేశమయ్యారనే పక్కా సమాచారం మేరకు డిఆర్‌జి స్పెషల్ టాస్క్ ఫోర్స్ బలగాలు ఆ ప్రాంతాన్ని శుక్రవారం చుట్టుముట్టిన విషయం విధితమే. ఎన్‌కౌంటర్‌లో మొదట 36 మంది మృతి చెందినట్లు తెలిసింది. ఆ తర్వాత 30 మంది అని ప్రకటించినప్పటికీ 28 మృతదేహాలను మాత్రమే గుర్తించినట్లు ఐజి సుందర్ రాజన్ ప్రకటించారు. కాగా శనివారం మరో 3 మృతదేహాలు లభ్యమయ్యాయని, మృతుల సంఖ్య 31కి చేరినట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ప్రకటన చేసింది. ఎదురు కాల్పుల్లో డిఆర్‌జి జవాన్ ఒకరు తీవ్ర గాయాల పాలయ్యారు. అత్యవసర చికిత్స నిమిత్తం జవాన్‌ను రాయపూర్ ఆస్పత్రికి తరలించారు. పేలుడు పదార్థాలు, ఏకె 47, ఎస్ఆల్ఆర్, అధునాత ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాలను సైతం ప్లాస్టిక్ కవర్లలో చుట్టి పోస్టు మార్టం నిమిత్తం 23 మృతదేహాలను దంతెవాడకు, 8 నారాయణ్ పూర్ తరలించారు. ఇంత వరకు మావోయిస్టుల తరువాయి 2లో



## ముగ్గురిని బలిగొన్న ఆన్‌లైన్ బెట్టింగ్

### అప్పులు తీర్చలేక కొడుకుసహా తల్లిదండ్రులు ఆత్మహత్య
### నిజామాబాద్ జిల్లాలో విషాదం

ప్రజాపక్షం/ఎడపల్లి

ఆన్‌లైన్ బెట్టింగ్ వల్ల కుమారుడితో పాటు తల్లిదండ్రులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. ఆన్‌లైన్ బెట్టింగ్‌తో తీవ్ర తరువాయి 2లో

### ప్రజలను భయపెడుతూ శివాజీ ముందు
## తలవంచితే ఏం ప్రయోజనం

### తప్పుడు ఉద్దేశాలు, తప్పుడు సిద్ధాంతాల వల్లే విగ్రహం కూలింది : రాహుల్‌గాంధీ

**కొల్హాపూర్ :** బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విరుచుకుపడ్డారు. దేశంలోని సంస్థలను, రాజ్యాంగాన్ని విధ్వంసం చేస్తూ, ప్రజలను భయపెడుతూ శివాజీ మహారాజ్ ముందు తల వంచి నమస్కరిస్తే ప్రయోజనం లేదన్నారు. అధికారంలో ఉన్న వారి తప్పుడు ఉద్దేశాలు, తప్పుడు సిద్ధాంతాల వల్లే మహారాష్ట్ర సింధుర్గ్ జిల్లాలోని శివాజీ మహారాజ్ విగ్రహం కూలిపోయిందని రాహుల్ ఆరోపించారు. పశ్చిమ మహారాష్ట్రలోని కొల్హాపూర్ నగరంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని శనివారం రాహుల్‌గాంధీ ఆవిష్కరించారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన బహిరంగసభలో రాహుల్ పాల్గొని ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకుని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఒకవైపు దేశంలోని సంస్థలను, రాజ్యాంగాన్ని నాశనం చేస్తూ, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ మరోవైపు శివాజీ ముందు తలవంచి నమస్కరిస్తే ఎలాంటి ప్రయోజనం ఉండబోదన్నారు. ఇటీవల మహారాష్ట్రలో శివాజీ విగ్రహం కూలిపోవడంతో ప్రధాని క్షమాపణలు చెప్పిన విషయం తెలిసిందే. ఛత్రపతి శివాజీ మహారాజ్ అనేది కేవలం పేరు, రాజు మాత్రమే కాదు, మనకు ఆయన ఆరాధ్యదైవమని, ఆయనకు తన శిరస్సు తరువాయి 2లో






# 600 మంది ఊచకోత

## గంటల వ్యవధిలోనే దారుణం



**బర్సాలోగో:** పశ్చిమ ఆఫ్రికా దేశం బుర్కినా ఫాసోలో అత్యంత భయానక ఘటన చోటుచేసుకుంది. బర్సాలోగో పట్టణంలో ఉగ్రవాదులు కిరాతకానికి పాల్పడ్డారు. కొన్ని గంటల వ్యవధిలోనే దాదాపు 600 మందిని దారుణంగా కాల్చి చంపారు. ఆగస్టులో జరిగిన ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. మతదేహాలను సేకరించేందుకే మూడు రోజులు పట్టిందని తెలిపాయి. ఆగస్టు 24న బర్సాలోగో పట్టణంపై బైక్‌లపై దూసుకొచ్చిన ఉగ్రవాదులు కనిపించినవారినందరినీ కాల్చేశారు. మతుల్లో అత్యధికులు మహిళలు, చిన్నారులే ఉన్నారు. అల్‌ఖైదా, ఇస్లామిక్ స్టేట్ అనుబంధ సంస్థ జమాత్ నుస్రత్ అల్ ఇస్లామ్ వాల్ ముస్లిమిన్ (జేఎన్ఐఎం) మిలిటెంట్లు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. బుర్కినాఫాసోలో మిలిటెంట్లు తరచూ దాడులకు పాల్పడుతుండటంతో ప్రజల భద్రత దష్ట్యా గ్రామాల చుట్టూ లోతైన కందకాలు తవ్వుకోవాలని సైన్యం ఆదేశించింది. దీంతో ఆగస్టు 24న బర్సాలోగో ప్రజలు తవ్వకాలు జరుపుతుండగా ఉగ్రవాదులు వారిని సైనికులుగా భావించి దాడికి పాల్పడ్డారు. ప్రాణభయంతో ప్రజలు పరుగులు పెట్టినా వెంటాడి కాల్పులు జరిపారని ప్రత్యక్ష సాక్షులు చెప్పినట్లు కథనాలు వెల్లడించాయి. తొలుత ఈ ఘటనలో 200 మంది మరణించినట్లు ఐరాస అంచనా వేసింది. కానీ, దాదాపు 600 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తాజాగా గణాంకాలు వెలువడ్డాయి. ఘటన తర్వాత మతదేహాలను సేకరించేందుకు స్థానిక అధికారులకు మూడు రోజుల సమయం పట్టిందని ఓ ప్రత్యక్ష సాక్షి వెల్లడించారు. ఈ దాడి తర్వాత బుర్కినా ఫాసో వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయి. కానీ, వారిని సైన్యం అణచివేసినట్లు తెలుస్తోంది. ఈ దేశంలో రెండుసార్లు సైన్యం తిరుగుబాటు చేసిన తర్వాత 2022లో మిలిటరీ జుంటా చేతుల్లోకి పాలన వచ్చింది. అప్పటి నుంచి ఇలాంటి ఊచకోతలు తరచూ జరుగుతున్నాయి. గతంలో మిలిటెంట్లకు సహకరిస్తున్నారని ఆరోపిస్తూ రెండు గ్రామాల్లోని దాదాపు 200 మందికి పైగా పౌరులను సైన్యమే కాల్చి చంపింది.

## ఇజ్రాయెల్ దాడిలో హమాస్ కీలక నేత మృతి



**బీరుట్:** ఇజ్రాయెల్ హెజ్బుల్లా మధ్య భీకర దాడులు కొనసాగుతున్నాయి. ఇజ్రాయిల్ తాజాగా జరిపిన వైమానిక దాడుల్లో హమాస్‌కు చెందిన కీలక నేత, ఆయన కుటుంబసభ్యులు మతి చెందారు. ఉత్తర లెబనాన్‌లో ట్రిపోలిలోని పలస్తీనా శరణార్థుల శిబిరంపై ఇజ్రాయిల్ వైమానిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో హమాస్‌కు చెందిన అల్ ఖసమ్ బ్రిగేడ్ సాయుధ విభాగంలో సభ్యుడైన సయిాద్ అతల్లా మతి చెందారు. ఈ దాడుల్లో అతల్లాతో పాటు ఆయన ముగ్గురు కుటుంబసభ్యులు సైతం మరణించినట్లు సమాచారం. ఈ మేరకు హమాస్‌కు చెందిన మీడియా వర్గాలు వెల్లడించాయి. ఇజ్రాయిల్‌కు చెందిన వార్తాసంస్థలు సైతం ఇదే విషయాన్ని ధవీకరించాయి. హమాస్ మిలిటెంట్ గ్రూపుల్లోని మరో అగ్ర నాయకుడు మరణించారని తెలిపాయి. లెబనాన్‌లో ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో ఇప్పటివరకు 2 వేల మందికి పైగా మతి చెందినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. అందులో 250 మంది హెజ్బుల్లాకు చెందినవారు ఉండటం గమనార్హం. బీరుట్‌లోని ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో హెజ్బుల్లా చీఫ్ హసన్ నస్రల్లా మరణించిన విషయం తెలిసిందే. దీంతో ఇజ్రాయిల్‌పై ఇరాన్ ప్రతీకారంగా 180 క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇజ్రాయిల్ ఇప్పటికే హెచ్చరించింది.

## ఇరాన్ అణుస్థావరాలు ధ్వంసం చేయండి



ఇజ్రాయిల్‌కు ట్రంప్ సూచన

**వాషింగ్టన్:** ఇరాన్ ఇజ్రాయిల్ మధ్య యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. దీనిపై అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరింత రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ అణుస్థావరాలను ధ్వంసం చేయాల్సిందిగా ఇజ్రాయిల్‌కు ట్రంప్ సూచించారు. నార్త్ కరోలినాలోని ఫయెట్‌విల్లేలో జరిగిన ప్రచార కార్యక్రమంలో ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఇరాన్ అణు కేంద్రాలను ఇజ్రాయిల్ లక్ష్యంగా చేసుకుందనే అంశంపై ఇటీవల అమెరికా అధ్యక్షుడు జోబైడెన్‌ను ఓ విలేకరి ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు బైడెన్ స్పందించలేదు. ట్రంప్ బైడెన్ వైఖరిని తప్పుబట్టారు. 'ఇరాన్ ఇటీవల ఇజ్రాయిల్‌పై జరిపిన క్షిపణి దాడులకు ప్రతిస్పందనగా... ఇరాన్ అణుస్థావరాలను ధ్వంసం చేయాలి. ఆ తర్వాత వాటి గురించి చింతించాలి' అని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ చమురు కేంద్రాలపై కాకుండా ఇజ్రాయిల్ ప్రత్యామ్నాయం ఆలోచించాలని జో బైడెన్ పేర్కొన్నారు. వైట్‌హౌస్ వద్ద విలేకరులతో ఆయన మాట్లాడుతూ 'ఇజ్రాయిల్ యుద్ధం విషయంలో ఓ నిర్ణయానికి రాలేకపోతుంది. ఆ విషయంపై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయి. నేను వారి స్థానంలో ఉంటే చమురుకే ంద్రాలపై దాడికి బదులు ప్రత్యామ్నాయాల గురించి ఆలోచిస్తాను' అని బైడెన్ పేర్కొన్నారు. ఇజ్రాయిల్‌తో సంబంధాలు అమెరికా ఎన్నికలపై ప్రభావం చూపుతాయో లేదో తనకు తెలియదని బైడెన్ వెల్లడించారు. యుద్ధం నేపథ్యంలో ఇజ్రాయిల్‌కు తానే ఎక్కువ సాయం అందించినట్లు పేర్కొన్నారు. కాగా, అమెరికాలో వచ్చే నెలలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో నవంబరులో జరిగే ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతాయని తాను విశ్వసించడం లేదని వ్యాఖ్యానించారు. 'ఈ ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఉంటాయని నేను విశ్వసిస్తున్నాను. అయితే, అవి ప్రశాంతంగా జరుగుతాయా లేదా అనేది తెలియదు. గత ఎన్నికల్లో ట్రంప్‌కు అనుకూలంగా ఫలితాలు వెలువడకపోవడంతో ఆయన చేసిన ప్రమాదకరమైన వ్యాఖ్యలే అందుకు కారణం' అని బైడెన్ పేర్కొన్నారు.

## సమాధి చేస్తే సహించం

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహరిస్తుందని ఆయన దుయ్యబట్టారు. ఈ విషయమై ఇండియా కూటమి నేతలంతా సంఘటితం కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మిగతా రాజకీయ పక్షాలు సైతం ఈ విషయమై పునరాలోచన చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కేవలం మైనారిటీలపై కక్ష సాధింపు చర్యగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వం తీరును ఈ సందర్భంగా ఆయన తప్పుపట్టారు. తెలంగాణ ప్రజానాట్యమండలి గాయని శ్యామల బృందం పాడిన విప్లవ గేయాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా తంజీమే ఇన్సాఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆయూబ్ అలీ, అలీగడ్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ఇన్సాఫ్ అహ్మద్, షేకిబుల్ రహేమాన్, నవాబ్ సాబ్, నూరి నిసాన్, ఇన్సాఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.ఎం.డి ఫాయాజ్, మునిర్ పటేల్, సిపిఐ జిల్లా కార్యదర్శి బృంగి బాలకిషన్ సురేష్, డి.రాము, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ, సి.రాజు శంకర, సత్యనారాయణ రెడ్డి, చాంద్ భాషా, మున్నా, ఖాజా లతో వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## హర్యానా పీఠం కాంగ్రెస్‌దే...

(మొదటి పేజీ తరువాయి)

అంచనా వేశాయి

**జమ్ము కశ్మీర్‌లో కూటమికి అవకాశం**

జమ్ముకశ్మీర్‌లో బిజెపికి కనిష్ఠంగా 20 గరిష్ఠంగా 32 స్థానాలు వస్తాయని సర్వే సంస్థలు పేర్కొన్నాయి. మెహబూబా ముఫ్తీకి చెందిన పిడిపి సింగిల్ డిజిట్‌కు పరిమితం కానుందని సర్వే సంస్థలు అంచనా వేశాయి. మొత్తం 90 స్థానాలకు గానూ మూడు విడతల్లో ఎన్నికలు జరిగాయి. ఫలితాలు అక్టోబర్ 8న వెలువడనున్నాయి. ప్రభుత్వ ఏర్పాటుకు 46 స్థానాలు అవసరం. 2014లో జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీకీ సరైన మెజారిటీ రాకపోవడంతో బిజెపి, పిడిపి ఉమ్మడిగా ప్రభుత్వం ఏర్పాటు చేశాయి. ఈ సారి ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు వేర్వేరుగా పోటీ చేశాయి. ఇండియా కూటమిలోని కాంగ్రెస్, ఎన్‌సిపి పొత్తుతో బరిలోకి దిగాయి. ఇక నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కూటమికి 46–50 స్థానాలు సాధించొచ్చని పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ అంచనా వేసింది. బిజెపి 23–27 స్థానాలు; పిడిపి 7–11 స్థానాలు; ఎఐపి 0–1, ఇతరులు 45 స్థానాలు గెలిచే అవకాశాలున్నట్లు తెలిపింది. కూటమిలో నేషనల్ కాన్ఫరెన్స్ 33–35, కాంగ్రెస్ 13–15 స్థానాలు గెలిచే అవకాశం ఉందని పేర్కొంది. జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రిగా ఎవరికి ప్రాధాన్యం ఇస్తారని సర్వేలో కోరగా మాజీ సిఎం ఒమర్ అబ్దుల్లాకు సుమారు 28 శాతం మంది మద్దతిచ్చారని సర్వే సంస్థ వెల్లడించింది. మిగిలిన వారంతా ఆయనకు చాలా దూరంలో నిలవడం గమనార్హం.అదే విధంగా పిడిపి 28, బిజెపి 25, కాంగ్రెస్ 12, ఎన్‌సిపికి 15, ఇతరులు 7 సీట్లు గెలుచుకుంటారని రిపబ్లిక్ మ్యాట్రిజ్ సంస్థ, పిడిపి 47, బిజెపి 20–25, కాంగ్రెస్,ఎన్‌సి కూటమి 35–40, ఇతరులు 12–16 గెలుచుకోవచ్చని దైనిక్ భాస్కర్, నేషనల్ కాన్ఫరెన్స్ కాంగ్రెస్ కూటమికి 40–48 సీట్లు రావొచ్చని ఇండియాటుడే సీఓటర్ సర్వే అభిప్రాయపడింది. బిజెపికి 27–32, పిడిపికి 6–12, ఇతరులకు 6–11 సీట్లు వస్తాయని అంచనా వేసింది. యాక్సిస్ మై ఇండియా సర్వే సంస్థ సైతం నేషనల్ కాన్ఫరెన్స్ కాంగ్రెస్‌కు 35–45 సీట్లు వస్తాయని అంచనా వేసింది. బిజెపికి 24–34, పిడిపి 4–6, ఇతరులకు 8–23 సీట్లు రావొచ్చని తెలిపింది.

## తలవంచితే ఏం ప్రయోజనం

(మొదటి పేజీ తరువాయి)

వంచి పాదాభివందనం చేస్తున్నానని ఆగస్టు 30వ తేదీన మోదీ పేర్కొన్నారు. నేవీ డే సందర్భంగా గత ఏడాది డిసెంబరు 4వ తేదీన ప్రధాని మోదీ సింధుర్గ్ జిల్లాలో 35 అడుగుల శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించగా, అది ఈ ఏడాది ఆగస్టు 26వ తేదీన కూలిపోయింది. కాగా, దేశంలో రెండు భావజాలాలు ఉన్నాయని, వాటిలో ఒకటి సమానత్వం, ఐక్యతపై చర్చిస్తూ రాజ్యాంగాన్ని పరిక్షిస్తుందని రాహుల్ అన్నారు. అదే శివాజీ భావజాలమన్నారు. మరొకటి రాజ్యాంగాన్ని విధ్వంసం చేస్తుందని చెప్పారు. కొందరు పొద్దున లేనప్పటి నుంచి రాజ్యాంగాన్ని ఎలా ధ్వంసం చేయాలని ప్రణాళికలు రచిస్తున్నారని మండిపడ్డారు. వారు దేశంలోని సంస్థలపై దాడి చేస్తున్నారని, ప్రజలను భయపెడుతున్నారని, బెదిరిస్తున్నారని, ఆ తరువాత మన్నించండీ అంటూ శివాజీ ముందు తలొంచుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఒకవేళ శివాజీ విగ్రహం ముందు ప్రార్థన చేయాలనుకుంటే రాజ్యాంగాన్ని పరిరక్షించాలన్నారు. ఉద్దేశాలు బహిర్గతమవుతాయని, వాటిని దాచలేమని అన్నారు. శివాజీ మహారాజ్ విగ్రహాన్ని నిర్మించిన కొద్దిరోజుల్లోనే కూలింది.. దీంతో వారి ఉద్దేశాలు సరిగా లేవని బయటపడిందన్నారు. శివాజీ మహరాజ్ విగ్రహాన్ని నిర్మిస్తే ఆయన ఆశయాలను కూడా పాటించాలని ఆ విగ్రహం సందేశం ఇచ్చిందని రాహుల్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఉదయం కొల్హాపూర్ చేరుకున్న రాహుల్‌కు మహారాష్ట్రలోని కాంగ్రెస్ అగ్రనేతలు, పార్టీ రాష్ట్ర విభాగం చీఫ్ నానా పటోలే, మాజీ మంత్రి బాలాసాహెబ్ థోరట్‌లు స్వాగతం పలికారు.

## అనాథలను చేయం



(మొదటి పేజీ తరువాయి)

ఆలోచన చేస్తోంది. మూసీ పరీవాహక పేదలను ఆదుకునేందుకు రూ.10వేల కోట్లు ఖర్చు చేయడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కెసిఆర్, కెటిఆర్‌కు నిజంగా పేదలపై ప్రేమ ఉంటే ఫామ్ హౌస్‌లో కొంత భూమిని పేదలకు దానం చేయండి. మీరు ఫామ్ హౌజుల్లో జమీందారుల్లా బతుకుతారు. పేదలు మాత్రం మూసీ ముంపులో బతకాలా? అవసరమైతే మలక్‌పేట్ రేస్ కోర్టును, అంబర్‌పేట్ పోలీస్ ఆకాడమీని హైదరాబాద్ బయటకు తరలించి పేదలకు ఇండ్లు కట్టిద్దాం'' అని అన్నారు. బిఆర్ఎస్ నేతలు కెటిఆర్, హరీష్ రావు, బిజెపి నేత ఈటలకు ఫాంహౌస్‌లను కాపాడుకునేందుకు వారికి ఉన్న శ్రద్ధ మూసీ పరీవాహక ప్రాంత వాసులపై లేదని విమర్శించారు. సోషల్ మీడియాతో అధికారంలోకి వస్తామని కొందరు కలలు కంటున్నారని, సోషల్ మీడియాతో అధికారంలోకి రావడం కాదు.. వాళ్లు చర్లపల్లి జైలుకు వెళ్లడం ఖాయం అని సిఎం వ్యాఖ్యానించారు. తెలంగాణ నుంచి జాతీయ స్థాయికి ఎదిగిన అతి కొద్దిమందిలో కాకా ఒకరని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాకాను కాంగ్రెస్ పార్టీ కోణంలో చూశారో లేక ఆయనను ప్రజల నుంచి దూరం చేయాలనుకున్నారో తెలియదు కానీ ఆయన జయంతిని అధికారికంగా మాత్రం నిర్వహించకపోవడం విచారకరమన్నారు. కాకా జయంతితో పాటు వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించినట్లు సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆనాడు తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ మరుగున పడకూడదని కాకా సోనియా గాంధీని ఒప్పించారన్నారు. ఇప్పుడు గొప్పలు చెప్పుకుంటున్న వాళ్లు ఆనాడు ఎన్నికల్లో గెలిచేందుకు కాకా సహకారం తీసుకున్నారని, అధికారంలోకి వచ్చిన తరువాత ఆయన జయంతిని అధికారికంగా జరపకుండా విస్మరించడం బిఆర్ఎస్ కుటిల నీతికి నిదర్శనమన్నారు. కాకా ఆశయాలను కొనసాగించాల్సిన కాంగ్రెస్‌పై బాధ్యత అందరిపై ఉందని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్లో కాకా కుటుంబ సభ్యుల పాత్ర క్రియాశీలకంగా ఉండాలన్నది కాంగ్రెస్ పార్టీ ఆలోచన అన్నారు.

**పెద్దపల్లిలో కాకా విగ్రహం పెట్టడం సముచితం: చాడ వెంకట్ రెడ్డి**

ప్రజా సమస్యల పరిష్కరించడంలో అగ్రభాగాన నిలిచిన గడ్డం వెంకటస్వామి విగ్రహాన్ని పెద్దపల్లిలో పెట్టడం సముచితంగా ఉంటుందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి సూచించారు. బడుగు, బలహీనవర్గాల నివాసం కోసం హైదరాబాద్‌లో గుడిసెలు వేయించి అనేక పోరాటాలు చేసి ఆ ఇళ్లు వారికే దక్కేలా చూశారని, వెంకటస్వామి ఉద్యమం ఎప్పటికీ మరువలేమన్నారు. అప్పట్లో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలే ప్రజల బాగోగులు చూసేవని, వెంకటస్వామి కార్మిక నాయకుడిగా అనేక పరిశ్రమల్లో సంఘాలు పెట్టి కార్మిక పక్షంగా నిలబడ్డారన్నారు. కమ్యూనిస్టు నేతలు మగ్దూం మెహియొద్దీన్, కెఎల్.మహేంద్ర, సత్యనారాయణ రెడ్డితో కలిసి కార్మికులకు అనేక హక్కులు సాధించడంలో దిట్టగా పేరు సంపాదించారన్నారు. ఆనాటి విలువలు, అంకిత భావం, వారి సేవా భావం ఎలా ఉందో కార్మిక యూనియన్లుగా కలిసి పోవడంలోనే అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోనూ కాకా పాత్ర అనిర్వచనీయమైనదన్నారు. రోశయ్య ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో కాకా కాంగ్రెస్ పార్టీలో ఉండి కూడా తెలంగాణ వాదాన్ని బలంగా వినిపించారన్నారు. వెంకటస్వామి కేంద్ర మంత్రిగా ఉంటూ సింగరేణి ప్రభుత్వ రంగంలో ఉండాలని కోరుకున్నారని, అది ఐఎన్‌టియుసి, ఎఐటియుసి పోరాటాల వల్ల సాధ్యమైందన్నారు.

**కాకా డాక్యుమెంటరీ వస్తే బావుంటుంది : కోదండరామ్** కాకా అంబేద్కర్ వారసుడిగా అణగారిన వర్గాల పక్షంగా నిలిచేవారని ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. సోషలిస్టుభావాలు ఉన్న ఆయన ప్రతినిత్యం కార్మిక, కర్షకుల శ్రేయస్సు కోసమే పరితపించేవారన్నారు. వారి జీవిత చరిత్ర పుస్తకంగా వచ్చిందని, దానిని ప్రతి ఒక్కరూ చదవాలని సూచించారు. అంతే కాకుండా ఆయన జీవిత చరిత్రను డాక్యుమెంటరీగా కూడా తీస్తే మరింత మందిలోకి వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. ఎంపిలు ఆవేశంతో కాకుండా ఆలోచనతో పని చేయాలని కాకా సూచించే వారన్నారు.

## ముగ్గురిని బలిగొన్న ఆన్‌లైన్ బెట్టింగ్

(మొదటి పేజీ తరువాయి)

అప్పుల పాలు కావడం ఉన్న పొలం అమ్మినా అప్పులు తీరక పోవడంతో అప్పుల ఒత్తిళ్లు తీవ్ర మవ్వడంతో చేసేది లేక కొడుకుతో పాటు తల్లిదండ్రులు ఉరి వేసుకొని మృతి చెందడం జిల్లాలో కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన భార్యభర్తలు రంగవేణి, సురేష్(53), హేమలత(45)లకు కుమారుడు హరీష్ (22) ఉన్నాడు. అతడికి చిన్నప్పటి నుంచి బెట్టింగ్ అలవాటు ఉంది. వాటికోసం అప్పులు చేస్తుంటాడు. ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు పాల్పడుతూ దాదాపు రూ.40లక్షల దాకా అప్పులు చేసినట్లు సమాచారం. కొడుకు తీరు మారకపోవడం, అప్పులు గుదిబండలాగా మారడంతో తల్లిదండ్రులు రంగవేణి సురేష్, హేమలతలు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. కొడుకు చేసిన అప్పులను తీర్చేందుకు తీవ్రంగా ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో తమకు జీవనాధరంగా ఉన్న అర ఎకరం అమ్మేశారు. దాదాపు రూ. 20లక్షల వరకు అప్పులు తీర్చారని గ్రామస్తులు చెప్పారు.

ఇంకా అప్పులు తీర్చాల్సినవి భారీగా ఉండటంతో వారి శక్తికి మించినవిగా మారాయి. గ్రామంలో చిన్న కిరాణ కొట్టు నిర్వహిస్తున్న రంగవేణి సురేష్, హేమలత దంపతులు గ్రామంలో ఓ రైతుకు చెందిన పొలాన్ని కౌలుకు తీసుకొని పలు రకాల కూరగాయాలు పండిస్తున్నారు. తలకు మించిన భారం కావడంతో చేస్తున్న పనితో అప్పులు తీర్చే మార్గం లేక ఆ తల్లిదండ్రులు కొడుకుతో పాటు తనువు చాలించారు. అప్పులు ఇచ్చిన వారి వేధింపులు తట్టుకోలేకపోయారని స్థానికులు పేర్కొంటున్నారు. అప్పులు తీర్చడానికి ఆస్తులు లేకపోవడంతో మరోమార్గం లేక అప్పులు తీర్చాలేమనే భయంతో వారు ప్రాణాలు తీసుకున్నారు. శుక్రవారం గ్రామంలో బతుకమ్మ పండగ నిర్వహించగా ఆ కుటుంబం మాత్రం ఆ వేడుకల్లో పాల్గొనలేదు. శుక్రవారం రాత్రికి గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో జీవితంపై విరక్తి వస్తుందని తెల్పడం, ఉదయం ఇంట్లో చీరతో ఉరి వేసుకొని ముగ్గురికి ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడి విగతజీవులుగా పడి ఉన్నారు. ఆన్‌లైన్ భూతం ముగ్గురి ప్రాణాలను బలితీసుకుంది. ఈ ఘటన గ్రామంలో విషాదఛాయలను నింపింది. శనివారం తెల్లవారుజామున సమీప కాలనీ వాసులు వచ్చి చూసే సరికి ముగ్గురు కుటుంబ సభ్యులు అచేతనంగా పడి ఉండటంతో వారు పోలీసులకు సమాచారం అందించారు.

గ్రామస్థుల సమాచారంతో ఘటన స్థలానికి బోధన్ ఎసిపి శ్రీనివాస్, ఎడపల్లి పోలీసులు వచ్చి విచారణ చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## ఎన్‌కౌంటర్ మృతులు @31

(మొదటి పేజీ తరువాయి)

మృతదేహాలను పూర్తిస్థాయిలో గుర్తించి పేర్లతో సహా ఆ ప్రభుత్వం ప్రకటించలేదు. మృతుల్లో 18 మంది పురుషులు కాగా 13 మంది మహిళలు ఉన్నారు. ఇందులో 25 లక్షల అవార్డు ఉన్న పిఎల్‌జిఏ నేత నీతి అలియాస్ ఊర్మిలా కూడా ఉన్నారు. మృతుల్లో రూ.6 లక్షలు, రూ.9 లక్షల రివార్డు గల మావోయిస్టులు ఉన్నట్లు ఛత్తీస్‌గఢ్ పోలీసులు తెలిపారు. ఇప్పటి వరకు 13 మృతదేహాలను వివరాలు పోలీసులు తెలుసుకున్నారు.

**మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బ**

మావోయిస్టు పార్టీ వారోత్సవాల వేళ అబూజ్మడ్‌లో పార్టీకి కోలుకోలేని దెబ్బతగిలింది. ఇది చరిత్రలో అతిపెద్ద రెండో ఘటనగా చెబుతున్నారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషన్ కగార్ పేరుతో గత కొద్దినేలలుగా ఆపరేషన్‌ను ముమ్మరం చేశారు. గడిచిన తొమ్మిది నెలల్లో ఇప్పటి వరకు 188 మందిని ఆపరేషన్ కగార్ పేరుతో హతమార్చారు.

## హైడ్రాకు 'హై పవర్స్'

(మొదటి పేజీ తరువాయి)

చెరువులు, నాలాలపై అక్రమ నిర్మాణాల కూల్చివేతల కోసం రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను రంగంలోకి దింపిన విషయం తెల్సిందే. జూలై 19న జి.ఓ 99 ద్వారా హైడ్రాను ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి వరుసగా హైడ్రా అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేస్తూ దూసుకెళ్లింది. ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న అనేక అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. అయితే ఈ కూల్చివేతలపై పలు చోట్ల తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించారు. హైడ్రా చట్టబద్ధతపై కోర్టు కూడా ప్రశ్నించింది. జి.ఓ 99పై స్టే ఇవ్వాలంటూ అనేక మంది హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ క్రమంలో హైడ్రాకు ఎదురవుతున్న ఆటంకాలు తొలగిస్తూ ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ రూపకల్పన చేసింది. జిహెచ్ఎంసి చట్టం 1955లో 374 బి సెక్షన్ చేరుస్తూ ఆర్డినెన్స్ జారీ చేశారు. ఓఆర్ఆర్ పరిధి వరకు ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, నాలాలు పరిరక్షిస్తూ సర్వాధికారాలు ఇచ్చేలా చట్టం రూపొందించారు. జిల్లా కలెక్టర్, తహసీల్దార్ అధికారాలను హైడ్రాకు బదలాయించారు. ఈ ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఆమోదం తెలపడంతో ఫైల్‌ను రాజ్‌భవన్‌కు పంపింది. ఈ ఆర్డినెన్స్‌కు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆమోదం తెలిపారు. గవర్నర్ వ్యక్తం చేసిన పలు సందేహాలకు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ ఇప్పటికే వివరణ ఇచ్చారు. ప్రభుత్వ వివరణలతో సంతృప్తి చెందిన గవర్నర్ హైడ్రా ఆర్డినెన్స్‌పై సంతకం చేశారు. ఆపై గెజిట్‌ను విడదల చేశారు.

**ఆస్తుల రక్షణ బాధ్యత ఇక హైడ్రాదే..**

హైదరాబాద్ మహానగరం భౌగోళికంగా 625 చదరపు కిలోమీటర్ల విస్తరించి ఉండటం, జీవనోపాధి, ఆర్థిక, పారిశ్రామిక కార్యకలాపాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో ఉత్తమ నివాసయోగ్యమైన నగరాల్లో ఒకటిగా గుర్తింపు తెచ్చుకున్నట్లు గెజిట్‌లో వెల్లడించింది. ఫార్మా, బయోటెక్నాలజీ, ఐటీ, ఐటీఈఎస్ మొదలైన రంగాలలో ఫార్చ్యూన్ 500 కంపెనీలకు హైదరాబాద్ నగరం ప్రాధాన్యత నిస్తూ పెట్టుబడుల గమ్యస్థానంగా మారింది. ప్రగతి శీల విధానాల ద్వారా రాబోయే కాలంలో మరిన్ని సంస్థలు ముందుకు వస్తున్నట్లు తెలిపింది. ఈ పరిస్థితుల్లో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలు నగరాన్ని అతలాకుతలం చేస్తుండటంతో వాటి నిర్వహణ కోసం ప్రత్యేక వ్యవస్థ అవసరం ఉందని ప్రభుత్వం గుర్తించింది. ప్రకృతి వైపరీత్యాలను, విపత్తులను ఆ వ్యవస్థ ద్వారా సమర్థవంతంగా నిర్వహించవచ్చని, నీటి వనరులు, పార్కులు, ప్రభుత్వ స్థలాలు, విలువైన ఆస్తులను ప్రభుత్వం ఏర్పాటు చేసే ఏజెన్సీ ద్వారా ఆక్రమణలకు గురికాకుండా అడ్డుకోవచ్చని గెజిట్‌లో ప్రభుత్వం పేర్కొంది. విపత్తులు, ఆస్తుల రక్షణ కోసం ప్రత్యేక ఏజెన్సీ సేవలను వినియోగించుకోవాలంటే జిహెచ్ఎంసి చట్టం 1955కు అవసరమైన సవరణలు చేయడం తప్పనిసరిగా పరిగణించాలని భావించింది. అసెంబ్లీ సమావేశాలు లేనందున గవర్నర్ తక్షణ ఆమోదం కోసం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 213 క్లాజ్ 1 ద్వారా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆర్డినెన్స్ 2024ను పంపింది. ప్రధాన చట్టంలోని సెక్షన్ 374ఏ తర్వాత కొత్త సెక్షన్‌గా ప్రభుత్వ ఆస్తుల రక్షించే అధికారం కల్పిస్తూ సెక్షన్ 374 బిని చేర్చారు. ఈ సెక్షన్ కింద ఏజెన్సీకి అధికారం ఇవ్వడానికి ప్రభుత్వానికి అధికారం ఇచ్చారు. ప్రస్తుతం ఆర్డినెన్స్‌కు అనుగుణంగా జి.ఓ 99లోనూ మార్పులు జరుగనున్నాయి. దీంతో హైడ్రాకు మరిన్ని అధికారాలు సమకూరనున్నాయి.

## అతిత్వరలో కొత్త రెవెన్యూ చట్టాలు

(మొదటి పేజీ తరువాయి)

సంతోషమని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. గత రెండు నెలలుగా రెవెన్యూ అధికారులు నిర్విరామంగా కృషి చేస్తున్నారని, తిరుమలగిరి సాగర్ లోని భూముల సమస్యల పరిష్కారం కోసం తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. ఫారెస్ట్ భూములకు సంబంధించి సంయుక్త తనిఖీలు నిర్వహించి , ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు ఇవ్వాలని, అలాగే రిహాబిలిటేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

**పకడ్బందీగా సర్వే చేశాం : జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి**

తిరుమలగిరి సాగర్ లో పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన, నూతన చట్టం కింద నిర్వహించిన సర్వే వివరాలను పకడ్బందీగా నిర్వహించాం అట్టి భూముల వివరాలను గ్రామ పంచాయితీ జాబితాలో ప్రదర్శించడం జరిగిందని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. మండలం మొత్తంలో 14 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని , 8 గ్రామాలలో భూ సమస్యలు ఉండగా, పట్టాల భూములలో సైతం సమస్యలు ఉన్నాయని, 8597 ఎకరాలు ప్రభుత్వ భూమి ,3400 ఎకరాలు ఫారెస్ట్ భూమి ఉందని, మొత్తం 16600 ఎకరాలు రెండు నెలల్లో సర్వే చేయడం జరిగిందని, గ్రామసభలు నిర్వహించి ప్రతి సర్వే నంబర్లో ఎంజాయ్ మెంట్ సర్వే నిర్వహించి తర్వాత గ్రామ పంచాయతీలో జాబితాను ప్రదర్శించి వాటిపై ఏదైనా అభ్యంతరాలు వస్తే పరిష్కరించడం జరిగిందని, మిస్సింగ్ సర్వే నంబర్లను స్పష్టంగా రాయడం జరిగిందని తెలిపారు.సమావేశంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, నాగార్జునసాగర్ శాసనసభ్యులు జయవీర్, మిర్యాలగూడ శాసన సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి కర్ణటి లింగారెడ్డి , రైతులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీపై మంత్రి సీతక్క ఫైర్..

## రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు ప్రధాని మోదీకిలేదు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహారాష్ట్రలో తెలంగాణ ప్రభుత్వంపై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై మంత్రి సీతక్క మండిపడ్డారు. మోదీ వ్యాఖ్యలను సీతక్క తీవ్రంగా ఖండించారు.తన పదేండ్ల పాలనలో రైతులకు పైసా రుణ మాఫీ చేయని ప్రధాని, తెలంగాణ ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నల్ల చట్టాలు తెచ్చి అన్నదాతలకు నరకం చూపిన వ్యక్తి మోదీ అని పేర్కొన్నారు. ఢిల్లీ నడి వీధుల్లో 700 మంది రైతుల మరణానికి కారణమయ్యాడని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన ఎన్నికల హామీలను విస్మరించడంలో మోడీ నెంబర్ వన్‌గా నిలిచాడన్నారు.60 ఏళ్లు దాటిన రైతులకు పెన్షన్ ఇస్తామని 2019 ఎన్నికల్లో హామీ ఇచ్చిన విషయాన్ని మరచిపోయిన విషయాన్ని సీతక్క గుర్తు చేసింది.ఐదేళ్లు దాటినా ఇప్పటికీ రైతుల పించెన్ ఊసే లేదని విమర్శించారు. కిసాన్ సమ్మాన్ నిధి పెంచుతామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. సెస్ ల పేరుతో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి రైతులపై పంట ఖర్చుల భారాన్ని మోదీ మోపారన్నారు. పంట ఖర్చులకు అనుగుణంగా కనీస మద్దతు ధర పెంచలేదన్నారు. ప్రధాని పంటల బీమా పథకంలో తన వాటా నిధులను తగ్గించిన చరిత్ర మోదీదని పేర్కొన్నారు. ఎరువులు, క్రిమిసంహారక రసాయనాలపై సబ్సిడీ తగ్గించి ధరలు పెంచింది మోదీనేనన్నారు.అన్నదాతను అడుగడుగున దాగా చేసి ఇప్పుడు మహారాష్ట్ర ఎన్నికల కోసం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు.ఏకకాలంలో 23 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిది అని గుర్తు చేశారు. సాంకేతిక సమస్యలతో రుణమాఫీ కానీ రైతులందరికీ రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చామని మరో సారి సీతక్క స్పష్టం చేశారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తాం . అయినా బిఆర్ఎస్, బిజెపిలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. అందుకే ఇక్కడ బిఆర్ఎస్ ధర్నాలు, అక్కడ మోదీ విమర్శలు అని దుయ్యబట్టారు.మహారాష్ట్ర ఎన్నికల కోసమె కాంగ్రెస్‌ను బిజెపి, బిఆర్ఎస్ టార్గెట్ చేస్తున్నాయని విమర్శించారు. బిజెపి, బిఆర్ఎస్‌లు కూడబల్కొని వ్యవహరిస్తున్నారన్నారు. 8విడతల్లో అరకొరగా రుణమాఫీ చేసిన బిఆర్ఎస్ నేతలు ఇప్పుడు కాంగ్రెస్ ని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. మోదీకి చిత్తశుద్ధి ఉంటే దేశవ్యాప్తంగా రైతు రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించడం మానుకొని ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలన్నారు. పేదల నివాస గృహాలకు ఉచిత విద్యుత్ ఇస్తామన్న మోదీ మాటను నిలబెట్టుకోవాలని హితవు పలికారు.

## పిఎంహెచ్ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి : తమ్మినేని

**ప్రజాపక్షం / హైదరాబాద్:** ఈ నెల 12వ తేదీన దసరా ఉన్నందున మానవతా దృక్పధంతో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు వెటనే పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించి, పిఎఫ్, ఇఎస్ఐ తదితర సౌకర్యాలను కొనసాగించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులకు నష్టం కలిగిస్తున్న 527 జిఒను రద్దు చేసి, పాత జిఓ 60 ను అమలు చేయాలలని ఆయన విజ్ఞప్తి చేశారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు గత 19 నెలల నుండి వేతనాలు చెల్లించలేదని, ఈ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకు 2022 అక్టోబర్ వరకు నెలకు రు.12వేల చొప్పున వేతనం చెల్లించారని, 2017 సంవత్సరం లో 527 జిఓ తెచ్చి క్యాటరింగ్ విధానం అమలు చేసి వీరి వేతనంలో రూ.2800లు తగ్గించారని, గతంలో ఉన్న సిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కూడా తొలగించారని ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

## 27,28న గోదావరి ఖనిలో... ఎఐవైఎఫ్ రాష్ట్ర స్థాయి వర్క్ షాప్

### వాల్ పోస్టర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పెద్దపల్లి జిల్లా, గోదావరిఖనిలో ఈ నెల 27,28 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ ను జయప్రదం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. శనివారంహైదరాబాద్‌లోని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఎఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశంలో నాయకులు వర్క్ షాప్ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వలీ ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు మాట్లాడుతూ దేశంలో యువజన సామర్థ్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రధానంగా దేశంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కాలయాపన చేయడంతో నిరుద్యోగ సమస్య అంతకంతా పెరిగిపోవడమే కాకుండా దేశ ఆర్థిక ప్రగతి సైతం కుంటుపడుతోందన్నారు, ఉపాధి ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయకుండా ఏ ప్రభుత్వం కూడా ఉద్యోగ అవకాశాలు కల్పించలేవని తెలిపారు.పాలకులు ఎంతసేపటికీ ప్రైవేట్, కార్పొరేట్ పెట్టుబడిదారీ వ్యవస్థలపైనే ఆధారపడినంత కాలం దేశ ఆర్థిక సమతుల్యత సాధ్యం కాదన్నారు. పాలకుల చర్యల కారణంగా దేశంలో గత 10 ఏళ్లలో వందలాది ప్రభుత్వ రంగ సంస్థలు మూతపడ్డాయని, ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఈ నెల 27,28 తేదీలలో పెద్దపల్లి జిల్లా, గోదావరిఖని లో రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ నిర్వహిస్తున్నామని, ఈ వర్క్ షాప్ లో ప్రధానంగా నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు, పాలకుల విధానాలు తదితర అంశాలపై బోధనలు, చర్చలు, నిర్ణయాలు ఉంటాయని, ఈ వర్క్ షాప్ కు రాష్ట్రం నలుమూలల నుండి యువజన నాయకత్వం పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ వెంకటేశ్వర్లు, కునుకుంట్ల శంకర్, బిజ్జ శ్రీనివాసులు, టి.సత్య ప్రసాద్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

# దేవాదాయ శాఖలో మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర

● జూనియర్ అసిస్టెంట్‌లకు గ్రేడ్ 3 ఇఒలుగా పదోన్నతులు ● గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులను అణచివేసిందని మంత్రి కొండా సురేఖ ఆగ్రహం ● దేవాలయాల ప్రగతికి, దేవాలయాల ఆస్తుల పరిరక్షణకు ఉద్యోగులు పునరంకితం కావాలన్న మంత్రి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేవాదాయ శాఖలో ఉద్యోగుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. పదోన్నతి కోసం దాదాపు మూడు దశాబ్దాలుగా కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూసిన జూనియర్ అసిస్టెంట్స్‌లకు గ్రేడ్ 3 ఇఒలుగా దేవాదాయ శాఖ ప్రమోషన్ కల్పించింది. జీవో 134 ద్వారా మొత్తం 33 మంది జూనియర్ అసిస్టెంట్ లు ఇఒలుగా పదోన్నతి పొందటంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీవ్ర అణచివేతకు గురైన తమకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో న్యాయం లభించిందని ఉద్యోగులు భావోద్వేగానికి గురైన సన్నివేశాలకు నేడు తెలంగాణ సెక్రటేరియట్ వేదికగా నిలిచింది. తమకు దసరా పండుగ వారం రోజులు ముందుగానే వచ్చిందని వారు అమితానందాన్ని వ్యక్తం చేశారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా వీరంతా శనివారం ప్రమోషన్ పత్రాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు, అడిషనల్ కమిషనర్ జ్యోతి, దేవాదాయ శాఖ దేవాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్, పదోన్నతి పొందిన ఇఒలు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, నేడు 33 మంది జూనియర్ అసిస్టెంట్లకు గ్రేడ్ 3 ఇఒలుగా తన చేతుల మీదుగా ప్రమోషన్ పత్రాలు అందివ్వడం చాలా ఆనందంగా వుందన్నారు. ఒక సంతకంతో వారికి ప్రమోషన్లు కల్పించేందుకు కూడా గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులను తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిందని అన్నారు. ఉద్యోగులకు సంబంధించిన ప్రమోషన్స్ అనేవి సాధారణ ప్రక్రియలో భాగమనీ, అటువంటి ప్రమోషన్స్‌ను కూడా చేపట్టకుండా బిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులను మానసికంగా హింసించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజలకు, ఉద్యోగులకు సంబంధించిన ఏ సమస్యనైనా త్వరిత కాలంలోనే పరిష్కరిస్తుందని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. నాడే వారికి ప్రమోషన్స్ వచ్చుంటే వారి సేవలతో దేవాదాయ శాఖ మరింత బలోపేతమయ్యేదనీ, పెండింగ్ సమస్యలకు పరిష్కారం లభించేదని అన్నారు. ఇప్పటికే గ్రేడ్ 1, గ్రేడ్ 2 ఈవోలుగా పలువురికి ప్రభుత్వం ప్రమోషన్లు కల్పించిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు.

కొత్త ఇఒలుగా బాధ్యతలు చేపట్టిన ఉద్యోగులు దేవాలయాల అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మంత్రి సూచించారు. కోర్టు కేసుల్లో వున్న దేవాలయ భూములకు విముక్తి ప్రసాదించేందుకు దేవాదాయ శాఖ లీగల్ ఆఫీసర్‌ను నియమించనుందని మంత్రి తెలిపారు. ఇక నుంచి ఆలయ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం తరపున చేయాల్సిన కార్యక్రమాలను నిబద్ధతతో చేపడతామని స్పష్టం చేశారు.

## ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యం

### ఆ దేశ వ్యవసాయమంత్రి రోజేర్స్‌తో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** ఫిలిప్పీన్స్‌కు దేశానికి తెలంగాణ బియ్యం ఎగుమతి చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులకు సంబంధించి ఆ దేశ వ్యవసాయ శాఖ మంత్రి రోజేర్స్‌తో శనివారం పౌర సరఫరాల భవన్ నుంచి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడు తూ ఇద్దరు మంత్రుల చర్చలు స్నేహపూర్వక, సానుకూల వాతావరణంలో సాగినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి మంత్రులిద్దరూ ఒకరికొకరు పూర్తి సహకారంతో ముందకు సాగాలని, ఒప్పందం త్వరలో కార్యరూపం దాల్చాలని ఆకాంక్షించారు.నాణ్యత కారణాల వల్ల ఫిలిప్పీయన్లు గత కొన్ని ఏళ్లుగా మనదేశం నుండి బియ్యాన్ని దిగుమతి చేసుకోవడం ఆపివేశారని, అయితే తెలంగాణ రాష్ట్ర బియ్యం గణనీయంగా మెరుగుపడడంతో ఎగుమతి కోసం చర్చలు జరిపామని తెలిపారు. తమ చర్యలు ఫలికృతమైతే తెలంగాణ రాష్ట్ర బియ్యం ఫిలిప్పీయన్లకు ఎగుమతికి మార్గం సుగమమం కానుందన్నారు. ఇది సాకారమైతే, తెలంగాణ పౌర సరఫరాల శాఖకు ఇది మరో మంచి అవకాశం అవుతుందని తెలిపారు. మెరుగైన నాణ్యత కారణంగా, మన బియ్యం కొన్ని సంవత్సరాల విరామం తర్వాత ఒక దేశానికి ఎగుమతి అయ్యే అవకాశం ఉందని చెప్పారు. అంతకు ముందు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఫిలిప్పీయన్లకు 3 ఎల్ఎంటి వరకు వరి ఎగుమతి చేసే అవకాశాలకు సంబంధించి సివిల్ సప్లైస్ కమిషనర్ డి.ఎస్‌చౌహాన్, ఈ రంగాలలోని పలువురు నిపుణులతో చర్చించారు.

## పేదలకు పెద్దదిక్కుగా నిలిచిన వెంకటస్వామి

### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అధికారంలో ఉన్న లేకపోయినా ప్రభుత్వాలపై ప్రభావాన్ని చూపిన గొప్ప వ్యక్తి గడ్డం వెంకటస్వామి అని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాదులో ఎవరికైనా ఇబ్బంది ఉంటే చెప్పుకోవడానికి వెంకటస్వామి పెద్దదిక్కుగా ఉండేవారని గుర్తు చేసుకున్నారు. హైదరాబాదులో బతకడానికి వచ్చిన వారికి గుడిసెలు వేయించి గడ్డం వెంకటస్వామి గుడిసెల వెంకటస్వామిగా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. 1983 తర్వాత ఈ రాష్ట్రంలో దళిత వర్గాలు ఇబ్బందులకు గురయ్యాయని, పదిరి కుప్పం, నీరుకొండ వంటి సంఘటనలు జరిగినప్పుడు బాధితులకు అండగా నిలబడిన గొప్ప తాత్వికవేత్త వెంకటస్వామి అని డిప్యూటీ సిఎం కొనియాడారు. బలమైన లక్ష్యాలు ఉంటే పేదరికం, కులం అనేవి అడ్డంకులు కావని కాకా వెంకటస్వామి నిరూపించారని, మనందరికీ స్ఫూర్తిగా నిలిచారని అన్నారు.

## డిజిపి కార్యాలయంలో వెంకటస్వామి జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:**మాజీ కేంద్రమంత్రి జి.వెంకటస్వామి జయంతి వేడుకలను రాష్ట్ర డిజిపి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డిజిపి స్వాతిలక్రా వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ ప్రభుత్వం వెంకటస్వామి జయంతిని రాష్ట్ర స్థాయి వేడుకగా నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో శనివారం నాడు డిజిపి కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 'కాకా' గా పేరు పొందిన జి. వెంకటస్వామి భారత రాజకీయాలలో, సామాజిక సంక్షేమంలో ఒక ప్రముఖ వ్యక్తిగా ఎదిగారని స్వాతిలక్రా పేర్కొన్నారు. కేంద్ర మంత్రిగా, ఎమ్మెల్యేగా, ఎంపిగా పనిచేసి సింగరేణి కార్మికులు, అట్టడుగు వర్గాల జీవితాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. నిరాశ్రయులైన వారికి వేలాది గుడిసెలు నిర్మించడం వంటి కార్యక్రమాలతో సహా పేదల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి తో సమాజంలో చెరగని ముద్ర వేశారని స్వాతిలక్రా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐజి రమణ కుమార్, డిజిపి కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొని దివంగిత నాయకుడికి నివాళులర్పించారు.

### పేదల అభ్యున్నతి కోసం పోరాడిన నేత గడ్డం : గుత్తా



పేద ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడిన నేత గడ్డం వెంకటస్వామి అని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కొనియాడారు. మాజీ కేంద్రమంత్రి దివంగత గడ్డం వెంకటస్వామి ( కాకా) జయంతి సందర్భంగా తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసన సభ వ్యవహారాల శాఖామంత్రి డి.శ్రీధర్‌బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ వెంకట్‌స్వామి కార్యకర్త స్థాయి నుండి కేంద్ర మంత్రి స్థాయికి ఎదగడం గమనార్హమన్నారు. ఆయన ఎప్పుడు ఎవరిని కలిసినా పేద ప్రజల సమస్యల గురించి చర్చించేవారన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన కృషి ఎనలేనిదని సుఖేందర్‌రెడ్డి గుర్తుచేశారు. ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు పూల మాలలు వేసి ఎంఎల్‌సిలు ఎం.ఎస్.ప్రభాకర్‌రావు, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, టి.జీవన్‌రెడ్డి, దండే విఠల్, రఘోత్తమ్ రెడ్డి, ఎంఎల్ఎలు గడ్డం వివేక్, గడ్డం వినోద్, మాజీ ఎంపి రంజిత్‌రెడ్డి , లేజిస్లేచర్ సెక్రెటరీ డా' నరసింహా చార్యులు తదితరులు వెంకట్‌స్వామికి నివాళులు అర్పించారు.

## సచివాలయంలో బతుకమ్మ సంబరాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** డా.బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ ఉత్సవాలను శనివారం సాయంత్రం అత్యంత ఘనం గా నిర్వహించారు. రాష్ట్ర మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనుసూయ ముఖ్య అతిధి గా హాజరయ్యారు. తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ బతుకమ్మ ఉత్సవాలలో సచివాలయంలోని ఉన్నతాధికారుల నుండి అన్ని స్థాయిల్లోని మహిళా ఉద్యోగులు అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు. తీ రొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళా ఉద్యోగులు, వారి పిల్లలు, చిన్నారులు అంతా ఒక చోట చేరి ఆటపాటలతో సంబరాలు చేశారు. దాండియా, బతుకమ్మ ఆటపాటల మధ్య జరిగిన ఈ ఉత్సవాలలో సచివాలయ ఉన్నతాధికారులు, ఉద్యోగుల సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**గాంధీభవన్‌లో..** గాంధీ భవన్‌లో మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావ్ అధ్యక్షతన మహిళ బతుకమ్మ సంబరాలు జరిగాయి. బతుకమ్మ సంబరాలను టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రారంభించిశుభాకాంక్షలు తెలిపారు. సంప్రదాయ బద్ధంగా గౌరమ్మ పూజలు చేసి మ హిళా నేతలు బతుకమ్మ ఆటలు ఆడారు.ఈ ఉత్సవాలలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, టిపిసిసి ప్రధాన కార్యదర్శి రవళి రెడ్డి తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

## నీలోఫర్ ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికులపై అసత్య ఆరోపణలు దురదృష్టకరం

### తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ్మ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిలోఫర్ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు వసూళ్లకు పాల్పడుతున్నరంటూ అసత్య ఆరోపణలతో వార్తలు రావడం దురదృష్టకరమని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ్మ విచారం వ్యక్తం చేశారు. శనివారం నిలోఫర్ ఆసుపత్రి కార్మికులతో ఆయన సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా నరసింహ్మ మాట్లాడుతూ దాదాపు 600 మంది కాంట్రాక్ట్ శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులు పనిచేయుచున్నటు వంటి నీలోఫర్ ఆసుపత్రిలో పనిచేస్తున్నారని, వీరంతా పేదవారన్నారు. గతంలో నీలోఫర్ ఆసుపత్రి ఎస్‌పిఎఫ్ విభాగంలో పని చేసిన ఓ అధికారి అరాచకాలకు పాల్పడడంతో ఈ విభాగం నుంచి తప్పించారని, దీంతో కక్షకట్టిన ఆయన కార్మికులకు అన్యాయం చేసే పద్ధతుల్లో ప్రచారం చేస్తున్నారని, ఈ తప్పుడు వార్తలకు ఆయనే కారణమని ఆరోపించారు. అనేక సంవత్సరాలుగా అతి తక్కువ జీతాలతో దాదాపు 600 మంది కాంట్రాక్టు కార్మికులు రోజువారిగా వందలాంది మంది పేషంట్లకు సేవలు అందిస్తున్నారని, ఆస్పత్రిలో అడుగడుగునా సిసి కెమెరాలు సైతం ఉన్నాయని కానీ వీటన్నింటినీ పట్టించుకోకుండా ఆసుపత్రిలో ఏదో జరిగిపోతుంది అని పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం వేసినట్లు పేద కార్మికులకు అన్యాయం చేసే పద్ధతుల్లో వార్తను ప్రచురించడం ఆక్షేపనీయమన్నారు. ఈ కార్మికులకు ప్రభుత్వం నుండి గత మూడు నెలలుగా బిల్లులు రాకపోవడంతో గత నెల జీతం ఈ నెలలో ఇప్పటి వరకు కూడా చెల్లించలేదని, ఇలాంటి వార్తల వల్ల వీరి జీతాలు మరింత వెనక్కి వెళ్లడానికి ఆస్కారం ఉంటుందని తద్వారా పేదలకు అన్యాయం చేసినట్లు అవుతుందని వారు వివరించారు. వందలాదిమంది కార్మికులు ఉన్నచోట ఒకరో ఇద్దరో తప్పులు చేయడం సహజం అని అలాంటి వారిని గతంలో కూడా ఆసుపత్రి అధికారులు అనేకమార్లు ఉద్యోగాల నుండి తొలగించిన ఘటనలు కూడా ఉన్నాయని అలాంటివి ఏవి రాయకుండా కేవలం డబ్బులు వసూలు చేస్తున్నారు అని మాత్రమే రాయటం సమంజసం కాదని వారు పేర్కొన్నారు. కొన్ని వార్డులకు సంబంధించి కొంతమంది అధికారులు వారికి అనుకూలైమన కార్మికులు వారికి నచ్చిన వార్డులను కేటాయిస్తున్నారని దీనిని నివారించాలని ఆసుపత్రి సూపరింటెంట్ ను కోరామన్నారు. అదేవిధంగా కార్మికులు పేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతో విధులు నిర్వహించాలని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకూడదని కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు హసీనా బేగం తో పాటు కార్మికులందరూ పాల్గొన్నారు.

## ఆర్‌టిసి అమరుల ఆశయాలు నెరవేరాలంటే కార్మికుల సమస్యలన్నీ పరిష్కరించాలి

### టిజిఎస్‌ఆర్‌టిసి జెఎసి



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** ఆర్‌టిసి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనన ఉద్యమంలో అమరులైన 34 మం ది కార్మికులకు టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి ఘనంగా నివాళ్లు అర్పించింది. ఆర్‌టిసి జెఎసి ఆధ్వర్యంలో శనివారం అర్‌టిసి అమరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెబిఎస్ ముందు ఏర్పాటు చేసిన సంస్కరణ దినం కార్యక్రమాన్ని ఉద్దేశించి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి మౌ లానా, కోకన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి యాదగిరిలు మాట్లాడుతూ 2019లో ఆర్‌టిసి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 53 రోజులు వీరోచితమైన సమ్మె చేసినప్పటికీ నాటి ముఖ్యమంత్రి నియంతలా వ్యవహరిస్తూ ఉద్యోగులపై ఎస్మా చట్టం ప్రయోగించి ఉద్యోగాలు ఊడగొడతానని బెదిరింపుల కు పాల్పడడం దుర్మార్గమన్నారు. అమరుల ఆశయాలు నేటికీ నెరవేరకపోవడం చాలా విచారకరమన్నారు. ఏ ఆశయాలకోసం బలిదానాలు చేసుకున్నారో వారికి ఆత్మశాంతి బేకూర్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం డిమాండ్లన్నీ వెంటనే పరిష్కరించిఅమరుల ఆశయాలను నెరవేర్చడానికి తగిన చొరవ చూపాలని కోరారు. ఈమధ్య కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సులను అద్దెకు తీసుకుని నడపదాన్ని జెఎసి తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ప్రభుత్వానికి ఆర్‌టిసిపై నిజమైన ప్రేమ ఉంటే ప్రభుత్వమే నేరుగా ఎలక్ట్రిక్ బస్సులను కొని ఆర్‌టిసికి ఇవ్వాలన్నారు. గత 'యుపిఎ ప్రభుత్వ హయాంలో కార్మిక సంఘాల ఒత్తిడి మేరకు జెఎన్‌యుఆర్‌ఎంమెట్రో బస్సులను కేంద్ర ప్రభుత్వమే కొని ఆర్‌టిసి సంస్థలకు ఇచ్చిందని, అలాగే తెలంగాణ ఆర్‌టిసికి ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొని ఇచ్చి తన చిత్తశుద్ధిని చాటుకోవాలని జెఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జె.రాఘవులు, ఎం.ఎ. మజీద్, రమేష్, ఎం.ఎం.ఖాన్, అయూబ్, కమలాకర్ గౌడ్, బి.డి.రావు, యాదగిరి, శ్రీనివాస్, వి.బాబు, రఘురాం, నారాయణ, కె.ఎస్.పాల్, బుద్ధ విశాల్, భాస్కర్, గౌరీశంకర్, వెంకటయ్య, స్వరూప, సునీత, శ్రీలక్ష్మి , దశరథ్, రాము లు, ప్రభాకర్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీపై చర్చకు సిద్ధమా?

### బిఆర్ఎస్ నేత హరీశ్ రావుకు సవాల్ విసిరిన కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రుణమాఫీపై చర్చకు బిఆర్ఎస్ సిద్ధమా అని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీశ్ రావుకు సవాల్ విసిరా రు. గాంధీ భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రుణమాఫీపై రైతులతో చర్చ చేద్దామని, ఎల్లిగాడు, మల్లిగాడు కాకుండా కెసిఆర్ చర్చకు రావాలన్నారు. రుణమాఫీ కాలేదు నిజమే కానీ, సిఎం రేవంత్ రెడ్డిని ఒప్పించి చర్చకు నేను తీసుకువస్తాను, కెసిఆర్‌ను ఒప్పించి తీసుకువచ్చే కెపాసిటీ హరీశ్‌కు ఉందా ? అన్నారు. అక్కడ, ఇక్కడ భయమైతే సిద్దిపేటలోనే చర్చ పెట్టు అని జగ్గారెడ్డి సవాల్ చేశారు. బిఆర్ఎస్ పార్టీ పబ్లిసిటీ దగ్గర పాస్ అయిందన్నారు. సాంకేతిక కారణాలతో కొందరికి రుణమాఫీ కాలేదని మేమే చెప్తున్నామన్నారు. హరీశ్ రావు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఆర్థిక శాఖను కెసిఆర్ దివాళా తీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కెసిఆర్ తొమ్మిదిన్నర సంవత్సరాల్లో 8 కిస్తిల్లో లక్ష రుణమాఫీ చేయలేకపోయారన్నారు. రుణమాఫీ అందని రైతులకు ఏ కారణాల వల్ల అందలేదో వివరాలు తెప్పించమని అధికారులకు సిఎం ఆదేశించారని జగ్గారెడ్డి వెల్లడించారు. ఏ మొహం పెట్టుకొని హరీశ్‌రావు ఢిల్లీ వెళ్లి దీక్ష చేస్తారని జగ్గారెడ్డి నిలదీశారు. తెలంగాణ ప్రజలను మోసం చేసినందుకు కెసిఆర్ ఎక్కడ ఉంటే అక్కడ నేను దీక్ష చేస్తా అని హెచ్చరించారు. నిజమైన మోసం చేసిన కెసిఆర్ ఇంటి ముందు తానే దీక్ష చేస్తా అన్నారు. హరీశ్ ఢిల్లీలో దీక్ష చేసిన రోజే తాను కెసిఆర్ ఫాంహౌస్ దగ్గర వెళ్లి దీక్ష చేస్తా అని అన్నారు. కెసిఆర్‌ది రైతు గుండె అని, తొమ్మిదిన్నర సంవత్సరాల తర్వాత గుర్తు వచ్చిందా? అని ప్రశ్నించారు. మల్లన్న సాగర్ రైతుల వీపులు పగలగొట్టినప్పుడు రైతు గుండె ఏమైందని నిలదీశారు. ఖమ్మం రైతులకు బేడీలు వేసినప్పుడు కెసిఆ ర్ గుండె ఫ్రిజ్‌లో పెట్టారా? అని ప్రశ్నించారు. కాంగ్రె స్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలకే మాఫీ చేసిందన్నారు. సమస్య ప్రభుత్వం దగ్గర కాదని, బ్యాంకుల దగ్గర ఉందన్నారు. దొంగ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చింది కెసిఆర్ కుటుంబం అని జగ్గారెడ్డి విమర్శించారు.

**ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ నెం.17, కె.జెడ్, జి.హెచ్.ఎం.సి, ఖైరతాబాద్, హైదరాబాద్**

NIT.No. 14/EE/CIRCLE-17/KZ/GHMC/2024-25, 'ఇ.'ప్రొక్యూర్‌మెంట్ నోటీసు తేది: 04.10.2024

**పని పేరు:** సివిల్ పనులు (03). **అంచనా విలువ/ఇసివి:** రూ.15.63 లక్షలు, క్ర.సం. 01 నుండి 03 వరకు పనుల కొరకు **డౌన్‌లోడ్ ప్రారంభ మరియు ఆఖరి తేది & సమయం:** 05.10.2024న మ.12.00గం.ల నుండి 08.10.2024న మ.12.00గం.ల వరకు మాత్రమే, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-17, జిహెచ్ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.tender.eprocurement.gov.in లో చూడవచ్చు. ఇమెయిల్: eec17.ghmc@gmail.com, మొబైల్ నెం. 7337557246.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-17, కె.జెడ్, జిహెచ్ఎంసి

DIPR R.O. No. : 4998-PP/CL/ADVT/1/2024-25 Date: 05-10-2024

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
**కూకట్‌పల్లి సర్కిల్ -24**

NIT.No. 21/GHMC/KPC-24/EE/2024-25, తేది: 05.10.2024

**పని పేరు:** అభివృద్ధి పనులు. **అంచనా విలువ:** రూ.8.90 లక్షలు, **బిడ్ స్వీకరణకు ప్రారంభ తేది & సమయం:** 07.10.2024న ఉ.11.30గం.లకు, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 08.10.2024న ఉ.11.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ డి.గోవర్ధన్ గౌడ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్ఎంసి, కూకట్‌పల్లి సర్కిల్-24, సెల్ నెం: 9154299633. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కూకట్‌పల్లి సర్కిల్-24, జిహెచ్ఎంసి

DIPR R.O. No. : 4992-PP/CL/ADVT/1/2024-25 Date: 05-10-2024

# ఫోకస్

## బంగ్లాదేశ్‌పై మనదే ఆధిపత్యం..

బంగ్లాదేశ్‌పై క్రికెట్‌కు సంబంధించిన అన్ని విభాగాల్లోనూ భారత్ ఆధిపత్యం కొనసాగుతున్నది. ఆదివారం (అక్టోబర్ 6) గ్వాలియర్‌లోని న్యూ మాధవరావు సింధియా క్రికెట్ స్టేడియంలో జరిగే తొలి మ్యాచ్‌తో, మూడు మ్యాచ్‌ల టి20 ఇంటర్నేషనల్స్ సిరీస్‌లో ఇరు జట్లు ఢీకొంటున్నాయి. రెండో మ్యాచ్ 9న ఢిల్లీలో అరుణ్ జైట్లీ క్రికెట్ స్టేడియంలో జరుగుతుంది. చివరిదైన మూడో మ్యాచ్ 12న, అదే స్టేడియంలో ఉంటుంది. భారత జట్టుకు సూర్యకుమార్ యాదవ్, బంగ్లాదేశ్ జట్టుకు నజ్ముల్ హొస్సేన్ శాంటో నాయకత్వం వహిస్తారు. రెండు దేశాల మధ్య రికార్డులను పరిశీలిస్తే, భారత్‌పై బంగ్లాదేశ్ వన్డే ఇంటర్నేషనల్స్‌లో మాత్రమే కొద్దిపాటి మెరుగైన ప్రదర్శనతో రాణించింది. ఇరు జట్ల మధ్య 13 టెస్టు మ్యాచ్‌లు జరిగితే, భారత్ 11 విజయాలు నమోదు చేసింది. రెండు మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. అయితే, 41 వన్డే ఇంటర్నేషనల్స్‌లో బంగ్లాదేశ్ 8 విజయాలను నమోదు చేసుకోగలిగింది. ఒక మ్యాచ్‌లో ఫలితం తేలలేదు. మిగతా 41 మ్యాచ్‌లను భారత్ తన ఖాతాలో వేసుకుంది. టి20 ఇంటర్నేషనల్స్‌లో ఈ రెండు జట్లు 14 పర్యాయాలు తలపడ్డాయి. భారత్ 13 విజయాలు సాధించగా, బంగ్లాదేశ్ కేవలం ఒక మ్యాచ్‌ని కైవసం చేసుకోగలిగింది. మొత్తం మీద, అన్ని ఫార్మాట్లు కలిపి, రెండు జట్ల మధ్య 68 మ్యాచ్‌లు జరగ్గా, భారత్ 56 విజయాలతో తిరుగులేని ఆధిపత్యాన్ని చూపింది. బంగ్లాదేశ్ ఖాతాలో 9 విజయాలు ఉన్నాయి. మూడు మ్యాచ్‌ల్లో ఫలితాలు రాలేదు.

### క్రికెట్ రికార్డులు..

**టి 20 ఇంటర్నేషనల్స్**

**అత్యధిక టీం స్కోరు:** 3 వికెట్లకు 264/ శ్రీలంకపై ఆస్ట్రేలియా
**అత్యల్ప టీం స్కోరు:** 40 ఆలౌట్/ శ్రీలంక చేతిలో నెదర్లాండ్స్
ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు: 57 బంతుల్లో 117 పరుగులు / దక్షిణాఫ్రికాపై క్రిస్ గేల్ (వెస్టిండీస్)
**కెరీర్‌లో అత్యధిక పరుగులు:** 4,231 (రోహిత్ శర్మ/ భారత్). ఈ జాబితాలో భారత బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లీ 4,188 పరుగులతో రెండో స్థానంలోనిలవగా, పాకిస్తాన్ ఆటగాడు బాబ్ ఆజమ్ 4,145 పరుగులు సాధించి మూడో స్థానంలో కొనసాగుతున్నాడు.
**ఒక ఓవర్‌లో అత్యధిక స్కోరు:** 36 యువరాజ్ సింగ్ (ఇంగ్లాండ్‌కు చెందిన స్టువర్ట్ బ్రాడ్ బౌలింగ్‌లో)
**కెరీర్‌లో అత్యధిక వికెట్లు:** 164 (న్యూజిలాండ్ బౌలర్ టిమ్ సౌథీ)

క్రీడ



**టి20 ఇంటర్నేషనల్స్‌లో భారత్—బంగ్లా జట్లు పరపస్పరం తలపడినప్పుడు నమోదైన గణాంకాలు**

ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక స్కోరు: భారత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 184 (2022 ప్రపంచ కప్ గ్రూప్ మ్యాచ్‌లో)
**ఒక ఇన్నింగ్స్‌లో అత్యల్ప స్కోరు:** బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 96 (2023 ఆసియా క్రీడల సందర్భంగా హాంగ్జౌలో జరిగిన సెమీఫైనల్ పోరులో)
**అత్యధిక పరుగులు:** రోహిత్ శర్మ (భారత్) 12 మ్యాచ్‌ల్లో 454 పరుగులు (ఇందులో రెండు అర్ధ శతకాలు ఉన్నాయి/ 141.43 స్ట్రయిక్ రేట్)
**అత్యధిక వికెట్లు:** యుజ్వేంద్ర చాహల్ (భారత్) 6 మ్యాచ్‌ల్లో 9 (ఎకానమీ రేట్ 6.37)
**అత్యధిక వ్యక్తిగత స్కోరు:** రోహిత్ శర్మ (భారత్) 61 బంతుల్లో 89 పరుగులు. ఇందులో ఐదు ఫోర్లు, ఐదు సిక్స్‌లు ఉన్నాయి (2018 నిదహాస్ ట్రోఫీలో) నిదహాస్ ట్రోఫీ 2018లో బంగ్లాదేశ్తో జరిగిన ఐదవ గ్రూప్ మ్యాచ్లో రోహిత్ శర్మ 61 బంతుల్లో 89 పరుగులు చేశాడు, ఇందులో ఐదు ఫోర్లు మరియు ఐదు సిక్సర్లు ఉన్నాయి.
**అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు:** 7 పరుగులకు 6 వికెట్లు (2019 సిరీస్ మూడో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 175 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగగా, యుజ్వేంద్ర చాహల్ ఈ ఫీట్‌ను సాధించాడు).



## నాలుగేళ్లలోనే ప్రపంచ రికార్డు

*వెయిట్‌లిఫ్టింగ్‌లో ఈ చిన్నారి ఏకంగా ప్రపంచ రికార్డు నెలకొల్పింది. కేవలం 4 సంవత్సరాలా 7 రోజులు వయసు ఉన్న ఆర్యా ఎస్. గంగూలీ 30 కిలోల డెడ్‌లిఫ్ట్‌తో ఈ ఫీట్‌ను సాధించింది. సబ్‌జూనియర్స్ విభాగంలో ఇది ప్రపంచ రికార్డు. భవిష్యత్తులో అంతర్జాతీయ వేదికలపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసే సత్తా ఈ అమ్మాయికి ఉందనడంలో అనుమానం లేదు.*

## మారథాన్ మహారాణి



అలుపులేకుండా ఒకటిరెండు కిలోమీటర్లు పరుగెత్తడమే కష్టం. 1,500 మీటర్లు, 2,000 మీటర్లు వంటి లాంగ్ డిస్టెన్స్ పరుగులో పాల్గొనేవారికి అమితమైన స్టామినా ఉండాలి. ఇక ౪౨.195 కిలోమీటర్లు (26.385 మైళ్లు) దూరాన్ని పూర్తి చేయాల్సిన మారథాన్ పరుగుకు సామాన్యులు ఎవరూ సాహసించరు. యువతీయువకులే దూరంగా ఉండే మారథాన్‌కు 70 ఏళ్ల వృద్ధురాలు సిద్ధపడడం ఓ వింత. వరుసగా ఏడు రోజులు ఏడు మారథాన్ పరుగు పూర్తి చేయాలనుకోవడం వింతల్లో వింత. ఈ ఏడు మారథాన్‌లు కూడా ఒకే దగ్గర కాకుండా, ఏడు వేర్వేరు ఖండాల్లో పరిగెత్తాలని నిర్ణయించుకోవడానికి ప్రత్యేకంగా ఒక కొత్త పదాన్ని సృష్టించాలేమో! అలాంటి అత్యంత అరుదైన ఫీట్‌ను సాధించిన చౌ స్మిత్, మారథాన్‌లలో తనకు తానే సాటి అని నిరూపించుకుంది. అమెరికాలోని మిస్సోరీ రాష్ట్రం, కనాస్ నగరానికి చెందిన చౌ స్మిత్ 2017 జనవరి 25 నుంచి 31 మధ్య, వరుసగా ఏడు రోజులపాటు పెర్త్ (ఆస్ట్రేలియా), సింగపూర్ (ఆసియా), కైరో (ఈజిప్టు/ ఆఫ్రికా), ఆమ్‌స్టర్‌డామ్ (నెదర్లాండ్స్/ యూరోప్), గార్డెన్ సిటీ (న్యూయార్క్/ ఉత్తర అమెరికా), పన్టా ఎరీనా (చిలీ/ దక్షిణ అమెరికా), కింగ్ జార్జి ఐలాండ్ (అంటార్కిటికా)లో ఏడు మారథాన్ రన్‌లను పూర్తి చేసింది. తన 70వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆమె ఈ అసాధారణ ఫీట్‌ను ప్రదర్శించింది, మరో ఎనిమిది మంది ఇదే ప్రయత్నం చేయగా, ఆరుగురు లక్ష్యాన్ని పూర్తిచేయగలిగారు. అయితే, వారందరిలోనూ ఎక్కువ వయసు గల రన్నర్ చౌ స్మిత్ 'మారథాన్ మహారాణి'గా పేరు సంపాదించింది.

## అరుదైన బహుమతి..

బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్‌కు అరుదైన బహుమతి లభించింది. భారత్‌తో మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను పూర్తి చేసుకున్న బంగ్లాదేశ్, ఆదివారం ప్రారంభమయ్యే మొదటి మ్యాచ్‌తో, టి20 సిరీస్‌ను మొదలుపెట్టనుంది. కెరీర్‌లో చివరి టెస్టు స్వదేశంలో ఆడాలన్నది అల్ ససన్ కోరిక. దక్షిణాఫ్రికాతో మిర్పూర్‌లో జరిగే మ్యాచ్‌తో తన టెస్టు కెరీర్‌ను ముగించాలని అనుకున్నాడు.



అయితే, అతనిపై కొనసాగుతున్న కేసు నేపథ్యంలో, భద్రత కల్పించడం కష్టమని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బిసిబి) స్పష్టం చేసింది. దీనితో, కాన్పూర్ టెస్టు జరిగిన వెంటనే అల్ హాసన్ టెస్టుల నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు అందించిన సేవలకు గుర్తుగా భారత స్టార్ బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లీ అతనికి తన బ్యాట్‌ను మహుమతిగా ఇచ్చాడు. ఒక క్రికెటర్‌కు ఇంత కంటే మెరుగైన గౌరవం, అరుదైన బహుమతి ఏముంటాయి? కెరీర్‌లో 129 టి20 ఇంటర్నేషనల్స్ ఆడిన అల్ హసన్ ఆ ఫార్మాట్ నుంచి కూడా రిటైర్‌కావడంతో, భారత్‌తో జరిగే తాజా సిరీస్‌లో సభ్యుడిగా లేడు.

## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

- భారతదేశంలో పోర్చుగీసు గవర్నరుగా ఎవరిని నియమించారు?
  ఫ్రాన్సిస్కోడి అల్మైడా
- ఆహార పదార్థాలు జీర్ణం కావటానికి తోడ్పడే కణాంగాలు?
  లైసోసోమ్‌లు
- భూగోళంపై జలభాగం శాతం ఎంత?
  71%
- DNA మరియు ప్రోటీనులతో నిర్మితమైనది?
  క్రొమాటిన్
- భారతదేశ స్థలాకృతి చిత్రాలను తయారుచేసే సంస్థ ఏది?
  సర్వే ఆఫ్ ఇండియా
- విలువైన రత్నం 'కెంపు'లో అల్యూమినియం ట్రైఆక్సైడ్తో పాటు స్వల్పంగా ఉండే పదార్థం ఏది?
  క్రోమియం
- నాగార్జునకొండలో బయల్పడిన అశ్వమేథ వేదిక ఎవరిది?
  శాంతమూలుడు
- ఇక్ష్వాకుల రాజధాని ఏది?
  విజయపురి
- అంతర్జాతీయ న్యాయస్థానం ఎక్కడ ఉంది?
  హేగ్
- తురుష్కులు కాన్స్టాంటినోపుల్ను ఆక్రమించిన సంవత్సరం?
  1453
- కణాంగాలలో ముఖ్యమైనది?
  కేంద్రకము
- భూమిపై ఉన్న చిన్న ఖండం
  ఆస్ట్రేలియా
- జీవులన్నిటికి ప్రధానమైన మూలం.
  కణం
- పిర్ పంజాల్ పర్వతశ్రేణి యీ రాష్ట్రంలో ఉంది.
  జమ్ము కాశ్మీర్
- అత్యుత్తమ విద్యుత్ వాహకం ఏది?
  వెండి
- కిందివాటిలో ఏది ఒకే మూలకాన్ని కలిగి ఉంటుంది?
  వజ్రం
- మొదటి అటామిక్ బాంబు రూపకర్త ఎవరు?
  ఒ. హాన్
- ఏనుగు సగటు జీవిత కాలం ఎన్నేళ్లు?
  57
- లోక్‌సభకు పోటీచేయడానికి కనీస వయసు ఎంత?
  25
- ప్రపంచంలో అత్యధిక వేగంతో నడిచే రైలు ఉన్న దేశమేది?
  జపాన్
- హుగ్లీని పోర్చుగీసు వారి నుంచి ఆక్రమించిన మొగలు చక్రవర్తి ఎవరు?
  షాజహాన్
- జాతీయ పతాకంలో ఉన్న ధర్మ చక్రంలోని గీతలు ఎన్ని?
  24
- చంద్రయాన్1 ఉపగ్రహాన్ని కక్ష్యలో ఉంచడానికి ఇస్రో ఉపయోగించిన వాహక నౌక ఏది?
  పీఎస్ఎల్వీసీ11
- తెలంగాణలో బొగ్గు ఉత్పత్తి అధికంగా చేస్తున్న జిల్లా ఏది?
  ఖమ్మం
- హిందూ నాగరికతను ఎవరు ఆరంభించారు?
  ఆర్యులు

## నిత్యావసరాల ధరలు నియంత్రించండి

### సిపిఐ ఆధ్వర్యంలో రాస్తారోకో



**ప్రజాపక్షం/ బెల్లంపల్లి :** బెల్లంపల్లి పట్టణ కాంటా చౌరస్తాలో పెరిగిన నిత్యవసర సరుకుల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ బెల్లంపల్లి పట్టణ సమితి ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఉల్లిగడ్డ, అల్లం, వెల్లుల్లితో సహా నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకట్ స్వామి సిపిఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి అన్నారు. ఇప్పటికైనా నిత్యవసర సరుకుల ధరలను ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని, లేని ఎడల ప్రజల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర సమితి సభ్యురాలు బొల్లంపూర్ణిమ, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య, బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మినారాయణ, పట్టణ సహాయ కార్యదర్శి బియ్యాల ఉపేందర్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి పోరాటాలతోనే కూలీ రేట్లు పెంపు



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** రాష్ట్రంలోని సివిల్ సప్లై గోదాములలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు ఏఐటియుసి పోరాటాలతోనే కూలీ రేట్లు ప్రభుత్వం పెంచినందుకు ఏఐటియుసి కరీంనగర్ జిల్లా తరపున ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. కరీంనగర్‌లోని పద్మనగర్ ఎంఎల్ఎస్ పాయింట్ గోదాం వద్ద తెలంగాణ సివిల్ సప్లై హమాలీ కార్మిక సంఘం ఆద్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య మాట్లాడుతూహమాలీ కార్మికులకు కూలీ రేట్ల పెంపు ఒప్పందం రెండు సంవత్సరాలు అయినందున గతంలో రూ.26కు గాను ప్రస్తుతం 3 రూపాయలు అదనంగా పెంచారని, బట్టల కూలీ రూ.300 , స్వీట్ బాక్స్ రూ.900, బోనస్ రూ.7500 పెంచడంతో పాటు స్వీపర్లకు రూ.6500 నుంచి 7500 పెంచుతూ ఈఎస్ఐ ఇన్సూరెన్స్. పిఎఫ్, సౌకర్యం కల్పిస్తామని గోదాముల్లో పనిఒత్తిడి ఉంటే అదనపు కార్మికులను నియమించుకోవచ్చని చెప్పడం జరిగిందని తెలిపారు. ఈ ఒప్పందం రాష్ట్రంలోని ఏఐటియుసి హమాలీ కార్మిక సంఘం జేఏసి ఆద్వర్యంలో రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్ ముందు జరిగిన చర్చల్లో ఒప్పుకోవడం జరిగిందన్నారు. వెంటనే జీవోను విడుదల చేయాలని కోరారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బియ్యం లారీ కాంట్రాక్ట్ అసోసియేషన్ యాజమాన్యం వారితో కూలీ రేట్ల దిగుమతి విషయంలో మూడేళ్లు కావస్తున్నా రెండుసార్లు దిగుమతి చార్జీలు పెంచాలని విన్నవించినా స్పందన లేదని, ఆందోళనలు చేపడతామని, అవసరమైతే సమ్మె చేపడతామని నోటీసు ఇస్తామన్నారు. తెలంగాణ సివిల్ సప్లై హమాలీ కార్మిక సంఘం ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు మంద అంజయ్య, శ్రీధర్, పొన్నాల రాజయ్య, అట్లా మల్లయ్య, గొౖరె కనకయ్య, గడ్డి లచ్చయ్య, ఎస్.రాయమల్లు, కుమార్, దొడ్ల మల్లేశం, మొగిలి రాజయ్య, బుర్ర శంకర్, గోదాం హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

## సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతా..

### కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు హామీ



**ప్రజాపక్షం/సుజాతనగర్ః**ప్రతిగ్రామంలో తాగు, సాగునీరు అందించి, గ్రామాల అభివృద్ధి కోసం పనిచేస్తానని సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. శనివారం మండలంలోని సింగభూపాలెం గ్రామంలో ప్రజా సమస్యలపై పరిష్కారం దిశగా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని సిసి రోడ్లు డ్రైనేజీ నిర్మాణానికి 50 లక్షల రూపాయలను మంజూరు చేశామని అన్నారు. సింగభూపాలెంగ్రామాన్ని రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ దీపాలు, త్రాగునీటి సదుపాయం కల్పిస్తామని పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, పింఛన్లు, ప్రభుత్వ పథకాలను అందజేస్తామన్నారు. సింగభూపాలెం చెరువు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి కోసం ఎనిమిదిన్నర కోట్ల రూపాయలను మంజూరు చేయించడం జరిగిందన్నారు. గ్రామాలలో వ్యవసాయ పనుల కొరకు వెళ్లే రైతులకు కోసం రోడ్లను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శి ఎండి. రహీముద్దీన్ తమ గ్రామ సమస్యలను పట్టించుకోవడంలేదని ఎమ్మెల్యేకు తెలుపగా ఎమ్మెల్యే సాంబశివరావు పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్తులతో కలిసి సింగభూపాలెంలో తిరిగి రోడ్లను, మంచినీటి బోరింగ్‌లను, డ్రైనేజీ, విద్యుత్ సమస్యలను పరిశీలించి అధికారులను సమస్యలను పరిశీలించాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, సిపిఐ జిల్లా సమితి సభ్యులు భూక్య దస్రు, కుమారి హనుమంతరావు, జక్కుల రాములు, సిపిఐ నాయకులు పొదిల శ్రీనివాసరావు, వీర్ల మల్లేష్, మేకల వెంకటేష్, గడ్డం రాజేందర్, సురేష్, దండి నరసింహారావు, ఎంపీఓ శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ ఏఈ జి కిషన్, ఆర్‌డబ్ల్యూసీఏఈనిలోఫర్, ఇరిగేషన్ ఏఈ కార్తీక్, అధికారులు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నిరంతరం పాటల ద్వారానే చైతన్యవంతం



### ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లే నర్సింహ్మా

**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్ః**నిరంతరం పాట ద్వారానే ప్రజలను చైతన్యవంతం చేస్తున్న ఘనత తెలంగాణ ప్రజానాట్యమండలిదని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లే నర్సింహ్మా అన్నారు.రంగారెడ్డి జిల్లా ప్రజానాట్యమండలి సమావేశం అబ్దులాపూర్‌మెట్ రావినారాయణరెడ్డినగర్ సిపిఐ కార్యాలయంలో శనివారం జరిగింది. ఆయన మాట్లాడారు. సిపిఐ ప్రజా పోరాటాలకు ఉత్తేజాన్ని ఇస్తుందని అన్నారు. గ్రామాలలో నూతన కళారూపాలను రూపొందిస్తు ప్రదర్శిస్తూ ముందుకు వెలుతుందని తెలిపారు. కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.రవీంద్రభారతిలో జరిగిన ప్రజా కళల పండుగ కార్యక్రమంలో ప్రశంసాపత్రాలను కళాకారులకు అందజేశారు. రంగారెడ్డి జిల్లా ప్రజానాట్యమండలిఅధ్యక్షులుసుధాకర్అధ్యక్షత వహించగా, జిల్లా బాధ్యులు ముత్యాల యాదిరెడ్డి, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు హరిసింగ్‌నాయక్, మానస, పగడాల మహేందర్, కాలనీ ఇన్‌చార్జి చిర్ర శేఖర్ పాల్గొన్నారు.

## బ్యాంకు నిర్లక్ష్యం వల్లే పెన్షన్ జమ కాలేదు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** బొగ్గు గని కార్మికులకు ఐదు రోజులు గడిచినా ఇంత వరకు ధన్ బాద్ లోని ఎస్ బి ఐ బ్యాంక్ నిర్లక్ష్యం వల్ల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రిటైర్డ్ బొగ్గు గని కార్మికులకు సిఎంపిఎఫ్ పెన్షన్ బ్యాంకులో జమ చేయలేదని, వెంటనే సిఎంపిఎఫ్ అధికారులు, కేంద్ర బొగ్గు గనుల శాఖ అధికారులు స్పందించి సోమవారం లోగా పెన్షన్ జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి డిమాండ్ చేశారు. శనివారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ కు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వచ్చిన సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లో తమ బ్యాంకు ఖాతాలలో పెన్షన్ లు జమచేయలేదని పేర్కొంటూ, దాదాపు వందమంది పెన్షన్‌దారులు చెప్పడం జరిగింది. అనంతరం వారు గోదావరిఖనిలో ఉన్న సిఎంపిఎఫ్ కమిషనర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. కమిషనర్ స్పందిస్తూ పెన్షన్ డబ్బులు ధన్ బాద్ లోని సిఎంపిఎఫ్ అధికారులు ఎస్.బి.ఐ బ్యాంకుకు పంపించడం జరిగిందని అన్నారని వారు తెలిపారు. సిఎంపిఎఫ్ తప్పిదం ఏమి లేదని, అంతా ధన్ బాద్ లోని ఎస్‌బిఐ బ్యాంక్ లోని సిఎంపిఎఫ్ సెల్ అధికారులదేనని, ఏదో సాంకేతిక సమస్య వల్ల కొంతమందికి పెన్షన్ జమకాలేదని కమిషనర్ అన్నారని వారు తెలిపారు. ఈ సమస్య సోమవారంలోగా పరిష్కారం అవుతుందని కమిషనర్ అన్నారని వారు తెలిపారు. పెన్షన్ పంపిణీలో సిఎంపిఎఫ్ విధానం సరిగా లేదని వారు కమీషనర్ కు వివరించారు. ఏ బ్యాంకు కు ఆ బ్యాంకు కు పెన్షన్ జమ చేయకుండా సిఎంపిఎఫ్ అధికారులు పని సులువు గా కావడం కోసం కేవలం ఎస్ బి ఐ కి పంపడం సరైన విధానం కాదని వారు ఆరోపించారు. పెన్షన్ కోసం రిటైర్డ్ ఉద్యోగులు తమ స్వంత గ్రామాల నుంచి రవాణా ఖర్చులు పెట్టుకొని రావడం తో పాటు వారు తీవ్ర అనారోగ్య సమస్యలతో బ్యాంకు లకు రావడం వల్ల అనేక అవస్తలు పడుతున్నారని వారు పేర్కొన్నారు. సిఎంపిఎఫ్ అధికారులు, కేంద్ర బొగ్గు గనుల శాఖ అధికారులు స్పందించి బొగ్గు గని విశ్రాంత కార్మికులకు ఒకే బ్యాంకుకు కాకుండా యూబిఐతో పాటు ఇతర బ్యాంకులకు విడివిడిగా పెన్షన్ డబ్బు లు ఆయా ఖాతాల్లో జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ఎస్‌బిఐ బ్యాంక్‌కి పెన్షన్ పంపిణీ విధానాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిచో ఏఐటియుసి ఆద్వర్యంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ తో కలిసి సిఎంపిఎఫ్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.ఏఐటియుసి బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, నాయకులు పడాల కనకరాజు, చెప్యాల మహేందర్ రావు, ఆర్ రాజేశ్వరరావు, మోరె సమ్మయ్య తో పాటు రిటైర్డ్ కార్మికులు పాల్గొన్నారు.

## గాజాపై ఇజ్రాయెల్ దాడిని ముక్తకంఠంతో ఖండించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న క్రూరమైన దాడిని పౌర సమాజం ముక్తకంఠంతో ఖండించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా కమిటీ సభ్యులు కిరణ్, ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి షెక్ నజీర్‌లు విజ్ఞప్తి చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం బొమ్మగాని ధర్మభిక్షం భవన్‌లో వామ పక్ష పార్టీలు, ప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికా అండతో పాలస్తీనా ప్రజలపై అత్యంత క్రూరత్వంగా, కిరాతకంగా దాడులు చేస్తున్న ఇజ్రాయిల్ దుశ్చర్యలను ప్రపంచ న్యాయస్థానలో ఖండించాలని కోరారు. ఇజ్రాయిల్ దాడులు, హత్యలకు, అత్యాచారాలకు పాల్పడుతున్నదని గత సంవత్సరం అక్టోబర్ 7న నుంచి సాగుతున్న మరణకాండకు ఏడాది పూర్తి అయిన ఇప్పటికి అనేక మంది పౌరులు చనిపోయారని, పాఠశాలలు, కళాశాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని అన్నారు. ఇప్పటికే పాలస్తినాలో 44వేల మంది మరణించారని, శిథిలాల కింద మరో 15వేల మంది పౌరులు ఉన్నారని అంచన వేశారని, అందులో అధికంగా మహిళలు, గర్భావతులు, వృద్ధులు, పిల్లలు ఉన్నారని చెప్పారు. ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ ఈనెల 7న జిల్లా కేంద్రంలో నిర్వహించే నిరసన కార్యక్రమంలో ప్రజాస్వామిక వాదులు, అభ్యుదయవాదులు, వామపక్ష భావాజాలం కలిగిన వారు రాజకీయాలకు అతితంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అనంతుల మల్లేశ్వరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దూళిపాల ధనుంజనాయుడు, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఎఐటియూసి జిల్లా గౌరవ అధ్యక్షులు దంతాల రాంబాబు, సిపిఎం జిల్లా నాయకులు వెంకటేశ్వర రావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దండా వెంకట్ రెడ్డి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చిలక రాజ్ శ్రీను, ఎఐటియుసి ప్రాంతీయ కార్యదర్శి నిమ్మల ప్రభాకర్ పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించండి



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటియూసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఎన్ఎంసి ఏఐటియూసి అధ్యక్షుడు ఆశి యాదయ్య ఆధ్వర్యంలో మేనేజర్‌కి వినతి పత్రాన్ని అందజేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులందరికి ఏడవ తేదీలోపు జీతాలు ఇవ్వాలని, నాణ్యమైన నూనె, సబ్బులు ఇవ్వాలన్నారు. ప్రతినెలా ఇచ్చే చెప్పులు ఇవ్వ డం లేరని, రేయిన్ కోటు ఇవ్వడం లేరని గుర్తు చేశారు. కార్మికుల వేళ్లపై ముద్రలు పోతుండడం వలన బయోమెట్రిక్ సమస్య తలెత్తుతుందని, పాత పద్దతిలో హాజరును వేయాలని కోరారు. సమస్యలనుపరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. కార్మికులు నర్సమ్మ, భాగ్యమ్మ, అనసూయ, వెంకన్న పాల్గొన్నారు.

# స్ట్రాంగ్ రూములకు అభ్యర్థులు, మద్దతుదార్ల కాపలా

**రాజౌరీ :** జమ్మూ కశ్మీరు అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఓట్ల లెక్కింపు ప్రక్రియ మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్నది. ఈ నేపథ్యంలో మూడు అంచెల పోలీసు భద్రతతోపాటు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, వారి మద్దతుదారులు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రా(ఇవిఎం)లను భద్రపరచిన స్ట్రాంగ్‌రూముల వెలుపల కాపలా కాస్తున్నారు. స్ట్రాంగ్ రూములున్న చోటే శిబిరాలు వేసుకుని కాపలా కాస్తున్నారు. జమ్మూ కశ్మీరులో 90 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ ప్రక్రియ మూడు విడతలలో పూర్తయింది. ఈనెల 8వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుంది. రాజౌరీ జిల్లాలోని కలకోటే–సుందర్‌బని, నౌషెరా, రాజౌరీ (ఎస్‌టి), బుధాల్ (ఎస్‌టి), థనమండి (ఎస్‌టి) నియోజక వర్గాలకు రెండవదశలో సెప్టెంబరు 25న పోలింగ్ జరిగింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను రాజౌరీ టౌన్‌లోని గుజ్జార్ మండి సమీపంలో ఉన్న ప్రభుత్వ బాలుర హయ్యర్ సెకండరీ స్కూలులో భద్రపరిచారు. చాలా బలంగా మూడు అంచెల భద్రత స్ట్రాంగ్ రూములకు ఏర్పాటు చేసినట్లు రాజౌరీ జిల్లా ఎన్నికల అధికారి వారం రోజుల క్రితం చెప్పారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ భద్రత ఏర్పాటు చేశారు. పోలీసులను ఆ ప్రాంతం నుండి ఉపసంహరించారని సోషల్ మీడియాలో వచ్చిన వార్తలను ఆయన కొట్టిపారేశారు. కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, సాయుధ పోలీసులు, జిల్లా పోలీసులు మూడు వలయాలుగా ఏర్పడి ఈ స్ట్రాంగ్ రూములకు భద్రత ఇస్తున్నారని చెప్పారు. వర్షాలను తట్టుకునేవిధంగా కౌంటింగ్ నిమిత్తం టెంట్లు వేస్తున్నారు. సిబ్బందికోసం ఇతర ఏరాట్లు చేస్తున్నారు. బుధాల్ నేషనల్ కాన్ఫరెన్స్‌పార్టీ అభ్యర్థి జావేద్ ఇగ్బాల్ చౌధురి మాట్లాడుతూ, ప్రజాతీర్పునకు గట్టి భద్రత ఏర్పాటు చేయాలని కోరారు.



# ఎన్నికల బాండ్ల రద్దు తీర్పు పునఃసమీక్షకు 'సుప్రీం' తిరస్కృతి

**న్యూఢిల్లీ :** ఎన్నికలబాండ్లను రద్దు చేస్తూ ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యానగల విస్తృత ధర్మాసనం శనివారంనాడు కొట్టివేసింది. ఈ విస్తృత ధర్మాసనంలో చంద్రచూడ్‌తోపాటు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ జె.బి.పార్థీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా కూడా ఉన్నారు. ఆ రికార్డులలో ఎలాంటి తప్పిదాలూ లేవని కూడా విస్తృత ధర్మాసనం ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఓపెన్ కోర్టులో రివ్యూ పిటిషన్లను విచారణకు తీసుకునేవిధంగా సంబంధిత జాబితాలో చేర్చాలని పిటిషనర్లు చేసిన విజ్ఞప్తిని కూడా జస్టిస్ చంద్రచూడ్ ధర్మాసనం తిరస్కరించింది. రివ్యూ పిటిషన్లను శ్రద్ధగా పరిశీలించాం. ఆ పాత రికార్డులలో ఎలాంటి తప్పిదాలు కనిపించలేదు, 2013 నాటి సుప్రీంకోర్టు నిబంధనలలోని 47వ నిబంధన కింద సమీక్ష అవసరం లేదని పేర్కొంది. అందువల్ల రివ్యూ పిటిషన్లను తిరస్కరిస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. న్యాయవాది మాథ్యూ జె.నెడుంపర తదితరులు ఈ రివ్యూ పిటిషన్లను దాఖలు చేశారు. 2018 నాటి ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగంలోని వాక్‌స్వాతంత్ర్యాన్ని, సమాచార హక్కు వ్యక్తీకరణ హక్కులను ఉల్లంఘించిందని పేర్కొంటూ ఆనాడు డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు సభ్యులుగల విస్తృత ధర్మాసనం ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేసింది. 2019 ఏప్రిల్ 12 నుండి ఎవరెవరు ఈ ఎన్నికల బాండ్లను కొనుగోలు చేశారో కూడా ఆ వివరాల జాబితాను ఎన్నికల సంఘానికి సమర్పించాలని కూడా ఆనాటి ధర్మాసనం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఆదేశాలు జారీ చేసింది.

# రాజ్యాంగ పరిరక్షణకు కోటా పరిమితి తొలగింపు అవసరం

**కొల్హాపూర్ :** రాజ్యాంగాన్ని పరిరక్షించాలంటే రిజర్వేషన్లపై ఇప్పటికే ఉన్న 50 శాతం పరిమితిని తొలగించడం అవసరమని, పార్లమెంటులో ఈ మేరకు చట్టాలను ఆమోదించేలా ఇండియా హామీ ఇస్తుందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. శనివారం ఇక్కడ జరిగిన 'సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్'లో ఆయన మాట్లాడుతూ కుల ఆధారిత జనాభా గణనను ప్రారంభించడానికి కాంగ్రెస్, ఇండియా కూటమి కూడా చట్టాలను ఆమోదించేలా చూస్తాయని అన్నారు. లోక్‌సభ, రాజ్యసభల్లో రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని తొలగిస్తామని, దానిని ఏ శక్తీ అడ్డుకోలేదని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ఈ 50 శాతం పరిమితిని తొలగించడం అవసరమని ఆయన అన్నారు. తమ పార్టీ కుల గణన గురించి మాట్లాడుతున్నప్పుడు, దానికి మరో రెండు అంశాలను జోడించాలని కోరుకుంటున్నట్లు రాహుల్ చెప్పారు ఒకటి ప్రతి సామాజిక వర్గాన్ని లెక్కించడం కాగా, భారతదేశ ఆర్థిక వ్యవస్థపై వారికి ఎంత నియంత్రణ ఉంది అనేది రెండవదన్నారు. కుల ఆధారిత జనాభా గణన వివిధ వర్గాల జనాభాకు సంబంధించిన డేటాను సేకరించడంలో సహాయపడుతుందన్నారు. దేశ జనాభాలో 90 శాతం మందికి అవకాశాల తలుపులు మూసుకుపోతున్నాయన్నారు. దేశ బడ్జెట్‌ను తొంభై మంది టాప్ ఐఎఎస్ అధికారులు నిర్ణయిస్తున్నారన్నారు. మరియు మొత్తం జనాభాలో కనీసం 50 శాతం మంది ఒబిసిలు ఉంటే, 90 మంది అధికారులలో ముగ్గురు మాత్రమే ఒబిసిలు ఉన్నారన్నారు. దళితులు 15 శాతం, ఆదివాసీలు ఎనిమిది శాతం ఉంటే, అధికారుల్లో మాత్రమే ముగ్గురు దళితులు, ఒక ఆదివాసీ ఉన్నాడని చెప్పారు. భారతీయ జనతా పార్టీ (బిజెపి), రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) కుల ఆధారిత జనాభా గణనను వ్యతిరేకిస్తున్నాయని, ఎందుకంటే వారు నిజాలు బయటకు రాకూడదని వారు కోరుకుంటున్నారన్నారు. దళితులు లేదా వెనుకబడిన తరగతుల చరిత్రను పాఠశాలల్లో బోధించడం లేదని, ఆ చరిత్రను చెరిపేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరణ చేస్తున్నారని, దీన్ని రిజర్వేషన్ల రద్దుగా పేర్కొనాలని సూచించారు. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ఏళ్ల తరబడి ఇతే తరహాలో వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. సాయుధ దళాలలో అగ్నిపథ్ పథకం 90 శాతం ప్రజల నుండి పెన్షన్‌ను లాక్కోవడానికి కుట్ర అని గాంధీ పేర్కొన్నారు.



**రాహుల్ గాంధీకి పుణె కోర్టు సమన్లు**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి పుణె ప్రత్యేక కోర్టు సమన్లు జారీ చేసింది. గతేడాది లండన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రాహుల్ మాట్లాడుతూ వినాయక్ దామోదర్ సావర్కర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసినట్లుగా సావర్కర్ మనవడు సత్యకి సావర్కర్ గతంలో పుణెలోని ఓ కోర్టులో పరువు నష్టం దావా దాఖలు చేశారు. దీనికి ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు పోలీసులు తేల్చారు. కాగా ఈ కేసు గత నెలలో జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ (ఎఫ్‌ఎంఎఫ్‌సి) కోర్టు నుంచి ఎంపిలు, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టుకు బదిలీ అయ్యింది. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన కోర్టు అక్టోబర్ 23న తమముందు హాజరుకావాలని కోరుతూ రాహుల్‌కు సమన్లు జారీ చేసింది.

# ఇక..ఆమరణ నిరాహారదీక్షే

• జూనియర్ డాక్టర్ల 'అల్టిమేటమ్' • కోలకతాలో నిరవధిక బైఠాయింపు



**కోల్‌కతా :** పశ్చిమబెంగాల్‌లో ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లు (జూడాలు) వారి 'విధులు పూర్తి విరమణ' పిలుపును రద్దుచేసినప్పటికీ శనివారం సెంట్రల్ కోల్‌కతాలో 'నిరవధిక బైఠాయింపు' కార్యక్రమాన్ని చేపట్టారు. ఆర్‌జి కర్ మెడికల్ కాలేజి, హాస్పిటల్‌లో మహిళా డాక్టర్ మృతిని నిరసిస్తూ న్యాయం కావాలని ర్యాలీ నిర్వహిస్తున్న సమయంలో కొంతమంది పోలీసులు జూనియర్ డాక్టర్లపై లాఠీ ఛార్జీ చేశారని ఆరోపిస్తూ ఈ నిరవధిక ధర్నా నిర్వహించారు. వర్షానికి సైతం భయపడకుండా మైదానంలోనే రాత్రి అంతా ప్రదర్శన జరిపారు. కొంతమంది గొడుగులను ఒక చేతితో పట్టుకుని నిలుచున్నారు. కాగా అదేసమయంలో మరికొంతమంది తాత్కాలిక ప్లాస్టిక్ షెడ్ కిందనే ఉండి ఆందోళనలో భాగస్వాములయ్యారు. దక్షిణ కోల్‌కతా నగరంలోని ఎస్ప్లనేడ్ ఏరియాలో ఉన్న ఎస్‌ఎస్‌కెఎం హాస్పిటల్ నుంచి శుక్రవారం నాడు ర్యాలీ నిర్వహిస్తున్న సమయంలో పోలీసులు నిరసనకారులపై లాఠీఛార్జి చేశారని జూనియర్ డాక్టర్లు ఆరోపించారు. వక్కురం 8:30గంటల సమయంలో జూనియర్ డాక్టర్లు ప్రభుత్వ హాస్పిటళ్లలో 'పూర్తి పని విరమణ' పిలుపును రద్దు చేసుకున్నారు. కానీ 24గంటలలోపు తమ డిమాండ్లను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం పరిష్కరించని పక్షంలో ఆమరణ నిరాహారదీక్ష చేపడతామని జూనియర్ డాక్టర్లు హెచ్చరించారు. వారు తమ ప్రదర్శన సమయాన్ని గుర్తు చేసేందుకు పెద్ద గడియారాన్ని అక్కడ ఏర్పాటుచేసుకున్నారు.'ఎప్పుడైతే మీరు ప్రాముఖ్యత కలిగిన కారణం కోసం పోరాడుతున్నారో అప్పుడు పరిస్థితులు మనకు సులభంగా మారతాయని మీరు అంచనా వేయకూడదు. రాష్ట్రప్రభుత్వం మనకు అనుకూలధోరణిని ప్రదర్శిస్తుందని మేం ఊహించాం. పోలీసులు దుర్భాషలాడుతూ లాఠీఛార్జీ చేయడంతో మేం కూడా అదే పద్ధతిలో వ్యవహరించక తప్పలేదు. అప్పుడు మేం క్షమాపణను డిమాండ్ చేశాం' అని జూనియర్ డాక్టర్ల నిరసనకు నాయకత్వం వహిస్తున్న దేబసిష్ హల్దేర్ తెలియజేశారు. 'మా డిమాండ్లను పరిష్కరించేంత వరకూ మేం ఈ స్థలాన్ని ఖాళీ చేయం' అని ఆయన చెప్పారు. ఆర్‌జి కర్ మెడికల్ కాలేజి మెడికోలు సహా పరిసర ప్రాంతాలలోని వివిధ హాస్పిటళ్ల నుంచి అక్కడికి చేరుకున్న మెడికోలు కూడా నిరసన ప్రదర్శనలో భాగస్వాములయ్యారు. ఈ గడియారం ముల్లు వారి కోసమే టిక్‌టిక్ మని కొట్టుకుంటూ సమయాన్ని గుర్తుచేస్తోంది' అని మరో జూనియర్ మెడికో అనికేత్ మహతో వివరించారు. హత్యాచారానికి గురైన ట్రైనీ మహిళా డాక్టర్‌కు న్యాయం చేయాలి, డాక్టర్లకు భద్రత కల్పించాలనే డిమాండ్‌ను మొదటి ప్రాధాన్యతగా నొక్కిచెబుతూ వారు ఈ నిరసనలు చేపట్టారు. వారి తొమ్మిది డిమాండ్లలో మొట్ట మొదటగా పశ్చిమబెంగాల్ రాష్ట్ర ఆరోగ్య సెక్రటరీ ఎన్‌ఎస్.నిగమ్‌ను తక్షణమే తొలగించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అంతేకాకుండా ఆరోగ్య శాఖలో అవినీతిని అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# ప్రతిపక్ష పార్టీలు నాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయి:కర్నాటక సిఎం



**రాయ్‌చూర్ (కర్నాటక) :** ప్రతిపక్ష పార్టీలు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు కాబట్టి తాను తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసే ప్రసక్తేలేదని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పునరుద్ఘాటించారు. వాస్తవిక పరిస్థితి ఏమిటన్నది తాను రాష్ట్ర ప్రజల ముందుంచుతానని ఆయన తేల్చిచెప్పారు. ఆయన శనివారం నాడు ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) స్థల కేటాయింపు కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీకి చెందిన దళిత, గిరిజన నాయకులు సమావేశాలు నిర్వహిస్తూ రాజకీయ కార్యకలాపాలు ముమ్మరం చేయడం వల్ల ప్రజల్లో అనవసరమైన ఊహాగానాలు తలెత్తుతున్నాయని ఆయన విలేకరులడిగిన ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. మంత్రులు చర్చించుకుంటారు కానీ మీరు వాటి గురించి ఊహిస్తారా?. పబ్లిక్ వర్క్స్ మినిస్టర్ సతీష్ జర్కిహోళి లేదా సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి ఎన్‌ఎస్. బోస్‌రాజుతో ఎఐసిసి ప్రసిడెంట్ మలికార్జున ఖర్గేతో సమావేశాలు గతంలో జరిగినప్పుడు అలాంటి ఊహాగానాలకు ఎందుకు బలం చేకూరుతుందోనని సిద్ధరామయ్య ఆశ్చర్యం వ్యక్తంచేశారు. మైసూరులో దసరా ఉత్సవాలను ప్రారంభించిన సమయంలో సీనియర్ జనతాదళ్ (ఎస్) ఎమ్మెల్యే జిటి.దేవగౌడ తనకు మద్దతుగా నిలిచారని , ఆయన మాత్రమే నిజం వివరించారని సిద్ధరామయ్య అన్నారు. 'జిటి.దేవగౌడ జనతాదళ్ (ఎస్) కోర్ కమిటీ ఛైర్‌పర్సన్ మరియు ముడా సభ్యులలో ఒకరైన జిటి.దేవగౌడ ఆయన మాత్రమే నిజం చెప్పారు. అందులో తప్పేమి ఉన్నది' అని విలేకరులను ఉద్దేశించి అన్నారు. సెప్టెంబరు 25న స్పెషల్ కోర్టు లోకాయుక్త పోలీసులను ముడా స్థలం కేటాయింపు కేసులో విచారణ చేపట్టాలని ఆదేశించిన నేపథ్యంలో సిద్ధరామయ్య రాజీనామా చేయాలని ప్రతిపక్ష పార్టీలు ఒత్తిడిని తీవ్రం చేస్తున్నాయి.

# కాంగ్రెస్‌ను నడిపిస్తున్నది అర్బన్ నక్సల్స్ గ్రూపే

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆరోపణ

**వాషిం:** అర్బన్ నక్సల్స్ గ్రూపే కాంగ్రెస్‌పార్టీని నడిపిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆరోపించారు. మహారాష్ట్రలోని వాషిం జిల్లాలో శనివారం జరిగన పెద్ద ర్యాలీలో మోదీ ప్రసంగించారు. 'అర్బన్ నక్సల్స్ గ్యాంగ్' వెనక ఉండి కాంగ్రెస్‌పార్టీని నడిపిస్తోందని ఆరోపిస్తూ, ఆ పార్టీ ఎంచుకున్న అత్యంత ప్రమాదకరమైన ఇలాంటి ఎజెండాను ప్రజలందరూ ఐక్యంగా ఓడించాలని పిలుపు ఇచ్చారు. బిజెపి ప్రభుత్వం వికసిత్ భారత్ కోసం, రైతుల కోసం కట్టుబడి ఉందన్నారు. ప్రజా సమస్యలపై నిరసన ప్రదర్శనలు చేసేవారివల్ల పాలకపక్షంపై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడుతోందనే ఉద్దేశంతో ఈ నిరసన ప్రదర్శకులపై 'అర్బన్ నక్సల్స్' అని మోదీ ప్రభుత్వం ముద్ర వేసింది. సమాజంలో మంచికోసం పోరాడేవారిపై 'అర్బన్ నక్సల్స్' అని ముద్రవేయడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని ప్రముఖ చరిత్రకారిణి రొమిల్లా థాపర్ కొన్నేళ్ళక్రితమే మోదీ ప్రభుత్వాన్ని విమర్శించారు. మోదీకి పలు ప్రశ్నలు సంధించి తగిన సమాధానం చెప్పాలని నిలదీయడం ఈ సందర్భంగా గమనార్హం. కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారనీ, తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఇప్పటికీ ఇంకా రుణమాఫీ కోసం కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారని వాషిం ర్యాలీలో మోదీ విమర్శించారు. రుణాలు మాఫీ చేస్తామని తెలంగాణలో రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలు చెప్పిందని, కర్ణాటకలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం బిజెపి ప్రారంభించిన నీటిపారుదలా పథకాలను నిలిపివేసిందని విమర్శించారు. రైతులకు, నీటిపారుదల పథకాలకు కేటాయించిన నిధులను కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాలలో అవినీతి మార్గంలో కాజేస్తున్నారని ఆరోపించారు. ''మనం అందరం ఐక్యమైతే, దేశాన్ని విభజించాలనే వారి ఎజెండా విఫలమైపోతుంది అని కాంగ్రెస్‌పార్టీ ఆలోచిస్తోంది'' అని తీవ్ర ఆరోపణలు చేశారు. వాషిం జిల్లాలో పర్యటన సందర్భంగా మోదీ పలు ప్రాజెక్టులను ప్రారంభించి అనంతరం ఒక సభలో ప్రసంగించారు. పేదలను ఎలా దోచుకోవాలనే ఒకేఒక్కటి మాత్రమే కాంగ్రెస్‌పార్టీకి తెలిసిన విషయమని, రాజకీయ స్వప్రయోజనాలకోసం పేదలను అలాగే మిగిల్చేయడం దాని ఉద్దేశమని విమర్శించారు.ప్రజలను ఎలా విభజించాలో కాంగ్రెస్‌కు తెలుసునని, అందువల్ల మనందరం అప్రమత్తంగా, ఐక్యంగా ఉండాలన్నారు. ఇటీవల ఢిల్లీలో వేలకోట్ల రూపాయలు విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారనీ, ఈ కేసులో కాంగ్రెస్‌పార్టీ నాయకుడు సూత్రధారిఇ పాత్రలో అనుమానితుడుగా ఉన్నాడనీ, యువతరాన్ని మత్తుమందులో ముంచెత్తి ధనం సంపాదిస్తోందని, ఈ ధనాన్ని ఎన్నికల్లో ఉపయోగించుకుంటున్నదనీ మోదీ విమర్శించారు. దళితులు, వెనుకబడిన వర్గాలు, గిరిజనులను బ్రిటిష్ వలస పాలకుల తరహాలోనే కాంగ్రెస్‌పార్టీ కూడా సమానులుగా పరిగణించడంలేదని విమర్శించారు.



# హర్యానా ఎన్నికల్లో 61 శాతం పోలింగ్

70 సీట్లు గెలుస్తాం: కాంగ్రెస్ ధీమా




**చండీగఢ్ :** హర్యానా అసెంబ్లీకి శనివారం జరిగిన ఎన్నికల్లో 61 శాతం పోలింగ్ జరిగింది. సాయంత్రం ఐదు గంటల నాటికి అందిన సమాచారం ప్రకారం 61 శాతం పోలింగ్ జరిగిందని అధికారులు చెప్పారు. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ పూర్తి అవుతుంది. 2019 అసెంబ్లీ ఎన్నికలలో 68 శాతం పోలింగ్ జరిగింది. ఈసారి అంతకంటే తక్కువగానే పోలింగ్ నమోదైంది. ఈనెల 8వ తేదీన మంగళవారంనాడు ఓట్ల లెక్కింపు జరుగుతుంది. హర్యానాలో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలు ఉండగా, 2.03 కోట్లమంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. వీరికోసం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 20,632 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, వీటిల్లో 144 పోలింగ్ కేంద్రాలను ఆదర్శ పోలింగ్ కేంద్రాలుగా రూపుదిద్దారు. 115 పోలింగ్ కేంద్రాలను పూర్తిగా మహిళలే నిర్వహించారు. మూడోసారి కూడా హర్యానాలో అధికారం చేజిక్కించుకోవాలని బిజెపి ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నది. దశాబ్దకాలం తర్వాత తిరిగి హర్యానాలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్‌పార్టీ కూడా ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నది. కాగా కాంగ్రెస్‌పార్టీకి చెందిన నాయకులు, మల్లయోధుడు బజ్రంగ్ పూనియా మాట్లాడుతూ హర్యానాలో కాంగ్రెస్ ప్రభంజనం కనిపిస్తోందన్నారు. తమ పార్టీ 60 లేదా 70 అసెంబ్లీ స్థానాలు గెలుచుకుంటుందన్నారు. తమ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని కాంగ్రెస్ నాయకురాలు సెల్జా అన్నారు. బిజెపి, కాంగ్రెస్‌తోపాటు ఐఎన్‌ఎల్‌డి–బిఎస్‌పి, జెజెపి–ఆజాద్ సమాజ్‌పార్టీ కూటములు కూడా పోటీలో ఉన్నాయి. ఆమ్ ఆద్మీపార్టీ కూడా ఈ ఎన్నికల్లో ఒక కీలకమైన పార్టీగా ఉంది. అన్ని పార్టీల నుండీ మొత్తం 1,031 మంది అభ్యర్థులు పోటీ చేయగా వీరిలో 101 మంది మాత్రమే మహిళా అభ్యర్థులు ఉన్నారు. మరో 464 మంది స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేశారు. ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైని, అనిల్ విజ్, ఓ.పి.ధన్‌కర్ (బిజెపి), భూపేందర్ సింగ్ హూడా, వినేష్ ఫోగాట్, (కాంగ్రెస్), అభయ్ సింగ్ చౌతాలా (ఐఎన్‌ఎల్‌డి), దుష్యంత్ చౌతాలా (జెజెపి) వంటి ప్రముఖులు ఎన్నికల బరిలో ఉన్నారు.

# రూ.20,వేల కోట్ల పిఎం కిసాన్ సమ్మాన్ నిధులు విడుదల

**ముంబయి :** అన్నదాతలకు వ్యవసాయ పెట్టుబడి సాయం అందించే పిఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 18వ ఇన్‌స్టాల్‌మెంట్ కింద రూ.20,000 కోట్ల మొత్తాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం నాడు విడుదల చేశారు. మహారాష్ట్రలోని వాశింలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని స్వయంగా పాల్గొని ఈ నిధులను విడుదల చేశారు. మధ్యవర్తల ప్రమేయం లేకుండా దేశవ్యాప్తంగా 9.4 కోట్ల మంది రైతులకు నేరుగా వారి అకౌంట్లలోనే ఈ మొత్తం జమ అవుతుంది. సిఎం కిసాన్ నిధుల విడుదలకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానితో పాటు మహారాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవిస్, అజిత్ పవార్, మంత్రి సంజయ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. వెబ్ కాస్టింగ్ ద్వారా 732 కృషి విజ్ఞాన్ కేంద్రాలు, లక్ష ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘాలు, 5 లక్షల కామన్ సర్వీస్ సెంటర్లతో సహా 2.5 కోట్ల మంత్రి రైతులు హాజరయ్యారు. భూములున్న రైతులకు మూడు వాయిదాల్లో ఏటా రూ.6,000 ఇచ్చే పిఎంకిసాన్ పథకాన్ని 2019 ఫిబ్రవరి 24న ప్రారంభించారు. శనివారంనాడు 18వ ఇన్‌స్టాల్‌మెంట్ కింద ప్రధాని విడుదల చేసిన మొత్తంతో కలిసి ఇంతవరకూ రూ.3.45 లక్షల కోట్లకు పైగా పంపిణీ జరిగింది. మహారాష్ట్రలో 17 ఇన్‌స్టాల్‌మెంట్స్‌లవో 1.20 కోట్ల రైతులకు రూ.32,000 కోట్లు జమ అయ్యాయి. 18వ ఇన్‌స్టాల్‌మెంట్‌గా 91.51 లక్షల రైతులు రూ.1,900 కోట్లకు పైగా ప్రయోజనం పొందనున్నారు. పీఎం కిసాన్ ఇన్‌స్టాల్‌మెంట్ పంపిణీతో పాటు రూ.2,000 కోట్లను నమో సేత్కారి మహాసన్మాన్ నిధి యోజన 5 ఇన్‌స్టాల్‌మెంట్ కింద మహారాష్ట్రకు ప్రధామంత్రి విడుదల చేశారు.

# విమానాశ్రయాలకు బాంబు బెదిరింపు..

**న్యూఢిల్లీ :** దేశంలో వరుస బాంబు బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. తాజాగా గుజరాత్‌లోని వడోదర, రాజ్‌కోట్ విమానాశ్రయాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఉదయం 11 గంటల ప్రాంతంలో సిఐఎస్‌ఎఫ్ ఇ–మెయిల్‌కు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దీంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. వెంటనే పోలీసులు, బాంబుస్క్వాడ్స్, ఎయిర్‌పోర్ట్ ఉన్నతాధికారులు అక్కడికి చేరుకొని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అయితే ఎటువంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని అధికారులు వెల్లడించారు. అయితే దేశంలోని ఇతర విమానాశ్రయాలకు సైతం ఇలాంటి బెదిరింపులు వచ్చినట్లు వడోదర పోలీస్ కమిషనర్ నర్సింహా కమోర్ ధ్రువీకరించారు. ఈ బెదిరింపులపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు.

# జమ్మూకశ్మీర్ ఫలితాల వేళ 'నామినేట్' రగడ..!

**జమ్ము :** జమ్ముకశ్మీర్ ఎన్నికల ఫలితాల వేళ నామినేట్ ఎమ్మెల్యేల అంశం తెరపైకి వచ్చింది. దీనిపట్ల రాజకీయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ ఏర్పాటులో వీరి పాత్ర కీలకం కానుండటమే దీనికి కారణం. కాంగ్రెస్ పార్టీ దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణిస్తోంది. జమ్ముకశ్మీర్‌కు సుదీర్ఘకాలం తర్వాత మూడు విడతల్లో ఎన్నికలు జరిగాయి. అక్టోబర్ 8న ఫలితాలు వెలువడనున్నా యి. ఈ నేపథ్యంలో హోంశాఖ సలహా మేరకు లెఫ్టినెంట్ గవర్నర్ ఐదుగురు ఎమ్మెల్యేలను నామినేట్ చేస్తారు. జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2019ను అనుసరించి ఈ నియమాకాలు చేపట్టబోతున్నారు. 2023 జులైలో ఈ చట్టాన్ని మరోసారి సవరించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి వచ్చిన శరణార్థులు నామినేటెడ్ ఎమ్మెల్యేలుగా నియమితులవుతారు. 90 సీట్లున్న జమ్ముకశ్మీర్ అసెంబ్లీలో నామినేటెడ్ ఎమ్మెల్యేల నియామకంతో మెజారిటీ మార్కు 48కి చేరనుంది. ఫలితాల్లో ఏ పార్టీకైనా సీట్లు తగ్గితే నామినేటెడ్ ఎమ్మెల్యేలు కీలకం కానున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

**వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్**

ప్రభుత్వ ఏర్పాటుకు ముందే ఎమ్మెల్యేలను నామినేటెడ్ చేసే అంశాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇది ప్రజాస్వామ్యంపైనా, రా జ్యాంగ మౌలిక సూత్రాలపై దాడిగా అభివర్ణించిం ది. ప్రభుత్వ ఏర్పాటుకు ముందు వీరిని నియమించడమంటే ప్రజల తీర్పును కాలరాసిన ట్లే అవుతుందని జెకెపిసిసి అధికార ప్రతినిధి రవీందర్ శర్మ తెలిపారు. రాజ్యాంగం ప్రకారం.. కేబినెట్ మంత్రుల సలహా మేరకే లెఫ్టినెంట్ గవర్నర్ నడుచుకోవాలి. ప్రభుత్వ ఏర్పాటులో వీరి ని భాగం చేయడం అంటే ఎల్‌జి త న అధికారాలను దుర్వినియోగం చేయడమే అవుతుందని పే ర్కొన్నారు. ప్రభుత్వ ఏర్పాటు తర్వాత నామినేషన్ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఎన్నికలల్లో కాంగ్రె స్ నేషనల్ కాన్ఫరెన్స్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు.

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS / DISTRICT REGISTRAR
AT: KARIMNAGAR
A.R.B.No. 524 Of 2024
Between:
**M/S PAVANASUTHA CHITS PVT LTD., JAMMIKUNTA Branch,** Represented by its Foremen E. jagan, s/o Kanakaiah. Aged about:33 years, Foremen of above Chit Fund
...... DISPUTANT
VERSUS
KANKANALA SRINIVAS REDDY & others
.....OPPONENTS
**Opponent No. 1.** Kankanala Srinivas Reddy S/o Mohan Reddy, Age: (38) Years, R/o. H.no: 1-105, Vill & Mo: Ellanthakunta, Dist: Karimnagar.
**Opponent No.2.** Ponaganti Sadaiah S/o Narsaiah, Age: (46) Years, Desig: Telugu Pandit-II,ZPHS- Tekumatla, Mo: Tekumatla, Dist:Jayashanker BHPL R/o. H.no: 16-1-149/3, Near New Jayabharathi E/M School, Hanumandla Pally, Motkulagudem. Jamnikunta Dist: Karimnagar.
**Opponent No.3.** Varikela Ravikumar S/o Rajamouli, Age: (37) Years, Occ:Business, R/o. Hinc 2-3-1/1, Madipally Road, Jammikunta, Dist: Karimnagar.
**Opponent No.4.** Garampally Rajeshwar Rao S/o Mallaiah, Oce:Business, R/o. H.no:4-14/1,, Jammikunta, Dist:Karimnagar Age: (53) Years.
Please Take Notice that the above dispute is filed against you and others for recovery of money in the past you have been issued summon.but you have failed to receive the same. The above dispute is posted on **25 OCT 2024** for your appearance. On the day you have to appear in person at **11:00 A.M** before the Deputy Registrar of Chits/District Registrar refered above, other wise the case will bedecided ex-parte
CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS
KARIMNAGAR

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS / DISTRICT REGISTRAR
AT: KARIMNAGAR
A.R.B.No. 517 Of 2024
Between:
**M/S PAVANASUTHA CHITS PVT LTD., JAMMIKUNTA Branch,** Represented by its Foremen E. jagan, s/o Kanakaiah. Aged about:33 years, Foremen of above Chit Fund
...... DISPUTANT
VERSUS
PAIDA SRINIVASA RAO & others
.....OPPONENTS
**Opponent No. 1.** Paidakula Srinivas Rao S/o Rajamallaiah, Age:(49) Years, Desig: Sr. Asst-DEO office, Warangal (Rural), R/o. H.no: 2-4-1621, Ashoka Colony. NGOS Colony Road, Hanamkonda.
**Opponent No.2.** Paidakula Komuraiah S/o Rangaiah, Age: (55) Years, Occ: S.A-Telugu, ZPHS, Peddapapaiahpally, Huzurabad. Hanamkonda. R/o. H.no: 2-2-116. Naimnagar.
**Opponent No.3.** Gugulothu Bhojya S/o Peeka, Age: (42) Years, Disg: S.G.T-MPPS- I/o. Narayana Puram. Emp Code: 2132054, Mdl: Kuravi, Warangal. R/o. H.no. 3-25, Venkateshwara Bazar, Mahabubad, Warangal.
Please Take Notice that the above dispute is filed against you and others for recovery of money in the past you have been issued summon.but you have failed to receive the same. The above dispute is posted on **25 OCT 2024** for your appearance. On the day you have to appear in person at **11:00 A.M** before the Deputy Registrar of Chits/District Registrar refered above, other wise the case will bedecided ex-parte
CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS
KARIMNAGAR

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS / DISTRICT REGISTRAR
AT: KARIMNAGAR
A.R.B.No. 518 Of 2024
Between:
**M/S PAVANASUTHA CHITS PVT LTD., JAMMIKUNTA Branch,** Represented by its Foremen E. jagan, s/o Kanakaiah. Aged about:33 years, Foremen of above Chit Fund
...... DISPUTANT
VERSUS
MISALA RAJABABU & others
.....OPPONENTS
**Opponent No.2.** Naitham Chandraiah S/o Bhimaiah, Age: (50) Years, Design: Gene 1 Mazdoor, SRP-I Incline, 2835- 3. H.no: 10-74, Manche Srirampur Area, Mancheriyal, Emp Code: Arunakka Nagar, Srirampur Colony.Mdl & Dist:
**Opponent No.3.** Maddela Ramu S/o Venkati, Age: (54) Years, Desg: Electrician, RK-6 Incline, Srirampur Area, Mancheriyal. Emp Code: 02358530 R/o. H.no:68- 62/1,1 Zone, Mandamarri, Dist:Mancheriyal, and Q.no:D-03, 3d Zone, Po: Kalyanikhani, Mandamari, Dist: Mancheriyal-504231.
Please Take Notice that the above dispute is filed against you and others for recovery of money in the past you have been issued summon.but you have failed to receive the same. The above dispute is posted on **25 OCT 2024** for your appearance. On the day you have to appear in person at **11:00 A.M** before the Deputy Registrar of Chits/District Registrar refered above, other wise the case will bedecided ex-parte
CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS
KARIMNAGAR

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS / DISTRICT REGISTRAR
AT: KARIMNAGAR
A.R.B.No. 519 OF 2024
Between:
**M/S PAVANASUTHA CHITS PVT LTD., JAMMIKUNTA Branch,** Represented by its Foremen E. jagan, s/o Kanakaiah. Aged about:33 years, Foremen of above Chit Fund
...... DISPUTANT
VERSUS
TUMMALA SWAPNA & others
.....OPPONENTS
**Opponent No.3.** Davu Chandrashekar Reddy S/o Mallareddy, Age: (48) Years, Disg:SDL/LHD Opareter, G.D.K-7 LEP, Ramagundam-1. Emp Code:0994738, R/o.Q.no.T2-811, Santhosh Nagar, 8 incline Colony, Godavarikhani, Peddapally.
**Opponent No.4.** Vorem Vijay Kumar S/o Aashirvadham, Age: (44) Years, Disg: Security Guard, S&PC,RG-III, Ramagundam-III, Emp Code:291, R/o.H.no: 75-136, 3d Zone, Mandamarri, Mancheriyal.
**Opponent No.6.** Ninala Srinivas S/o Rajam, Age: (37) Years, Disg: M.V Driver, Dept: OCP-III CHP, Ramagundam-II, R/o. Block No-16, Milliniyam Quartars, Ganga Nagar, Godavarikhani, Peddapally.
Please Take Notice that the above dispute is filed against you and others for recovery of money in the past you have been issued summon.but you have failed to receive the same. The above dispute is posted on **25 OCT 2024** for your appearance. On the day you have to appear in person at **11:00 A.M** before the Deputy Registrar of Chits/District Registrar refered above, other wise the case will bedecided ex-parte
CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS
KARIMNAGAR

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS / DISTRICT REGISTRAR
AT: KARIMNAGAR
A.R.B.No. 520 Of 2024
Between:
**M/S PAVANASUTHA CHITS PVT LTD., JAMMIKUNTA Branch,** Represented by its Foremen E. jagan, s/o Kanakaiah. Aged about:33 years, Foremen of above Chit Fund
...... DISPUTANT
VERSUS
CHERALA PRABHAKAR & others
.....OPPONENTS
**Opponent No.1.** Cherala Prabhakar S/o Vasudev. Age: (41) Years, Desig: Conductor. TSRTC, Bhupalpally. Emp id: 653430, R/o. H.no: 11-17-185, Near indiragandi Statue, Kashibugga, Warangal-506002.
**Opponent No.2.** Kodam Swapna D/o Srinivas, Age: (34) Years. Desi: Conductor, TSRTC,Parkal Emp id: 653568,R/o. H.no: 2-91, Venkateswarlapally, Post: Narlapur, Parkal, Dist: J shanker -506391.
**Opponent No.3.** Cherala Pramod Kumar S/o Vasudev, Age: (42) Years, Desi: Couctor, TSRTC, Janagon, Emp Id: 653691, R/o.H.no: 1-75/7/11.Plot No. 02. Brundavan Colony, Road No.04. Ghatkesar Mondal. Boduppal, Rangareddi-500092.
Please Take Notice that the above dispute is filed against you and others for recovery of money in the past you have been issued summon.but you have failed to receive the same. The above dispute is posted on **25 OCT 2024** for your appearance. On the day you have to appear in person at **11:00 A.M** before the Deputy Registrar of Chits/District Registrar refered above, other wise the case will bedecided ex-parte
CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS
KARIMNAGAR

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS / DISTRICT REGISTRAR
AT: KARIMNAGAR
A.R.B.No. 521 Of 2024
Between:
**M/S PAVANASUTHA CHITS PVT LTD., JAMMIKUNTA Branch,** Represented by its Foremen E. jagan, s/o Kanakaiah. Aged about:33 years, Foremen of above Chit Fund
...... DISPUTANT
VERSUS
TIPPANT THOR PATHI & others
.....OPPONENTS
**Opponent No.1.** Thippani Thirupathi So Rajaiah, Age: (41) Years, Desi:Driver, Huzurabad Dept., TSRTC R/o. H.no:2-1-56/2/1, Near Annapurna Theater, Housing Board Colony, Jammikunta, Dist: Karimnagar (T.S).
**Opponent No.2.** Kemmasarapu Sammaiah, S/o Yellaiah. Age: 54.Occ:Driver, Huzurabad Depo, TSRTC,R/o: 1-60, Elabotharam, Saidapoor.Karimnagar, Telangana, India.
**Opponent No.3.** Chitikesi Ravinder S/o Prabhakar, Age: (42) Years, Desig: Driver. Huzur Dejo. TSTRC.R/o. H.no: 13-5-20, Matte Wada, Beside Old Crime Branch, VishwaBrahmana Veedi, Warangal-506002.
**Opponent No.5.** Mekala Kumaraswamy S/o Mankaiah, Age: (46) Years, Desig:Driver. Huzurabad Depo, TSRTC. R/o. H.no:5-99, Vill & Mo: Suraram, Dist: Karimnagar. Pin:505476.
Please Take Notice that the above dispute is filed against you and others for recovery of money in the past you have been issued summon.but you have failed to receive the same. The above dispute is posted on **25 OCT 2024** for your appearance. On the day you have to appear in person at **11:00 A.M** before the Deputy Registrar of Chits/District Registrar refered above, other wise the case will bedecided ex-parte
CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS
KARIMNAGAR

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS / DISTRICT REGISTRAR
AT: KARIMNAGAR
A.R.B.No. 523 Of 2024
Between:
**M/S PAVANASUTHA CHITS PVT LTD., JAMMIKUNTA Branch,** Represented by its Foremen E. jagan, s/o Kanakaiah. Aged about:33 years, Foremen of above Chit Fund
...... DISPUTANT
VERSUS
MD JAVEED & others
.....OPPONENTS
**Opponent No.1.** Md Javeed S/o Masthan, Age: (34) Years, Desig:P.E.T. ZPHS-Kunaram, Mo:Srirampur. Dist: Peddapili, R/o.H.no: 4-43, Srirampur, Kalva Srirampur. Dist:Peddapally-505153.
**Opponent No.3.** Allam Balashow Reddy S/o Rajareddy. Age: (48) Years, Desig Scho Assistant (English), ZPHS - Kunaram (v), Mdl: Sriramput, Dist: Peddapalli, R/o. H.No.3- 93, Mdl:Geesugonda, Manugoda, Warangal-506330.
**Opponent no.4.** Thandra Srinivas S/o Mondaiah, Age: (44) Years, Desig: S.G.T. PS-Peddapally, R/o.H.no: 3-50/1, Harijana Wada, Sriramput, Kalva Srirampur, Dist: Peddapally.
Please Take Notice that the above dispute is filed against you and others for recovery of money in the past you have been issued summon.but you have failed to receive the same. The above dispute is posted on **25 OCT 2024** for your appearance. On the day you have to appear in person at **11:00 A.M** before the Deputy Registrar of Chits/District Registrar refered above, other wise the case will bedecided ex-parte
CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS
KARIMNAGAR




## కరేబియన్ కోతి జీవనశైలిని ఆవిష్కరిస్తున్న శిలాజాలు



అంతరించిపోయిన కరేబియన్ కోతి జీవన శైలిని కొత్తగా కనుగొన్న శిలాజాలు ఆవిష్కరిస్తున్నాయి. జాన్స్ హాప్కిన్స్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ నిపుణుల బృందం ఈ అసాధారణ, అరుదైన శిలాజాలను విశ్లేషించింది. తాజాగా ఎర్త్‌డాట్ కామ్‌లో ప్రచురించిన నివేదికను అనుసరించి, ఎన్నడో అతరించిపోయిన కరేబియన్ కోతుల శరీర నిర్మాణం నుంచి జీవన శైలి వరకూ అనేక వివరాలను ఈ బృందం కనుగొంది.



ఇప్పటికే పలు కోతి జాతులు అంతరించిపోగా, మరికొన్ని అదే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. అయితే, ఈ తాజా అధ్యయనాల సాయంతో, అంతరించిపోతున్న జాతులను కాపాడేందుకు మార్గం సుగమవుతుంది. క్యువా మాకో శిలాజ ప్రదేశంలో ఈ అసాధారణ అన్వేషణ జరిగింది. హైతీ, డొమినికన్ రిపబ్లిక సరిహద్దుల్లోని కరేబియన్ ద్వీపం హిస్పానియోలాలో నిపుణుల బృందం శిలాజాలను కనిపెట్టడగమేగాక, వాటిని విశ్లేషించింది. 'ఈ శిలాజాలు యాంటిల్లోథ్రిక్స్ శరీర నిర్మాణ శాస్త్రాన్ని అర్థం చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి' అని జాన్స్ హాప్కిన్స్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌లో ఫంక్షనల్ అనాటమీ, ఎవల్యూషన్ అసోసియేట్ ప్రొఫెసర డాక్టర్ సియోభన్ కుక్ వ్యాఖ్యానించాడు. కరేబియన్ కోతులు అంతరించిపోవడానికిగల కారణాలను తెలుసుకోవడం ద్వారా, భవిష్యత్తులో అలాంటి ప్రమాదాలను అరికట్టడానికి మార్గాలను అన్వేషించవచ్చని పేర్కొన్నారు. పర్చువల్ త్రీడైమెన్షనల్ మోడల్స్‌ను ఉపయోగించి, శిలాజాలను నిపుణులు క్షుణ్ణంగా అధ్యయనం చేయగలిగారు. యాంటిల్లోథ్రిక్స్ మెర్నన్సిస్ మోనోమార్ఫిక్ జాతిలో ఆడ, మగ కోతులు దాదాపు ఒకే ఎత్తు, బరువుతో ఉన్నాయం. ఈ జాతికి దక్షిణ అమెరికాలోని 'టిటి' జాతి కోతికి దగ్గర సంబంధం ఉందని నిపుణులు దాదాపుగా ఒక అభిప్రాయానికి వచ్చారు. మరింత లోతైన విశ్లేషణలు జరిగితే, అంతరించిపోతున్న అరుదైన జంతుజాలాలను, ప్రత్యేకించి కోతి జాతులను కాపాడుకోవచ్చని వారి నిశ్చితాభిప్రాయం.

## దీనా సనిచార్... నిజజీవితంలో 'మోగ్లీ'



ఎంతో పాపులారిటీ సంపాదించుకున్న టివి సీరియల్ 'జంగిల్‌బుక్'లో 'మోగ్లీ'లో ఓ బాలుడు చిన్నతనంలోనే తప్పిపోతాడు. అడవిలోని తోడేళ్లు అతనిని పెంచుతాయి. ఈ సీరియల్‌కు దీనా సనిచార్ జీవితం స్ఫూర్తినిచ్చిందని చెప్పాలి. 1860 లేదా 1861లో జన్మించినట్టు భావిస్తున్న సనిచార్ మన దేశంలోని ఉత్తరప్రదేశ్, బులంద్ షహర్‌లో కనిపించాడు. ఒక గుహలో, తోడేళ్ల గుంపు మధ్య ఉన్న అతనిని వేటగాళ్ల బృందం కనుగొంది. అప్పటికి అతని వయసు సుమారు ఆరు సంవత్సరాలు. సనిచార్‌ను తోడేళ్ల గుంపు నుంచి వేరుచేసిన వేటగాళ్లు, అతనిని అధికారులకు అప్పగించారు. వారు ఆ బాలుడిని సికింద్రా అనాథాశ్రమానికి పంపారు. అక్కడ ఇరవై సంవత్సరాలకుపైగా అతను సాధారణ మనుషుల మధ్య ఉన్నప్పటికీ, మాట్లాడడం నేర్చుకోలేదు. సరిగ్గా తినేవాడు కాదు. చాలా సన్నగా, బలహీనంగా ఉండేవాడు. అనాథాశ్రమంలో దీనా సచినార్ అనే పేరు పేట్టేవరకూ అతనికి అసలు పేరు కూడా లేదు. సనిచార్ అంటే శనివారం అని అర్థం. అనాథాశ్రమంలో ఎవరితోనూ కలవకుండా మౌనంగా ఉండే అతను ఎక్కువగా ధూమపానం చేసేవాడు. 1895లో, సుమారు 34 ఏళ్ల వయసులో క్షయ వ్యాధితో సనిచార్ మరణించాడు. రుద్యార్ట్ కిప్లింగ్ రచించిన 'ది జంగిల్ బుక్'లోని మోగ్లీ పాత్రను సనిచార్ జీవితం ప్రేరణకావచ్చని అంటారు.

## అట్టడుగు వర్గాల దురవస్థలకు నిలువెత్తు రూపం అతుల్ కేసు



సాంకేతిక లోపం ఏర్పడిన కారణంగా అడ్మిషన్ ఫీజు చెల్లించడంలో కొన్ని నిమిషాలు జాప్యం జరగ్గా, ప్రవేశాన్ని కోల్పోయిన దళిత విద్యార్థి అతుల్ కుమార్ కేసుతో ఎన్నో సామాజిక అంశాలు మరో సారి తెరపైకి వచ్చాయి. ప్రత్యేకించి అట్టడుగు వర్గాలు ఎదుర్కొంటున్న సామాజిక, వ్యవస్థాగత సవాళ్లను ఈ కేసు ప్రతిబింబిస్తున్నది. కష్టతరమైన పరీక్షల్లో ఒకటైన జెఇఇ అడ్వాన్స్‌ను ఛేదించే ప్రతిభ ఉన్నప్పటికీ, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ జోక్యం చేసుకునే వరకూ, అతుల్‌కు అడ్మిషన్ లభించలేదు. చిన్నపాటి విధానమైన లోపాలు విద్యార్థులను, ప్రత్యేకించి అట్టడుగు వర్గాల నుంచి వచ్చిన వారి ప్రతిభను ఏ విధంగా అడ్డుకుంటున్నాయనే విషయాన్ని కోర్టు గుర్తించింది. అందరికీ సమ న్యాయం జరగాలనే మౌలిక సూత్రాన్ని న్యాయస్థానాలు ఏ విధంగా నిర్వర్తిస్తాయనే విషయాన్ని కూడా ఈ కేసు తెలియచేసింది. అడ్మిషన్లకు సంబంధించిన లోపాలు, పొరపాట్లు విద్యార్థులను ఏ విధంగా నష్టపరుస్తాయో చెప్పడానికి అతుల్ కేసు ఒక శక్తివంతమైన ఉదాహరణ. నియామక సూత్రాలు, నిబంధనలకు, కారుణ్య పాలనకు మధ్య ఉన్న అతి సూక్ష్మ మైన తేడాను కూడా సుప్రీం కోర్టు తన తీర్పుద్వారా తేటతెల్లం చేసింది. సాంకేతక లోపం వల్ల అడ్మిషన్‌ను నిరాకరించే యూనివర్శిటీ/ కళాశాలల యాజమాన్యాలకు సుప్రీం కోర్టు గట్టి హెచ్చరికలు జారీ చేసింది. అతుల్‌కు సీటు ఇవ్వాలని తీర్పు చెప్పడంతోపాటు, ఇలాంటి పరిస్థితులు మరే ఇతర విద్యార్థికీ కల్పించకూడదని ఆదేశించింది. మొత్తం మీద అతుల్ కేసు నిబంధనలు, సామాజిక న్యాయంలో ఏది ప్రధానమనే విషయంపైన కూడా స్పష్టతనిచ్చింది.

## కాలం చెల్లిన వాహనాలకు చెల్లుచీటీ



పర్యావరణ పరిశుభ్రత, రహదారి భద్రత ను ప్రోత్సహించడానికి రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ తీసుకొచ్చిన వెహికల్ స్క్రాపింగ్ పాలసీ 2021 ప్రకారం, కాలం చెల్లిన వాహనాలకు చెల్లుచీటీ తప్పదు. నిన్నమొన్నటి వరకూ ఈ చట్టాన్ని తేలిగ్గా తీసుకున్నా, ఇకపై అలాంటి నిర్లక్ష్యానికి భారీ మూల్యం తప్పదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఫిట్నెస్ లేని, కాలుష్య కారక వాహనాలను దశలవారీగా తొలగిస్తామని కేంద్రం ప్రకటించడంతో ఈ చట్టం మళ్లీ తెరపైకి వచ్చింది. భారత స్క్రాపేజ్ పరిశ్రమను వ్యవస్థీకృతంగా, పారదర్శకంగా, పర్యావరణ అనుకూలంగా మార్చాలన్నది ఈ చట్టం ప్రధాన లక్ష్యం. వాహనం ఎప్పటిదనే అంశంతో సంబంధం లేకుండా, కాలుష్యకారకమైన వాటిని స్వచ్ఛందంగా స్క్రాప్ చేసేలా ప్రజలను చైతన్యవంతులను చేయడంపైన కూడా ఈ చట్టం దృష్టి సారిస్తుంది. ఇకపై అన్ని పాత వాహనాలు తప్పనిసరిగా ఫిట్నెస్ పరీక్షను పూర్తి చేసుకోవాలి. పదిహేనేళ్లు పైబడిన అన్ని ప్రభుత్వ, వాణిజ్య వాహనాలు, ఇరవై ఏళ్లు పైబడిన అన్ని రకాల ప్రైవేటు వాహనాలకు ఈ పరీక్షలు తప్పవు. పాత వాహనాన్ని స్క్రాప్ చేసి, కొత్త వాహనం కొనుగోలు చేసే వారికి ఎక్స్ షోరూమ్ ధరలో 46 శాతం మొత్తాన్ని స్క్రాపింగ్ సెంటర్ల ద్వారా లభిస్తాయి. అదే విధంగా కొత్తగా తీసుకునే వాహనాలకు రిజిస్ట్రేషన్ ఫీజు మాఫీ, పన్నుల్లో 15శాతం వరకూ రాయితీ వంటి వెసులుబాటూ ఉంటుంది.

## మానసిక ఒత్తిడి తగ్గించే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్స్!



వివిధ రకాల సాధారణ రుగ్మతలకు వాడే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్స్ వల్ల మానసిక ఒత్తిడి చాలా వరకూ దూరమవుతుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఎమోరీ యూనివర్శిటీ పరిశోధకులు మాలిక్యులర్ సైకియాట్రీపై ఈ వారం ప్రచురించిన ఒక కొత్త అధ్యయనం ప్రకారం, డిప్రెషన్‌కు గురైన వారిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్స్ ప్రేరణను పెంచుతాయి. ఈ మందులు వాడే రోగులు, తీవ్రమైన మానసిక ఒత్తిడి నుంచి బయటపడ్డారని ఈ అధ్యయనం స్పష్టం చేస్తున్నది. డిఫ్రెషన్‌తో బాధపడుతున్న రోగులల్లో ఉండే నిస్సత్తువ, నిరాసక్తతలను తొలగించి, వారిలో సానుకూల భావాలను పెంపొందించడంలో ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్స్ ఉపయోగపడతాయి. 42 మందిపై చేసి న ప్రయోగాల్లో ఈ విషయం నిర్ధారణ అయిందని పరిశోధకులు అంటున్నారు. అయితే, డిఫ్రెషన్ అనేది ఎందుకు కలుగుతుందనే ప్రశ్నకు మాత్రం ఇంత వరకూ స్పష్టమైన సమాధానం లేదు. కొంత మంది ప్రతి చిన్న విషయానికీ తీవ్రంగా స్పందిస్తారు. మరికొంత మంది తమవి కాని సమస్యలపైనా స్పందిస్తారు. అదే విధంగా కొందరు ఎలాంటి పరిస్థితుల్లోనూ చలించరు. సాధ్యమైనంత వరకూ ఎదుర్కోవడానికి ప్రయత్నిస్తారు. ఎదురు దెబ్బలు తగిలినా ముందడుగు వేస్తారు. ఇలాంటి వారికి మానసిక సమస్యలు తక్కువ. కాబట్టి ఎవరికి, ఏఏ మందులు ఎంతెంత మోతాదులో ఇవ్వాలన్నది వైద్యులు నిర్ణయిస్తారు. వారి సూచనలను అనుసరించే చికిత్స చేయించుకోవాలే తప్ప సొంత వైద్యం పనికిరా దు.

**బిఎస్ఎస్ మైత్రేయి**

# పొరుగుతో దౌత్యం షురూ!

విదేశీ వ్యవహారాలమంత్రి ఎస్.జైశంకర్ శ్రీలంక పర్యటన, ఈనెల 16, 17 తేదీల్లో పాకిస్థాన్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ(ఎస్‌సిఒ) ప్రభుత్వాధినేతల సమావేశానికి జైశంకర్‌ను పంపాలన్న భారత్ తాజా నిర్ణయం పొరుగుదేశాలతో దౌత్యం వృద్ధికి శుభారంభమనవచ్చు.శ్రీలంకతో సంబంధాలు ఒక స్థాయిలో కొనసాగుతున్నప్పటికీ, పాకిస్థాన్‌తో పూర్తిగా స్తంభించి ఉన్నాయి. కశ్మీర్ సమస్య, దానితో ముడివడిన సీమాంతర ఉగ్రవాదం, సంబంధాల్లోని ఈ ఉద్రిక్తతలను ఇరుదేశాల్లోని పాలకపార్టీలు తమ రాజకీయ స్వప్రయోజనాలకు ఉపయోగించుకోవటం ఈ ఇంటిమీద కాకి ఆ ఇంటిమీద వాలని స్థితిని తెచ్చిపెట్టాయి. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ మాదేనంటూ కొత్త జమ్మూ–కశ్మీర్ అసెంబ్లీలో దానికి 24 సీట్లు కేటాయించింది మోదీ ప్రభుత్వం. ప్రధాని మోదీ 2021లో స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో బెలూచిస్థాన్, గిల్గిత్, పిఒకె సమస్యలను ప్రస్తావించటం అగ్గిమీద గుగ్గిలం వేసినట్లయింది. ఈ సమస్యలు అంతకుపూర్వం నుంచీ ఉన్నవే. కశ్మీర్ సమస్య ఉన్నప్పటికీ భారత్–పాకిస్థాన్ మధ్య ఉన్న సమస్యల పరిష్కారానికి, ప్రజల మధ్య సంబంధాలు, వాణిజ్య వృద్ధి, జమ్మూ–కశ్మీర్–పిఒకె మధ్య ప్రజల రాకపోకలు, సరిహద్దు వాణిజ్యం వంటి సమస్యలపై ఇరుదేశాల మధ్య అనేక దఫాలు చర్చలు జరిగాయి. కొన్ని అంగీకారాలు జరిగాయి. అయితే జనరల్ ముషారఫ్ కార్గిల్‌లో 1999 మే నెలలో యుద్ధానికి దిగి ఆ సద్భావన వాతావరణాన్ని భగ్నం చేశారు. ఈ నేపథ్యంలో ఈ పర్యాయం పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తున్న ఎస్‌సిఒ ప్రభుత్వాధినేతల సమావేశానికి మామూలుగా అయితే ప్రధాని నరేంద్రమోదీ హాజరు కావాలి. భారత్ తరపున ఎవరైనా పాల్గొంటారా లేదా అన్న సందిగ్ధంలో విదేశీ వ్యవహారాల మంత్రిని పంపాలని నిర్ణయించటం హర్షదాయకం. ఈ విషయం ప్రకటించిన విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జై స్వాల్, ఆ సమావేశాల సందర్భంలో ఇతరులతో (పాకిస్థాన్‌తో) జైశంకర్ సమావేశాలేవీ నిర్ణయం కాలేదని, ఏవైనా ప్రతిపాదనలు వస్తే అప్పుడు మీడియాకు చెబుతానని ఎంతో లౌక్యంతో కూడిన సమాధానమిచ్చారు. పాకిస్థాన్‌లో చర్చలకు ఇది చిన్నపాటి ఆరంభమివ్వాలని ఆశించుదాం.

ప్రజాపక్షం
06-10-2024, ఆదివారం

రెండేళ్లకు పైబడి ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న శ్రీలంక అధ్యక్షుడిగా వామపక్ష నాయకుడు అనురకుమార దిస్సానాయకె (ఎకెడిగా పాపులర్) ఎన్నికైన పూర్వరంగంలో విదేశీ వ్యవహారాలమంత్రి జైశంకర్ శుక్రవారం కొలంబోలో ఆయన్ను కలుసుకుని ప్రధాని నరేంద్ర మోదీ తరపున, తన తరపున శుభాకాంక్షలు తెలిపారు. ఎకెడి దేశాధ్యక్షుడైన తదుపరి శ్రీలంకను సందర్శించిన తొలి విదేశీ ప్రభుత్వాధికారి జైశంకరే. భారత–శ్రీలంకల మధ్య అనాదిగా ఉన్న సహోదర సంబంధాలు, మన దేశానికి చెందిన తమిళ సంతతి లక్షల సంఖ్యలో ఏనాడో లంకలో స్థిరపడటం, శ్రీలంక అభివృద్ధికి భారత్ సహాయ సహకారాలు, స్నేహ, వ్యాపార సంబంధాల ను పటిష్టం చేశాయి. అయితే శ్రీలంక భౌగోళిక స్థితి ప్రపంచంలోని పోటీశక్తులకు ఆకర్షణీయంగా మారింది. శ్రీలంక నేతలు ముఖ్యంగా చైనాతో ఆర్థిక సంబంధాలను వృద్ధి చేసుకున్నారు. మరోవైపున అమెరికా కూడా శ్రీలంకను చేరదీసింది. ఈ సంధి దశలో కోవిడ్ మహమ్మారి, టూరిజం ఆదాయంపై ఆధారపడిన శ్రీలంక ఆర్థిక వ్యవస్థను చావుదెబ్బతీసింది. ఒకవైపు తలకుమించిన ప్రాజెక్టులతో రుణభారం, రెండోవైపున ఆహార పదార్థాలు, ఆయిలు వంటి నిత్యజీవితావసరాల కొరతతో తలెత్తిన దుర్భరమైన ఆర్థిక సంక్షోభంలో ప్రజలు అధ్యక్ష భవనాన్ని ముట్టడించి తిరుగుబాటు చేశారు. అధ్యక్షుడు గొట్టబయ రాజపక్ష పరారైనాడు. ఆ ప్రజావెల్లువలో జాతీయ నాయకునిగా ఆవిర్భవించిన ఎకెడిలో ప్రజలు విశ్వాసముంచి అనూహ్యంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అతని ఆది పార్టీ జెవిపి ట్రాటిస్కీయిజం, మావోయిజంతో ప్రభావితమై సాయుధ పోరాటం చేసిన పార్టీ. ఆయన నిర్మించిన ఐక్యసంఘటన విప్లవాత్మక మార్పులకు అంకితమైంది.

శ్రీలంకలో చైనా పెట్టుబడులు, సైద్ధాంతికంగాను ఈ మార్క్సిస్టు అధ్యక్షుడు చైనాకు దగ్గర కావచ్చునన్న ఊహాగానాల నేపథ్యంలో ఆయనతో జైశంకర్ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. వారు ఉభయుల కు ఆసక్తిగల అనేక అంశాలను చర్చించినట్లు ఆయా ప్రభుత్వ ప్రకటనలు తెలియజేస్తున్నాయి. భారత్‌కు సంబంధించి ఆర్థిక సంబంధాల వృద్ధితోపాటు తమిళ సంతతి ప్రయోజనాల రక్షణ ముఖ్యం. భారత్ భద్రతా ప్రయోజనాలకు హాని కలిగే రీతిలో తమ భూభాగాన్ని ఉపయోగించుకోవటాన్ని అనుమతించబోమని శ్రీలంక నాయకులు హామీ ఇచ్చారు. భారత సందర్శనకు దిస్సానాయకేను మోదీ ఆహ్వానించగా, ఆయన మోదీకి ఎదురు ఆహ్వానం అందజేశారు. ప్రస్తుతానికి ఉభయ కుశలోపరి.

# జపాన్‌కు జననాల తగ్గుదల తిప్పలు

## నూతన ప్రధాని షిగెరు ఇషిబా ముందున్న సవాళ్లు

**అంజన్ రాయ్**

సమస్యలకు పరిష్కారాలు సంక్లిష్టంగా మారడంతో ఎటూపాలుపోక జపాన్‌దేశం నాలుగురోడ్ల కూడలిలో నిలబడిపోయింది. ఈ దశలో షిగెరు ఇషిబా జపాన్ కొత్త ప్రధానమంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. 38 ఏళ్ళుగా ప్రజాప్రతినిధిగా కొనసాగుతున్న ఇషిబా దేశానికి ఏదైనా చేయాలని చాలాకాలంగా ఎదురుచూస్తున్నారు. దేశ నాయకత్వం చేపట్టేందుకు ఆయన అనేకసార్లు ప్రయత్నాలు చేశారు. ఆ యత్నాలన్నీ విఫలమయ్యాయి. కానీ ప్రజల నమ్మకం కోల్పోన ఫుమియో కిషిదా ప్రధాని పదవి నుండి వైదొలగిన తర్వాత మాత్రమే ఇషిబాకు ఆ పదవీ బాధ్యతలు దక్కాయి. మూడు దశాబ్దాల సుదీర్ఘకాలంగా ఈ పదవికోసం ఎదురు చూసిన ఇషిబాలో రూపుదిద్దుకున్న కార్యాచరణను అమలు చేయడం ఇప్పుడు ఆయనకు అంత సులభం కాదు. దేశ పరిస్థితులు చక్కదిద్దడం కొత్త ప్రధానమంత్రికి నల్లేరుమీద నడక కాదు. గడచిన దశాబ్దాలనాటి వైభవోపేతమైన జపాన్ ఈనాడు అన్ని విధాలుగా వెనుకబడింది. ఇప్పుడు ప్రతిద్రవ్యోల్బణం బారిన పడింది. 1990వ దశకం నుండీ ధరలు పడిపోతున్నాయి. ఆర్థిక వ్యవస్థ ఏదో స్వల్పవృద్ధిని కనబరుస్తున్నది. ఆర్థికంగా మునిగిపోతున్నామనే భావన ప్రజల్లో సర్వత్రా నెలకుని ఉంది. కానీ జపాన్‌లో సకల సమస్యలకూ మూల కారణం క్షీణించిపోతున్న జనాభా. ఇది కేవలం జపాన్‌కు మాత్రమే పరిమితం కాదు. చాలా అభివృద్ధి చెందిన దేశాల్లో జనాభా సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతున్నది. కాకపోతే జపాన్‌లో ఈ సమస్య కాస్తంత ఎక్కువ మోతాదులో ఉంది. జనాభా సంఖ్య తగ్గిపోవడంతో గ్రామాలు ఖాళీ అవుతున్నాయి. అసలు పిల్లలే లేకపోవడంతో వారి ఆలనా పాలనా చూసే కిండర్‌గార్టెన్ స్కూళ్ళు మూత పడుతున్నాయి. కర్మాగారాలలో అదనపు శ్రమ చేయడానికి కార్మికుల కొరత ఏర్పడింది. వలసలను అనుమతించడానికి ఇష్టపడకపోవడంతో జపాన్‌లో పరిస్థితులు చాలా విచిత్రంగా మారిపోయాయి. మిశ్రమ సంతతి లేకపోవడంవల్ల అచ్చమైన సజాతీయులుగా మిగిలిపోయిన జపనీయులు విసుగెత్తిపోయారు. అన్నిరకాలుగానూ కుంచించుకుపోయి వెనుకబడిపోవడంతో ఆ ఒత్తిడివల్ల ఇప్పుడిప్పుడు మాత్రమే కొంతమేరకు జపనీయులు వలసలను అనుమతిస్తున్నారు. అదికూడా చాలా పరిమితంగానే. వాళ్ళుకూడా సమీపంలోని చైనా నుండే వస్తున్నారు. ఐతే చైనాకూడా జనాభా తరుగుదల సమస్య ఎదుర్కొంటున్నందువల్ల ఈ పరిమిత వలసలను కూడా ఆ దేశం అడ్డుకుంటున్నది.

నిజం చెప్పాలంటే, షిగెరు ఇషిబా నాయకత్వంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం జనాభా సమస్యను, ఆ తరుగుదల ధోరణులను తలక్రిందులు చేయలేదు. ఎందుకంటే ఇది దీర్ఘకాలంగా జపనీయులవల్ల వచ్చిన స్వీయ సమస్య. ఐనప్పటికీ విధాన నిర్ణేతలు మార్పులు చేపట్టడం ద్వారా కొంత ఉపశమనాన్ని కలిగించవచ్చు. జపాన్‌లో 30 శాతం జనాభా 60 ఏళ్ళ వయసు దాటినవారే. వారు తీసుకునే పెన్షన్, వైద్య భద్రతలకే సమాజ ఆదాయంలో అధికభాగం ఖర్చు అవుతోంది. అందువల్ల మరింత సౌకర్యవంతమైన వలస విధానం అనుసరించడంవల్ల శ్రామికుల కొరతను జపాన్ ఎదుర్కోగలుగుతుంది. దీంతో పాటే మహిళలపట్ల కూడా జపాన్ తన వైఖరి మార్చుకోవాల్సిన అవసరం ఉంది. ఈనాటికీ కూడా మహిళలపట్ల జపాన్‌లో తీవ్రమైన వివక్ష కొనసాగుతున్నది. పని ప్రదేశాల్లో పెద్దసంఖ్యలో మహిళలు భాగస్వాములుగా ఉండటం కొంతమేరకు ఉపశమనం కలిగించినప్పటికీ ఇటీవలి ప్రభుత్వాలు మాత్రం, మహిళలు మరింత ఎక్కువగా బిడ్డలను కనడంపైనే శ్రద్ధ చూపించాలని పదే పదే ఒత్తిడి చేస్తున్నాయి.



### ధరల క్షీణత, శ్రామికుల కొరత

జపాన్‌ను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్న ఆర్థిక సమస్యలలో ధరల ప్రతిష్టంభన ఒకటి. ఇప్పటికే చెప్పినట్టుగా ధరలు నిశ్చలంగా ఉండిపోవడం పెద్ద సమస్యగా ఉంది. ధరలు చాలా వరకూ పడిపోయాయి లేదా ఒక ఏడాదికాలంలో 0.3 శాతం మేరకు స్వల్పంగా పెరిగాయి. ధరల్లో ఈ మందకొడితనం లేకుండా చేసేందుకు జపాన్ సెంట్రల్ బ్యాంకు ద్రవ్యోల్బణం లక్ష్యాన్ని రెండూ శాతానికి తగ్గించింది. డిమాండ్‌ను ప్రోత్సహించడంద్వారా ధరల పెరుగుదలకు కూడా ఊతం ఇచ్చేందుకు జపాన్ సెంట్రల్ బ్యాంకు ఎక్కడాలేనంత స్థాయికి వడ్డీరేట్లను తగ్గించేసింది. అనేక సంవత్సరాలుగా బ్యాంక్ ఆఫ్ జపాన్ (బిఓజె) విధానపరమైన ధరలను ప్రతికూలస్థాయిలోనే కొనసాగిస్తున్నది. ఇప్పటివరకూ ధరలు పెరగలేదు. అందువల్ల చిట్టచివరకు మౌలికమైన స్థూల ఆర్థిక కారకాలు మారుతున్నట్లు కనిపిస్తున్నది. ప్రాదేశిక భౌగోళిక అనిశ్చిత పరిస్థితుల కారణంగా సరఫరా వ్యవస్థల్లోప్రధానంగా కుదుపులు రావడంతో ధరలు మందకొడిగా పెరగడం ప్రారంభించాయి. ధరలు ఒకశాతం మేరకు పెరిగినప్పటికీ ప్రజలు మాత్రం ఈ ధరలు దీర్ఘకాలంలో మధ్యస్థంగా పెరుగుతాయని అంచనావేస్తున్నారు. ద్రవ్యోల్బణం పెరుగుతుందనే ప్రజల అంచనాల మధ్య సెంట్రల్ బ్యాంకు ఎంతో ఉత్సాహంతో ఉంది. అందువల్ల ద్రవ్యోల్బణంపై నిశితంగా దృష్టి పెట్టి పోరాటం చేయడానికి సెంట్రల్ బ్యాంకు సిద్ధంగా లేదు. ద్రవ్యసరఫరాను అదనంగా విస్తరించి ఆర్థికవృద్ధికి ఊతం ఇచ్చే వైఖరి నుండి సెంట్రల్ బ్యాంకు వడ్డీరేట్లను తగ్గించిన తర్వాత రెండు నెలల క్రితం పరిస్థితులు సానుకూలపడ్డాయి. ఈ సానుకూల వాతావరణం స్టాక్ మార్కెట్‌లో సంచలనానికి కారణమైంది. దీంతో సెంట్రల్ బ్యాంకు వడ్డీరేట్లను సాధారణస్థితిలో ఉంచడానికి మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఏర్పడినట్లు కనిపిస్తున్నది.

జపాన్ కార్మికులు కూడా గతంలో ఉన్నట్టు కాకుండా కొన్ని మార్పులు పాటిస్తున్నారు. యువ కార్మికులు గతంలోలాగా ఎక్కువ ఆదాయాల కోసం ఉద్యోగ మార్పుల గురించి మాట్లాడకుండా ఒకే కంపెనీలో జీవితకాలం స్థిరంగా పనిచేసే పాత కాలపు ఆచరణకు కట్టుబడుతున్నారు. జనాభా కొరత సమస్యవల్ల తలెత్తిన ఒక విచిత్రమైన పరిణామం ఇది. వ్యాపారాల్లో శ్రామికుల కొరత ఏర్పడింది. దీంతో యాజమాన్యాలు ఉన్న ఉద్యోగులకే భారీగా వేతనాలు ఇస్తున్నాయి. ఇప్పటివరకూ జపాన్‌లో వేతనవృద్ధి మందకొడిగానే ఉంది. పనులు కూడా నిరాశాభావంతోనే జరిగాయి. ఇదే భారీ వినియోగానికీ, వృద్ధికి దారితీసింది.ఇప్పుడు మళ్ళీ వేతనాలు పెరిగాయి. త్వరలో మరోసారి పరిశ్రమలతో వేతనాలవృద్ధికి సంప్రదింపులు జరగనున్నాయి. అందువల్ల జపాన్‌లో వేతనాలు భారీగా పెరుగుతాయన్న ఆశలు రేకెత్తుతాయి. ఈ నిర్బంధాలమధ్య జపాన్ వ్యాపారులు మరోసారి తాజా పెట్టుబడులకు సిద్ధపడుతున్నారు. విదేశాల నుండి కూడా కొత్త పెట్టుబడులు వచ్చిపడుతున్నాయి. చిప్‌ల తయారీలో ప్రసిద్ధి చెందిన తైవాన్‌కు చైనా బెదిరింపులున్నాయి. దీనివల్ల ప్రపంచ ప్రసిద్ధ చిప్ కర్మాగార యాజమాన్యం 'టిఎస్‌ఎంసి' జపాన్‌లో వందలాదికోట్ల డాలర్లతో న్యూ బ్రాండ్ చిప్ ఫ్యాక్టరీలో పెట్టుబడులు పెడుతున్నది. రక్షణ రంగంలో కూడా పెట్టుబడులు పెరుగుతున్నాయి. పొరుగున ఉన్న చైనా, ఉత్తర కొరియా, రష్యా దేశాల నుండి శత్రుత్వం, దక్షిణ చైనా సముద్రంలో బెదిరింపు స్వరాలు వినిపిస్తూ ఉండటంతో రక్షణ రంగం విషయంలో, దేశీయంగా కీలక రక్షణ ఉత్పత్తుల సామర్థ్యం పెంపు విషయంలో జపాన్ వైఖరి మారుతున్నది. నౌకల నుండి ప్రయోగించే అత్యధిక సామర్థ్యంగల యుద్ధ విమానాలు, క్షిపణులు, ఆయుధ సామాగ్రిని తయారుచేయడంపై దృష్టి పెడుతున్నది. అత్యున్నతమైన సాంకేతికతతో రక్షణ సామాగ్రిని గృహపరిశ్రమల ద్వారా ఉత్పత్తి చేసేందుకు సిద్ధమవుతున్నది. ఇంతకుముందు షింజో అబే కూడా కరెన్సీ కుదింపు, ప్రతి ద్రవ్యోల్బణం నుండి జపాన్‌ను బయట పడేసేందుకు కీలకపాత్ర పోషించారు. కానీ ఆయన పరిమితమైన విజయమే సాధించగలిగారు. బహుశా ఇప్పటికీ ఆ మార్పులు కొనసాగుతూ ఉండవచ్చు. కొత్త ప్రధాన మంత్రి షిగెరు ఇషిబా ఈ తాజా వృద్ధి కారకాలను మరింత దారుఢ్యంగా మార్చేందుకు ముందుకు వెళ్ళే అవకాశం ఉంటుంది. దీనినే ఆర్థిక పరిస్థితులను నేర్పుగా విధానపరమైన గీటురాళ్ళతో నిర్వహించడంగా పిలవవచ్చు. (ఐపిఎ సర్వీస్)

# సోషల్ మీడియా భస్మాసుర హస్తం కారాదు!

సోషల్ మీడియా పాత్ర మరోసారి చర్చనీయాంశమైంది. ప్రజాభిప్రాయాన్ని మార్చడంలో, నాయకులపై అభిప్రాయాలకు రూపకల్పన చేయడంలో, మంచి వారిగానో, దుష్టులుగానో చిత్రీకరించడంలో సోషల్ మీడియా ప్రజల మెదళ్ళను తొలుస్తోంది. మంత్రి కొండా సురేఖకు గౌరవపూర్వకంగా బిజెపి ఎంపి రఘునందన్ రావు నూలుదండ వేసిన ఫోటోను సోషల్ మీడియాలో తప్పుడు అభిప్రాయం కలిగించేలా పోస్టింగ్‌లు చేయటం ఈ కోవకే వస్తుంది. ఇందులో బిఆర్ఎస్ సోషల్ మీడియా సైనికుల పాత్ర ఉందని భావిస్తున్నారు. మాజీమంత్రి హరీశ్‌రావు ఫోటో ఉన్న ఫేక్ అకౌంట్‌తో మంత్రి కొండా సురేఖకు సంబంధించిన ఫోటో పోస్ట్ అయింది. దీనిపై మంత్రి తీవ్రస్థాయిలో ఆవేదన చెంది, బిఆర్ఎస్‌ను నిలదీశారు. వెంటనే హరీశ్‌రావు స్పందించి విచారం వ్యక్తంచేసి హుందాగా వ్యవహరించారు. కానీ, గతంలో మరో మంత్రి సీతక్కపై కూడా ట్రోలింగ్ చేసిన ఉదంతం తెలిసిందే. దీంతో మంత్రి కొండా సురేఖ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు క్షమాపణ చెప్పాలని, అలాంటి పోస్టింగ్‌లు చేస్తున్న బిఆర్ఎస్ వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై కెటిఆర్ నుంచి స్పందన వ్యక్తం కాకపోవడంతో అనూహ్యంగా మంత్రివర్యులు సినీరంగం వారిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో సమస్య ఒక్కసారిగా మలుపు తిరిగింది. ఇవన్నీ కూడా గతంలో సోషల్ మీడియాలో వచ్చిన వికృత వార్తల ఆధారంగా చేసినవే. సోషల్ మీడియాపై నియంత్రణ లేకపోవడంతో, అందులో వచ్చే సంచలన, తప్పుడు వార్తలను కూడా అందరూ నిజమే అన్ని నమ్మే దుస్థితి వచ్చింది. దీంతో సోషల్ మీడియా విశ్వసనీయతపై మరోసారి చర్చకు దారితీసింది.

సాధారణంగా ప్రజలు సమాచారం తెలుసుకునేందుకు పత్రికలను ఆశ్రయించేవారు. ఒకప్పుడు అచ్చులో వచ్చిన వార్తలకు ప్రభుత్వ గెజిట్ అనే మాదిరిగా నమ్మకం. స్వాతంత్ర్యోద్యమంలో పత్రికలు కూడా ప్రజలను చైతన్యపరచడంలో కీలకపాత్రనే పోషించాయి. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, మహాత్మాగాంధీ వంటి వారు పత్రికలను నడిపేవారు. తెలంగాణలో సైతం నిజాం వ్యతిరేక పోరాటానికి పత్రికలు తమ పాత్రను పోషించాయి. ప్రజలను జాగృతం చేస్తుండిన ఇమ్రోజ్ పత్రిక జర్నలిస్టు షోయబుల్లాఖాన్‌ను రజాకర్ మూకలు హత్య చేశాయి కూడా. ప్రజలు పత్రికలతో పాటు రేడియో, టివిల ద్వారా కూడా వార్తలు తెలుసుకునేవారు. ఇదంతా కూడా 20వ దశాబ్దం వరకు సాగింది. 21వ శతాబ్దం ప్రారంభం నుండి సమాచార విస్ఫోటనం ప్రారంభమైంది. ప్రైవేటు వార్తాఛానళ్ళు, 24 గంటల ఛానళ్ల విపరీతంగా దూసుకువచ్చాయి. ప్రత్యక్ష ప్రసారాల ద్వార ప్రజలు మరింత వేగంగా వార్తలు, విషయాలను తెలుసుకోవడమే కాకుండా, వారి అవగాహన, స్వయం వివేచన శక్తి పెరిగింది. ఇదంతా కూడా పదేళ్ల ముందువరకు సాగింది.

పదేళ్లుగా సోషల్ మీడియా పేరుతో యూట్యూబ్, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లతో సాధారణ వ్యక్తులే, ఎవరికి వారే వార్తాహరులుగా మారిపోయారు. 2014లో కేంద్రంలో అధికార మార్పిడికి సోషల్ మీడియా పాత్ర కూడా గణనీయమైనదే. పత్రికలు, న్యూస్ ఛానళ్ళ యాజమాన్యాలు గతంలో లక్షిత ఆశయాలతో లాభ నష్టాలకు ఓర్చి వాటిని నిర్వహించేవారు. రానురాను యాజమాన్యాలు తమకు ఉన్న ఇతర వ్యాపారాలకు తమ చేతిలో ఉన్న మీడియాను కవచంగా మార్చుకోసాగారు. దీన్ని ఆసరాగా ప్రభుత్వాలు కూడా మీడియా యాజమాన్యాలను చెప్పుచేతల్లోకి తీసుకొని, తమపై వ్యతిరేక వార్తలను రాకుండా నియంత్రించే పరిస్థితి దాపురించింది. దీంతో అనేక ప్రజా సమస్యలు మరుగునపడడం కూడా చూశాము. ఇదే సమయంలో సోషల్ మీడియా వార్తలకు ఆదరణ మొదలైంది. ప్రధాన స్రవంతిలో రాని వార్తలను, సంఘటనలను యథేచ్ఛగా, స్వంత వ్యాఖ్యానాలతో ప్రసారం, పోస్టింగ్‌లు చేస్తుండడం జనాలకు నచ్చింది. ఒక విధంగా వెలుగు చూడని వార్తలను ప్రజలకు అందించడంతో సోషల్ మీడియా ప్రశంసాపూర్వక పాత్రను కూడా పోషించింది.




రానురానూ సోషల్ మీడియాను ఆదాయమార్గంగా మార్చుకోవడంతో, యూ ట్యూబ్ ఛానళ్ళ తీరు మారింది. వాస్తవాల కంటే సంచలనాలు జోడించడం, వ్యక్తిత్వ హననానికి సంబంధించిన వార్తలను, కథనాలను అల్లడంతో ప్రజలు కూడా వాటిని ఆసక్తిగా చూడడం, వినడం ప్రారంభించారు. సోషల్ మీడియాను నియంత్రించే వారు కూడా లేకపోవడంతో ఇష్టారాజ్యంగా మారింది. నిజం బైటికి వచ్చే లోపు, అబద్ధం భూగోళం చుట్టి వచ్చిందన్నట్లుగా మారింది పరిస్థితి. కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్ గాంధీని 'పప్పు' అంటూ దశాబ్దానికి పైగా ప్రత్యర్థి పార్టీ సోషల్ మీడియా సైన్యం ప్రచారం చేయడంతో, ప్రజలు నిజమేనని విశ్వసించే స్థాయికి చేరింది. అలాగే నెహ్రూ కుటుంబానికి సంబంధించి మతం, ఇతర విషయాలపై తప్పుడు కథనాలను వండి వార్చటంతో, ప్రజలు అబద్ధాలనే వాస్తవాలుగా నమ్మే స్థితికి చేర్చింది.

భారత్ జోడో యాత్ర పేరుతో ప్రత్యక్షంగా దేశమం తా పాదయాత్ర చేసి, ప్రజలతో మమేకమయ్యేంత వరకు రాహుల్‌గాంధీపై పప్పూ అనే మరక మాసి పోలేకపోయింది.

రాజకీయ పార్టీలకు సోషల్ మీడియానే ప్రత్యర్థులపై పైచేయి సాధించే అస్త్రంగా మారింది. ఇప్పుడు సోషల్ మీడియాపైనే ఎక్కువ పెట్టుబడి పెడుతున్నారు. తాము జిల్లాకో మెడికల్ కాలేజీ చొప్పున 32 మెడికల్ కాలేజీల బదులు 32 యూట్యూబ్ ఛానళ్ళు పెట్టి ఉంటే ఓడిపోయే వారం కాదని స్వయంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు అన్నారు. ఇప్పుడు ఆ పార్టీ సోషల్ మీడియానే ఆసరాగా చేసుకొని జనంలోకి పోయేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నది. ఒక విధంగా హైడ్రాకు, మూసీ పరీవాహక ప్రాంతాలలో ఇళ్ళ కూల్చివేత విషయంలో ప్రభుత్వానికి వ్యతిరేక అభిప్రాయాన్ని తీసుకురావడంలో కొంత విజయం కూడా సాధించింది. తాము చేస్తున్న మంచి పనులను జనంలోకి తీసుకపోలేకపోతున్నామనే అభిప్రాయం కాంగ్రెస్‌లో నెలకొంది. ఇందుకు సోషల్ మీడియా కూడా కారణమని భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే మంత్రి కొండా సురేఖ ఎపిసోడ్ తెరపైకి వచ్చింది. ఆమెపై జరిగిన ట్రోలింగ్ కానీ, ఆమె చేసిన ఆధార రహిత నిందాపూర్వక వ్యాఖ్యలకు సోషల్ మీడియా విష కథనాలే మూలం. అయితే, బాధ్యతాయుత హోదాలో ఉన్నవారు అలాంటి వ్యాఖ్యలు చేయడంపై సమాజంలో అభ్యంతరం వ్యక్తమవుతున్నది. కాగా, సోషల్ మీడియా తమ వ్యక్తిత్వాన్ని హననం చేయటం కూడా అంతే స్థాయిలో తమను మానసికంగా బాధిస్తోందని వారు అంటున్నారు.

ఏదైమైనప్పటికీ సోషల్ మీడియా కథనాలు, పోస్టింగ్‌ల విషయంలో నియంత్రణపై చర్చ జరగాల్సిన అవసరం ఉంది. జాతీయ స్థాయిలో తమ విశ్లేషణ శక్తి, ఇన్వెస్టిగేషన్ ద్వారా ప్రభుత్వాలను ప్రధాన స్రవంతి మీడియాలో ఉండి నిలదీసిన సీనియర్ జర్నలిస్టులు రావీశ్ కుమార్, అభిసార్ శర్మ తదితరులు తమ యాజమాన్యాల ఒత్తిడితో ఉద్యోగాలు కోల్పోయారు. అలాంటివారు స్వంత యూట్యూబ్ ఛానల్స్ ద్వారా చేస్తున్న సమాచార యజ్ఞం ద్వారా మరోకోణాన్ని ఆవిష్కరిస్తున్న తీరుకు ప్రజల్లో విస్తృత ఆదరణ ఉన్నది. వారి కథనాలకు లక్షల్లో వ్యూస్ రావడమే నిదర్శనం. కాబట్టి సోషల్ మీడియా రెండు వైపులా పదునైన కత్తి. అన్నిటికంటే స్వీయ నియంత్రణ ముఖ్యం. కానీ, ఆ స్థితి ఇప్పుడు ఉన్నదా? అనేది ప్రశ్నార్థకమే! కాబట్టి, సోషల్ మీడియాలో కూడా నిజమైన జర్నలిస్టులకు ప్రామాణికం ఉండేలా కసరత్తు అవసరం. ఏదేమైనప్పటికీ మీడియా, సోషల్ మీడియా తమను తాముగా సవరించుకోకపోతే, విశ్వసనీయత ప్రమాదం తలెత్తి, వాస్తవ సమాచారానికి వాహకం లేకుండా పోతుంది. భస్మాసుర హస్తంగా మారిపోతుంది. ఇది ప్రజాస్వామ్యం ఎదుర్కొనే అతి పెద్ద సవాలు.



## మహారాష్ట్ర యావత్‌మాల్ జిల్లా డిగ్రీస్ ఇంచార్జిగా ఠాకూర్

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** మహారాష్ట్ర యావత్‌మాల్ జిల్లా డిగ్రీస్ నియోజక వర్గం ఇంచార్జీగా పొల్యూషన్‌కంట్రోల్‌బోర్డు మెంబర్ పిసిసి స్పోక్ పర్సన్ నాగర్‌కర్నూల్ జిల్లా వైస్‌చైర్మన్ ఠాకూర్‌బాలాజిసింగ్ డిగ్రీస్ నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటుచేసి కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం ఎవరికైతే టికెట్ ఇస్తారో వారికోసం కష్టపడి పనిచేయాలని హిందీభాషలో మాట్లాడి కార్యకర్తను ఉత్తేజపర్చడం జరిగింది. ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్‌పార్టీ అండ గా ఉంటుందని చెప్పడం జరిగింది. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ రాహుల్‌మాణిక్‌రావుఠాక్రే, ఆయన కుమారుడు ఠాక్రే, కాంగ్రెస్‌పార్టీ నాయకులు బాణావత్ శంకర్‌నాయక్, రామస్వామి పాల్గొన్నారు.



## పనులు నాణ్యతతో త్వరితగతిన చేపట్టాలి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** గతప్రభుత్వం డబుల్‌బెడ్‌రూమ్‌ల పనులను అసంపూర్తిగా వదిలేసింది. కాంగ్రెస్‌ప్రజా ప్రభుత్వం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో అసంపూర్తిగా ఉన్న పనులకు నిధులు కేటాయించారు. శనివారం కల్వకుర్తిలో ఉన్న డబుల్‌బెడ్‌రూమ్ వద్ద జరుగుతున్న పనులను మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, శానవాజ్‌ఖాన్, మిర్యాలశ్రీనివాస్‌రెడ్డి, నాని యాదవ్, జమ్ముల శ్రీకాంత్ తదితరులు జరుగుతున్న పనులను పరిశీలించారు. పనులు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు.

## పరీక్షలు తప్పనిసరి

**ప్రజాపక్షం/వంగూర్ :** మండలపరిధిలోని సర్వారెడ్డిపల్లి కోనాపూర్ ఉప్పల పాడు గ్రామాలలో శనివారం సీజన్ వ్యాధులపై ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన నిర్వహించి వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్‌లు పద్మ రోజమ్మ మాట్లాడుతూ తప్పనిసరిగా గ్రామాలలో ప్రతి ఒక్కరు వైద్యపరీక్షలు నిర్వహించుకొని మందులువాడాలని ఆమె పేర్కొన్నారు. మన ఇంటితోపాటు చుట్టూ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకొని నీటినిల్వలను లేకుండా చూసుకోవాలని దోమలను నివారించుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఆయా గ్రామాలలో అంగన్‌వాడి కేంద్రాలలో చిన్నారులకు టీకా నిర్వహించారు. అదేవిధంగా ఫీవర్‌సర్వే నిర్వహించి బాధితులకు మందులు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు వెంకటమ్మ, లక్ష్మి దేవి, శకుంతల, ఆశ కార్యకర్తలు ఉమాదేవి, అలివేల, భాగ్యమ్మ , గ్రామస్తులు పాల్గొన్నారు.

## గాయత్రీదేవి అలంకరణలో వాసవిమాత

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** జిల్లాకేంద్రంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న 54వదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం వాసవిమాత గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. వందలాది మంది భక్తులు నిత్యపూజ కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉత్సవకమిటి అధ్యక్షులు బిల్లకంటి హరిబాబు ఆధ్వర్యంలో ఉత్సవ కమిటి నేతృత్వంలో విశేషపూజ కార్యక్రమాలు సామూహిక కుంకుమార్చన డోలోత్సవం నిర్వహించారు. అనంతరం పాలాభిషేకంచేపట్టారు. ఈసందర్భంగా లక్ష్మి నారాయణ కల్యాణోత్సవం భక్తులను అలరించింది. కార్యక్రమంలో ఉత్సవ కమిటి సభ్యులతో పాటు పట్టణ ఆర్యవైశ్యులు, ప్రజలు పాల్గొన్నారు.



## ఘనసన్మానం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలో ప్రజల భాగస్వామ్యసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమ నిర్వాహకులు పి.వెంకటయ్యను జిల్లా అధికారులు ఘనంగా సన్మానించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశమందిరంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని డిఓ రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ సీతా రామారావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తూ సేవలు అందిస్తున్న టివిఎస్ అధ్యక్షులు పి.వెంకటయ్యను డిడబ్ల్యూఓ రాజేశ్వరి, పలువురు అధికారులు శాలువా మెమోంటోతో సత్కరించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు , వయోవృద్ధుల కమిటి నాయకులు, వృద్ధులు ఉన్నారు.

## బాలికల హాస్టల్ తాడూరు మండలానికి తీసుకురావాలి




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** తాడూరు మండలకేంద్రానికి మహాత్మ జ్యోతిరావుపూలే బాలికల హాస్టల్ గత ప్రభుత్వంలో తెలంగాణ వ్యాప్తంగా 119 నియోజకవర్గాలకుగాను మహాత్మజ్యోతిరావుపూలే హాస్టల్స్ మంజూరయ్యాయి. అదేవిధంగా నాగర్‌కర్నూల్ తాలుకాకు సంబంధించినటువంటి జ్యోతిరావుపూలే హాస్టల్ తాడూరు మండలానికి మంజూరైంది. కాని గత ప్రభుత్వ ప్రజాప్రతినిధులు గత అధికారులు, ప్రభుత్వస్థలాన్ని గుర్తించగా హాస్టల్‌కు ఇవ్వకపోవడంవలన తెలకపల్లి మండలానికి తరలివెళ్లిందని ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. తాడూరు మండలం చాలా వెనకబడిన మండలంగా గుర్తింపు పొందిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మహాత్మజ్యోతిరావుపూలే బాలికల హాస్టల్‌ను తాడూరు మండలకేంద్రంలో శాశ్వత భవనం నిర్మించాలన్నారు. అనంతరం తహసీల్దార్ కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఐటియూసి జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, ప్రసాద్ పాల్గొన్నారు.

## టిఎస్‌ఆర్‌టిసిలో నోటిఫికేషన్‌కు వినతి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** టిఎస్‌ఆర్‌టిసిలో గత 12 సంవత్సరాలనుండి ఉద్యోగ నోటిఫికేషన్‌లేక నిరుద్యోగ యువతీ యువకులు నిరుత్సాహానికి గురవుతున్నారని , కొందరికి వయోభారంమించి నిరుద్యోగులు ఆందోళనకు గురవుతున్నారని వెంటనే టిఎస్‌ఆర్‌టిసిలో 3035 ఉద్యోగ నోటిఫికేషన్ వేయాలనికోరుతూ దళితహక్కుల పోరాటసమితి , డాక్టర్‌బిఆర్ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆర్‌డిఓ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, శివకుమార్, బహుగుణ, నిరంజన్ పాల్గొన్నారు.

# 'మూసీ'పై ప్రతిపక్షాల కుట్రను తిప్పికొడదాం

### భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్ :** మూసీ నది ప్రక్షాళన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, గత ప్రభుత్వాల నిర్లక్ష్యంగా కారణంగా మూసీ మురికి కుపంగా తయారయిందని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేపడుతున్న మూసీ ప్రక్షాళన కోసం రైతులు సహకరించాలని కోరారు. మూసి ప్రక్షాళనపై బిఆర్‌ఎస్, బిజెపి నాయకులు తలోమాట మాట్లాడుతూ ప్రజలను తప్పు తోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారం తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందని, కాలకూట విషంలా మారి మానవాళి మనుగడకే ప్రమాదంగా పరిణమించిన మూసీ నదిని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. మూసి నది ప్రక్షాళనపై ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లోని మూసీ పరివాహక ప్రాంత రైతులతో నాగోల్‌లోని శుభం కన్వెన్షన్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవి, జాహిరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్, కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్, మధు యాష్కి గౌడ్, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగా రెడ్డి, మందుల సామెల్, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, బి లక్ష్మారెడ్డి పాల్గొని మాట్లాడారు. కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మూసీ నది కాలుష్యంతో ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం పడుతుందని, ఈ నది పైకి ఆహ్లాదం, లోపల కాలకూట విషంగా మారిందన్నారు. ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో పరవళ్లు తొక్కి ఉమ్మడి నల్లగొండ జిల్లా భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని భువన్ పోచంపల్లి, భువనగిరి, వలిగొండ, రామన్నపేట, నార్కెట్‌పల్లి, అడ్డగూడూరు,శాలిగౌరారం, జాజిరెడ్డిగూడెం మండలాలలో పచ్చని పంటలతో, జలచరాలతో స్వచ్ఛమైన గాలి, వాతావరణంలో కళకళలాడిన మూసీ నది పరీవాహక ప్రాంతాలు నేడు శవాఘారాలు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మూసీ ప్రక్షాళనకు యుద్ధ ప్రాతిపదికన నడుం బిగిస్తేనే రాబోయే తరాలకు మేలు చేసినవారమవుతారని, లేదంటే భవిష్యత్తుతరాలకు అన్యాయం చేసినవారవుతారని అన్నారు. గత ప్రభుత్వాలు విస్మరించిన మూసీ ప్రక్షాళనను నేడు కాంగ్రెస్ ప్రభుత్వం బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఒకప్పుడు నల్లగొంజ అంటేనే ఫ్లోరైడ్ గుర్తుకొచ్చేదని, ఫ్లోరోసిస్ వ్యాధితో బాధపడుతున్న జనాలు కళ్ళముందు కనపడేవారని, అట్లాంటి ఫ్లోరైడ్ సమస్యను నివారించుకోగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్‌లు మల్‌రెడ్డి, రామిరెడ్డి, బంద్రు శోభారాణి, డిసిసి అధ్యక్షులు అండం సంజీవరెడ్డి, చెవిటి వెంకన్న యాదవ్, శంకర్ నాయక్ జిల్లా నల్గొండ రంగారెడ్డి జిల్లాల ప్రముఖ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# లోకోపైలట్ల సౌకర్యం, రక్షణకు రైల్వే నిరవధిక కృషి

### నాసిక్‌లో శిక్షణ పొందుతున్న చీఫ్ లోకో ఇన్‌స్పెక్టర్ల సమావేశంలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్



**హైదరాబాద్ :** లోకోపైలట్ల సౌకర్యం, రక్షణను మెరుగుపరిచేందుకు రైల్వే నిరవధిక ప్రయత్నాలు చేస్తున్నదని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. ఆయ న శనివారం నాసిక్ పర్యటనలో భాగంగా ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ నాసిక్(ఐఆర్ఐఇఇఎన్)ను సందర్శించి అక్కడ శిక్షణ పొందుతున్న చీఫ్ లోకో ఇన్‌స్పెక్టర్(సిఎల్ఐ)లతో సంభాషించారు.ఈ సందర్భంగా రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వారితో అనేక ముఖ్యమైన సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ విషయాన్ని శనివారం నాడు ఇక్కడ దక్షిణ మధ్య రైల్వే విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటన వెల్లడించింది.భారతీయ రైల్వేలో లోకోమోటివ్ కార్యకలాపాల ఆధునికీకరణ, భద్రతా చర్యల గురించి సిఐఎల్ సలహాలు, సూచనలు తెలుసుకున్నారు. రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్ చీఫ్ లోకో ఇన్‌స్పెక్టర్ల శిక్షణ అనుభవాలను, ప్రత్యేకించి 'కవచ్' సిస్టమ్ ఏవిధంగా ఉపయోగపడుతుంది అనే విషయమై వారి నుంచి వివరాలు రాబట్టారు. మంత్రి అశ్వినీ వైష్ణవ్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా సిఎల్ఐలు మాట్లాడుతూ వేగాన్ని మెయింటైన్ చేయడంలో, ప్రయాణికులు, సిఐఎల్ఐల ఇరువురూ సురక్షితంగా ఉండేందుకు, ట్రైన్ ఆపరేషన్ల సమయంలో సమయపాలనకు దోహదపడి 'కవచ్' తమలో మరింత విశ్వాసాన్ని బలోపేతం చేస్తున్నదన్నారు. కవచ్ విధానం తమకు ఎంతగానో ఉపయోగపడుతుందని సంతృప్తిని వ్యక్తంచేశారు. సిఎల్ఐలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిగా వినియోగించుకుంటే ఎన్నో లాభాలు ఉంటాయని మంత్రి అశ్వినీ వైష్ణవ్ సూచించారు.

# 31 నుండి కురుమూర్తి బ్రహోత్సవాలు

### ఏర్పాట్లు పూర్తిచేయాలి : కలెక్టర్ విజయేందిర బోయి

**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి :** అక్టోబర్ 31 నుండి నవంబర్ 18 వరకు నిర్వహించనున్న కురుమూర్తి స్వామి బ్రహోత్సవాలకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. మహబూబ్ నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలం అమ్మాపూర్ సమీపంలో వెలసిన శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల విషయమై శనివారం జిల్లా కలెక్టర్ దేవరకద్ర నియోజవకవర్గం శాసన సభ్యులు జి. మధుసూదన్ రెడ్డి తో కలిసి సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయం సమావేశ మందిరం లో జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం సైతం బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం వివిధ శాఖల అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని అందుకనుగుణంగా తగు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు వివిధ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. బ్రహ్మోత్సవాల పై జిల్లాలోని ప్రజలతో పాటు, ఇతర ప్రాంతాలకు తెలిసే విధంగా విస్తృత ప్రచారం గావించాలని డి.పి.ఆర్.ఓను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులతో బ్రహ్మోత్సవాలు నిర్వహించే స్వామి వారి దేవాలయం ను సందర్శించి సమీపంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి ఏర్పాట్లు పై సమీక్షించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి మహబూబ్ నగర్ , హైద్రాబాద్ నుండి వచ్చే భక్తులకు బస్సులు ఏర్పాటు చేయాలని అన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు బ్రహ్మోత్సవాలు ఏర్పాట్లు పర్యవేక్షించాలని సూచించారు. సామాన్య భక్తుల దర్శనం కు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అడిషనల్ ఎస్పీ రాములు, డిఆర్ఓ కెవివి రవి కుమార్, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ శ్రీనివాస్ రాజు, కురుమూర్తి స్వామి దేవాలయం చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, ఈవో మదన్ రెడ్డి, జిల్లా అధికారులు, చిన్నచింతకుంట మండలం అధికారులు తదితరులు హాజరయ్యారు.



## మోడల్ స్కూల్ సమస్యలు పరిష్కరించండి

**ప్రజాపక్షం / పెబ్బేరు :** పట్టణ పరిధిలోని ఆదర్శ పాఠశాలల్లో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా నెలకొని ఉన్న సమస్యల పరిష్కారం కోసం శనివారం వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డిని కలిసి వినతి పత్రాన్ని ఇచ్చారు. జాతీయ రహదారి వేసినప్పుడు మట్టిని తవ్వి వాడుకోవడం వల్ల ఆదర్శ పాఠశాల క్రీడా మైదాన ప్రాంతం గుంతగా మారింది. వర్షాకాలంలో కురిసిన వర్షపు నీరు పాఠశాల ప్రాంగణంలో నిలిచి చిన్న చెరువుగా మారింది. పల్లపు ప్రదేశం ఆ నీరు అక్కడే నిలిచిపోతుంది. నెలల తరబడి నీరు నిల్వ ఉండటం వల్ల విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాఠశాలకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. నీరు నిల్వ ఉండటం వల్ల మైదానం పరిసర ప్రాంతాలు బురద మయంగా మారి విద్యార్థులు ఆడుకోవానికి ఇబ్బంది పడుతున్నారు. అదే విధంగా ఆదర్శ పాఠశాలకు అనుకొని జాతీయ రహదారి ఉంది. పాఠశాలకు ఎదురుగా యుటర్న్ లేకపోవడం వల్ల విద్యార్థులు జాతీయ రహదారికి వ్యతిరేఖ మార్గంలో పయనిస్తూ పాఠశాలకు వెళ్తున్నారు. ఈ సందర్భంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై శాసన సభ్యులు మేఘారెడ్డి స్పందిస్తూ యుటర్న్ విషయంపై ఎన్‌హెచ్ 44 సిఈఓతో మాట్లాడుతానని, పాఠశాలకు వెళ్లడానికి మట్టి రోడ్డును వేయిస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ పెబ్బేర్ ప్రధానాచార్యులు డా. తూర్పింటి, నరేష్ కుమార్ , అధ్యాపకులు గంగాధర్ , బుచ్చయ్య, ఫకీరయ్య, నాగరాజులు పాల్గొన్నారు.

## అసైన్డ్ భూమి రద్దు ఉత్తర్వులు అమలు చేయండి

**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామ శివారులోని పల్లె గట్టు సర్వే నంబర్ 280, 281లో మొత్తం 80 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ ప్రభుత్వ భూమిని చాలా మంది వ్యవసాయ కళ్లం దొడ్లుగా, వ్యవసాయ భూమిగా అక్రమించుకొని తప్పుడు డి ఫాం పట్టాలతో అక్రమించారని గ్రామస్తులు ఫిర్యాదు చేయగా జిల్లా కలెక్టర్ కోర్టులో కేసు నంబర్ ఈ/46/2022పై కూలంకశంగా పరిశీలించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అసైన్డ్ కమిటీ 11/06/1999 తర్వాత సమావేశం కాలేదని ఎవరికి భూములు కేటాయించలేదని , సమావేశమై అసైన్డ్ కమిటీలో అయ్యవారిపల్లి భూములకు సంబంధించి ఎలాంటి అంశం చర్చకు రాలేదని బి/ 366/2000 తేదీ 20/2/2000 జారీ చేసిన డీ ఫాం పట్టా నకిలీగా గుర్తించి సర్వే నంబర్ 280/8 లో రెండెకరాల అసైన్డ్ భూమి పట్టాను రద్దు చేసినట్లు కలెక్టర్ ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని శనివారం పెబ్బేరు తహసీల్దార్ లక్ష్మి ని కలిసి ఉత్తర్వుల కాపీని తహసీల్దార్‌కు అందజేశారు. బోగస్ పట్టాతో పొందిన రైతు బంధు, బ్యాంకులోన్‌లను రికవరీ చేయడమే కాకండా తప్పుడు పత్రాలను సృష్టించి ప్రభుత్వాన్ని మోసం చేసిన లబ్దిదారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ నాయకుడు వెంకటరత్నం నాయుడు, గాండ్ల గురు రాజా తహసీల్దార్ కు విజ్ఞప్తి చేశారు.



## అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారి దర్శనం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి దేవాలయం కల్వకుర్తిలో శనివారం నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సతీమణి ఎనుములగీత హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆవోపా వారిచే బహుమతులు అందజేశారు. అనంతరం తీర్థప్రసాదవితరణ విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ ట్రస్టుచైర్మన్ జూలూరురమేష్‌బాబు, ఉత్సవకమిటి అధ్యక్షులు గంపశ్రీనివాసులు, ప్రధానకార్యదర్శి నారాయణరాజు, దాచేపల్లి నితిన్‌కుమార్, కోశాధికారులు పానుగంటినవీన్, తరుణ్, మనీష్, ప్రవీణ్, గంధంకిరణ్ పాల్గొన్నారు.



### హైదరాబాద్ బుక్ ఫెయిర్ 2024

## గౌరవ సలహాదారుల ఎన్నిక

**హైదరాబాద్ :** 37వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్ గౌరవ సలహాదారులుగా ప్రముఖ సాహితీవేత్త రామచంద్రమూర్తి, ప్రొ. కోదండరాం ను శనివారం బుక్ ఫెయిర్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. బుక్ ఫెయిర్ జనరల్ బాడీ సమావేశం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో షోయాబ్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా గౌరవ సలహాదారులను కమిటీ ఎన్నుకుంది. దీంతో పాటు బుక్ ఫెయిర్ కొత్త నిబంధనలను కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించింది. బుక్‌ఫెయిర్ నిర్వహణ డిసెంబర్ చివరి వారాల్లో నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది. త్వరలోనే తేదీలను, స్టాళ్ల నిర్వహణకు అప్లికేషన్ల ప్రకటన ఉంటుంది. అనంతరం రామచంద్రమూర్తిని మర్యాద పూర్వకంగా కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ సమావేశంలో బుక్ ఫెయిర్ ప్రెసిడెంట్ కవి యాకూబ్, జనరల్ సెక్రటరీ ఆర్ వాసు, వైస్ ప్రెసిడెంట్ బాల్ రెడ్డి, శోభన్ బాబు, ట్రెజరర్ నారాయణ రెడ్డి, జాయింట్ సెక్రటరీ సూరి బాబు, సురేశ్ బాబు, ఎమెస్కో అధినేత విజయ్ కుమార్, వీక్షణం ఎడిటర్ ఎన్ వేణుగోపాల్ తోపాటు తెలుగు పబ్లిషర్లు పాల్గొన్నారు.



## ఘనంగా వెంకటస్వామి జయంతి వేడుకలు

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలను శనివారం ఐడిఓసి ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సమీకృత జిల్లా క్రాయాలయాల సముదాయం ఆవరణలో జ్యోతి ప్రజ్వలన చేసి వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలతో జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ , జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు కేంద్ర మంత్రిగా, పార్లమెంట్ సభ్యునిగా ప్రాతినిథ్యం వహించిన వెంకటస్వామి దళిత, బడుగు , బలహీన , అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేశారని కొనియాడారు. జయంతి వేడుకల్లో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో..

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకట స్వామి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన గడ్డం వెంకట స్వామి జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్ రెవెన్యూ మోహన్ రావు లు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సుదీర్ఘ కాలం పాటు కేంద్ర మంత్రిగా, పార్లమెంట్ సభ్యునిగా ప్రాతినిథ్యం వహించిన గడ్డం వెంకట స్వామి దళిత. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతిక కోసం విశేష కృషి చేశారని అన్నారు. అంబేద్కర్ కళాశాల స్థాపించి విద్యారంగం లో కూడా డొనేషన్ లు లేకుండా పేద వర్గాల విద్యార్థులకు విద్య ను అందించారని అన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ రెవెన్యూ మోహన్ రావు జిల్లా, యువజన, క్రీడాల అధికారి వెంకటేష్, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిని జరీనా, బి.సి సంక్షేమ శాఖ అధికారిణి ఇందిర, డి.పి ఆర్ ఓ శ్రీనివాస్, చేనేత, జౌళి శాఖ అధికారి బాబు, కలెక్టరేట్ ఏ ఓ. శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## భగీరథ నీరే సురక్షితం

**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి :** మిషన్ భగీరథ ద్వారా సరఫరా అయ్యే తాగునీరు ఎంతో ఆరోగ్యదయకమని మిషన్ భగీరథ నీరు తాగడం వలన మనందరం ఆరోగ్యంగా ఉంటామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శనివారం వనపర్తి మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామ మంచినీటి సహయకుల నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమంలో చేతిపంపుల నిర్వహణ, బోరు మోటర్ల మరమ్మతులు, జాగ్రత్తలు , పైపులైన్ల పరిశుభ్రత అంశాలపై సహయకులకు మిషన్ భగీరథ అధికారులు నాలుగు రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరిగింది. గ్రామాలలో ప్రజలతో మమేకమై ఉండే చిన్న ఉద్యోగస్తులైన సహయకులపైనే పని భారం ఎక్కువగా ఉంటుందని ఎక్కడ కూడా అసహానికి గురవకుండా ప్రజల సమస్యల నివృత్తి చేస్తూ రక్షిత మంచినీటిని అందజేయాలన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు అందరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ , మున్సిపల్ చైర్మన్ మహేష్ , మాజీ ఎంపీపీ శంకర్ నాయక్ , మండలాధ్యక్షుడు రవికిరణ్ , మేఘారెడ్డి డిఈ హరీష్ , ఎంపీడీఓ అధికారులు , నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నెలరోజులు పోలీసు యాక్ట్ అమలు

### ఎస్‌పి రావుల గిరిధర్

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు 30,30 (ఏ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది వనపర్తి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు , ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా ప్రజా ధనానికి నష్టం కలిగించే , చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసు వారికి సహకరించవాల్సిందిగా సూచించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



## అధికారులు ప్రభుత్వ వారధులు

### ఎమ్మెల్యే మేఘారెడ్డి

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** ప్రభుత్వ అధికారులు ప్రభుత్వానికి ప్రజలకు వారదులుగా పని చేయాలని ప్రభుత్వ పథకాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ, ఎంపీఓలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రత్యేకంగా రాయితీ గ్యాస్ సిలిండర్లుగా వినియోగంపై ప్రజల్లో వగాహన కల్పించి ప్రతి ఒక్కరికి రాయితీ అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. పంచాయతీరాజ్, జిల్లా పరిషత్‌ల ఆధ్వర్యంలో చేపట్టిన పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసి చర్యలు తీసుకోవాలని ఈఈ మల్లయ్య, డిఈ బండారి శ్రీనివాస్‌లను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు, ఎంపీలు, పంచాయతీరాజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లెక్సీలు తొలగించడం అన్యాయం

**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి :** నిరంజన్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను 24 గంటలు గడవకముందే తొలగించడం వికృత చర్య అని బిఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. శనివారం నిరంజన్ రెడ్డి స్వగృహంలో విలేకరుల సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షులు గట్టు యాదవ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి మరచి ఇచ్చిన వాగ్దానాలు మరచి పొద్దున లేస్తే నిరంజన్ రెడ్డినని తిట్టడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. కక్ష్యపూర్తి చర్యలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల , ఆశోక్ , మండల పార్టీ అధ్యక్షులు మాణిక్యం, పార్టీ ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి, ఉంగ్లమ్ , తిరుమల్ , స్టార్ , రహీం, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



## సాధారణ ప్రసవాలు పెరిగేలా కృషి

### జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే

**ప్రజాపక్షం/బీబీనగర్ :** ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలు పెరిగేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. శనివారం ఆయన బీబీనగర్ మండలం కొండమడుగు ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఓపి పేషెంట్లు, వారికి అందిస్తున్న చికిత్స వివరాలను రిజిస్టర్లను పరిశీలించారు. జ్వరం కేసులకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. అవసరమైన చోట ఇంటింటి జ్వర సర్వే చేపట్టాలని సూచించారు. ఈ మాసంలో ప్రసవం అయ్యే గర్భిణీ స్త్రీల వివరాలను అడిగారు. సాధారణ ప్రసవం అయ్యేలా వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. మెడిసిన్స్ స్టాక్ పరిశీలించారు. వెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శ్రవణ్ కుమార్, వైద్య సిబ్బంది ఉన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన జిల్లా రారైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** సూర్యాపేట జిల్లా రారైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు శనివారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా రారైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు కొండమీది గోవిందరావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సన్నధాన్యం ఎక్కువగా దిగుబడి అవుతునందున సిఎంఆర్ కేటాయించే ధాన్యానికి 67శాతం బియ్యాన్నికి టెస్టు మిల్లింగ్ ద్వారా ఎంతశాతం వస్తేఅంతనే ప్రభుత్వానికి తిరిగి చెల్లిస్తామని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. సన్నధాన్యానికి 67శాతం బియ్యం ఇవ్వాలనే నిబంధనను సడలించాలని, గత ఆరు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మిల్లింగ్ చార్జీలు, ట్రాన్స్ ఫోర్టు, డ్రైవజ్ కస్టోడియం చార్జీలను వెంటనే చెల్లించి మిల్లర్లను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు పిన్నెని కోటేశ్వర్ రావు, గౌరవ సలహాదారులు కాసాని వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి నర్సింహ్మారావు, కమిటీ సభ్యులు బచ్చు ఉపేందర్, అవినాష్, సైదులు, బాషం శ్రీనివాస్, గజ్జి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన పిఆర్‌సిని వెంటనే అమలు పరచాలని టిఎన్‌జివోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు రాష్ట్ర జెఏసి చైర్మన్ మారం జగదీశ్వర్ డిమాండ్ చేశారు. టిఎన్‌జివోస్ జిల్లా అధ్యక్షులు నాగిళ్ల మురళి అధ్యక్షతన శనివారం పట్టణంలోని స్థానిక టిఎన్‌జివోస్ భవన్‌లో జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా టిఎన్‌జివోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు, రాష్ట్ర జెఏసి చైర్మన్ మారం జగదీశ్వర్ పాల్గొని మాట్లాడుతూ వెంటనే సిపిఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన పిఆర్‌సిని వెంటనే అమలు పరచాలని దాదాపు 5 డిఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని , డైరెక్ట్ ట్రెజరీ ద్వారానే బిల్లులు చెల్లించే విధంగా తగు చర్యలు తీసుకోవా ల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు సత్యనారాయణ గౌడ్, ఉపాధ్యక్షులు నరసింహ చారి, సంయుక్త కార్యదర్శి మాధవి, వంగూరి విజయ్ కృష్ణ, శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## డిక్కీ నర్సింహాకు నివాళులు



**ప్రజాపక్షం /చిట్యాల :** సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ వార్డు సభ్యులు, మాజీ విశాలాంధ్ర మొబైల్ వ్యాన్ డ్రైవర్ గోపగోని నర్సింహా (డిక్కీ నర్సింహా ) గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందు తూ శనివారం మృతి చెందారు.ఆయన పార్థివ దేహాన్ని నల్గొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి స్వగృహానికి తీసుకొచ్చారు. ఆయన పార్థివ దేహంపై సిపిఐ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఎర్ర జెండా కప్పి ఘనంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం,సానుభూతిని వ్యక్తం చేశారు.కార్యక్రమంలో గీతా పనివార్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు, నార్కట్ పల్లి మండల కార్యదర్శి పెండ్యాల శంకరయ్య,గ్రామ శాఖ కార్యదర్శి జిల్లా సత్యం,సినియర్ నాయకులు బొడిగె బక్క శెట్టి, జిల్లా లక్ష్మయ్య,బొబ్బల శంకర్ రెడ్డి, సీమ అంజయ్య,రెడపాక రవి,సీమ వెంకటేష్,బేదరకోట సైదులు, నమ్ముల బుచ్చయ్య,జిల్లా లింగస్వామి,గోపగోనిశేఖర్, వెంకటేష్,పానుగుళ్ల శివకుమారుడు కిరణ్, అశోక్ ఉన్నారు.

## సిపిఐ సీనియర్ బీక్యనాయక్ మృతి బాధాకరం

**ప్రజాపక్షం/డిండి:** డిండి మండలం జాల్ తండాకు చెందిన సిపిఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ రమావత్ బీక్యనాయక్ ఇటీవల మృతి చెందడం బాధాకరం అని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్ అన్నారు. శనివారం బీక్యనాయక్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ కార్యక్రమాల్లో బీక్యనాయక్ ఎప్పుడూ పాల్గొనే వాడని చనిపోయే వరకు కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పార్టీని వీడకుండా ఊపిరి ఉన్నంత వరకు ఎర్ర జెండా పార్టీలోనే ఉన్న బీక్యనాయక్ మననుండి దూరమవడం బాధాకరం అని అన్నారు. అంజయ్యనాయక్ వెంట పరామర్శించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మైనోద్దీన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, సిపిఐ డిండి మండల కార్యదర్శి కనకాచారి, సహాయ కార్యదర్శి శైలేష్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నవీన్, ఏఐవైఎఫ్ డిండి మండల నాయకులు బబ్లు లు ఉన్నారు.



# అక్రమ రవాణాపై కఠిన చర్యలు

### బార్డర్ చెక్ పోస్టుల వద్ద గట్టి నిఘా
### అక్రమార్కులతో చేతులు కలిపితే
### పోలీసులపై శాఖపరమైన చర్యలు
### మల్టీజోన్-2 ఐజిపి సత్యనారాయణ




**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** అక్రమ రవాణాలపై కఠిన చర్యలు తప్పవని మల్టీజోన్2 ఐజిపి సత్యనారాయణ హెచ్చరించారు. బార్డర్ చెక్ పోస్టుల వద్ద గట్టి నిగా ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. అక్రమార్కులతో చేతులు కలిపితే పోలీసులపై శాఖపరమైన చర్యలు తప్పవని తెల్చి చెప్పారు. శనివారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డులను పరిశీలించి పోలీసు విధుల తీరును అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుల పరిశీలనలో సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక, గంజాయి, ప్రజా పంపిణీ బియ్యం అక్రమ రవాణాలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అలాగే జూదాన్ని పూర్తిగా నిషేదిస్తామని చెప్పారు. అంతరాష్ట్ర సరిహద్దుల వెంట అక్రమ రవాణాను నిరోధించడానికి సూర్యాపేట, నల్గొండ ఎస్‌పిలు సన్ ప్రీత్ సింగ్, శరత్ చంద్ర పవార్‌లు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేస్తూ గట్టిగా పని చేస్తున్నారన్నారు. సరిహద్దుల వెంట ధాన్యం అక్రమ రవాణా జరగకుండా నిఘాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అక్రమ రవాణాల నివారణకు తమకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. మల్టీజోన్ 2 పరిధిలో 22 ప్రాంతాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. నారాయణపేట, జోగులాంబ గద్వాల, కర్నాటక రాయచూర్ బార్డర్‌లలో చెక్ పోస్టులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు సరిహద్దుగా ఉన్న తెలంగాణ గేట్ వేగా ఉన్న నల్గొండ, సూర్యాపేట జిల్లాలో కూడా అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు ఉన్నాయని చెప్పారు. సూర్యాపేట జిల్లాలో 7 పటిష్టమైన సరిహద్దు చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందని, వీటి ద్వారా ప్రతి క్షణం తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఎఓబి నుండి వస్తున్న గంజాయిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రహదారుల వెంట గ్రామాల్లో మఖాబంది కార్యక్రమాలు, వాహనాల తనిఖీలు, ఆకస్మికంగా రైడ్స్ చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఇతర ప్రాంతాల నుండి తెలంగాణ గేట్ వే ద్వారా వస్తున్న అక్రమ రవాణాలను అడ్డుకుంటామన్నారు. ఈ అక్రమ వ్యాపారాలతో సంబంధం ఉన్న ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు. శాంతిభద్రతలకు భంగం కల్పించే వారిపై నిఘా ఉంచి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే అణిచివేస్తామన్నారు. నల్గొండ ఎస్‌పి శరత్ చంద్ర పవార్, జిల్లా అదనపు ఎస్‌పి నాగేశ్వర్ రావు ఉన్నారు.



## గ్రామాలలో బెల్ట్ షాపుల నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ సహకరించాలి

### డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం / (నల్లగొండ ) మునుగోడు :** మునుగోడు శాసన సభ్యులు కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశానుసారం బెల్ట్ షాపులను నిర్మూలించేందుకు శనివారం మండలంలోని కొంపల్లి గ్రామంలో మునుగోడు మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి బెల్ట్ షాపుల నిర్మూలనపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామంలో బెల్ట్ షాపులు నడిపేవారు స్వచ్ఛందంగా బంద్ చేయాలని సూచిస్తూ లేనిచో చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని ఆ గ్రామంలో భారీగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మన మునుగోడు ఎంఎల్ఏ కోరుకుంటున్నట్లు అందరం కలిసికట్టుగా ఉండి బెల్ట్ షాపు లేని మునుగోడుగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. బెల్ట్ షాపుల నిర్మూలనకు గ్రామాలలోని ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. అనంతరం వేదిరే ఫౌండేషన్ చైర్మన్ వేదిరే మెగా రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో పూర్తిగా బెల్ట్ షాపులు నిర్మూలిస్తే గ్రామాభివృద్ధికి ఫౌండేషన్ తరపున ఐదు లక్షలు మంజూరు చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మునుగోడు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భీమనపల్లి సైదులు , మాజీ ఎంపిపిలు పోలగోని సత్యం, కర్నాటి స్వామి యాదవ్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు నన్నూరి విష్ణువర్ధన్ రెడ్డి ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చెన్నారెడ్డి,మాజీ జెడ్పీటిసి జాజుల అంజయ్య,పాల్వాయి గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లోనూ సూర్యాపేట అభివృద్ధి

### పోర్ట్ పోలియో జడ్జి మాధవిదేవి




**ప్రజాపక్షం/సూర్యాపేట:** సూర్యాపేట అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఇక్కడి పురాతన చరిత్ర ప్రజలను చైతన్యవంతులను చేసిందని సూర్యాపేట జిల్లా పోర్ట్ పోలియో జడ్జి మాధవిదేవి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కోర్టు సముదాయంలో నూతన జిల్లా లీగల్ సెల్ అథారటి కోర్టు భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 65వ నెంబర్ జాతీయ రహదారిపై సూర్యాపేట పట్టణం ఉండడంతో అన్ని రంగాల్లో దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సత్వర న్యాయం కోసం ప్రభుత్వం వివిధ రకాల కోర్టులను మంజూరు చేసిందన్నారు. ఇందుకు అవసరమైన సిబ్బందిని కూడా దశలా వారిగా కేటాయించినట్లు తెలిపారు. న్యాయవాదులు న్యాయం కోసం సహకారం అందిస్తూ మంచి సంస్కృతిని కాపాడాలని సూచించారు. లోక్ అధాలత్ కేసుల్లో సూర్యాపేట 5వ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. న్యాయవాదుల క్వార్టర్స్, పార్కింగ్ సదుపాయాలను కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. తుంగతుర్తి కోర్టులో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు నూకల సుదర్శన్ రెడ్డి, పిపిలు కొంపెల్లి లింగయ్య, నాతి సవీందర్, రాంరెడ్డి, ఏజిపి రఘురామయ్యతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రతీ ఇంటి వివరాలు సేకరించాలి

### కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** కుటుంబంలోని ప్రతి ఒక్కరి వివరాలు కుటుంబ డిజిటల్ కార్డులో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్ అన్నారు.శనివారం మున్సిపాలిటి పరిధిలోని 37వ వార్డులో ని ఓరుగంటి పుష్పవతి, సూర్య నారాయణ ఇంటి వద్ద జరుగుతున్న డిజిటల్ కార్డు సర్వేను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టు కింద 37వ వార్డులో 5 బృందాలు సర్వే చేస్తున్నారని, బృందాలు ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించాలని ఎట్టి పరిస్థితుల్లో ఏ ఒక్కరిని వదిలిపెట్టకూడదని అధికారులకు సూచించారు.ఒకే ఇంటిలో ఇద్దరు కుమారులు ఉండి వారికి వివాహం జరిగితే రెండు ప్రత్యేక కుటుంబాలుగా గుర్తించి వారి వివరాలను ప్రత్యేక డిజిటల్ కార్డులో నమోదు చేయాలని,అలాగే సర్వేకు వెళ్లినప్పుడు ఇంట్లో ఎవరూ లేకపోతే వారికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి మరుసటి రోజు అందుబాటులో ఉండమని చెప్పి మరల సర్వే బృందాలు వెళ్లి వారి వివరాలు ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు.ప్రజలు అధికారులకు సహకరించి సర్వే విజయవంతం అయ్యేలా చూడాలని ఇప్పటి వరకు 37వ వార్డులో 501 గృహలలో సర్వే పూర్తి చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డివో వేణుమాధవ్,తహసీల్దార్ శ్యామ్‌సుందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, సూపర్‌వైజర్లు శ్వేత,జానకిరాంరెడ్డి, సిఈవోలు,ఆర్పీలు పాల్గొన్నారు.

## బుద్ధవనం సందర్శించిన అశోక దమ్మ యాత్ర బృందం



**ప్రజాపక్షం/నందికొండ:** అశోక, అంబేద్కర్ దమ్మయాత్ర బృందం సభ్యులు ప్రపంచ శాంతి, బంధుత్వాన్ని కోరుతూ శనివారం నాగార్జున సాగర్‌లోని బుద్ధవనం చేరుకుంది. ఈ బృందానికి తెలంగాణ రాష్ట్రం తరపున పూజ్య బిక్కు సద్దా రక్కి త సాదర స్వాగతం పలికి బౌద్ధం విరా జిల్లిన విజయపురి బుద్ధవనానికి ఆహ్వానించారు. ఈ బృందం సభ్యులు ముందుగా బుద్ధ భగవానుని పాద పద్మాల వద్ద ప్రత్యేక పూజలు, ప్రార్థనలు జరిపారు. అనంతరం బుద్ధ వనంలోని మహా స్తూపంలో అత్యంత పవిత్రంగా భావించబడుతున్న బుద్ధ భగవానుని బండాగారాన్ని సందర్శించి అక్కడ ధ్యానం చేశారు. అనంతరం బుద్ధ వనంలోని శ్రీలంక దేశం భిక్షువులు ఏర్పాటుచేసిన ఆచార్య అవకాన బుద్ధుని నిలువెత్తు విగ్రహాన్ని సందర్శించి పూజలు చేశారు. బుద్ధ వనంలో ఏర్పాటు చేసిన ఆయా దేశాలకు చెందిన బుద్ధుని కళాఖండాలను సందర్శించి బుద్ధవనం విశేషాలను తెలుసుకొని ఆనందించారు. ఈ సందర్భంగా నేషనల్ బుద్దిస్ట్ పేటర్నాటి సొసైటీ కౌన్సిల్ పూజ్య మౌర్య బౌద్ధ బిక్కు భారతీయ ప్రభ మాట్లాడుతూ ఈ యాత్ర కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం నుండి బయలుదేరి దీక్ష భూమి నాగపూర్ చేరుకుంటుందని అక్కడ అశోక విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లుగా వారు తెలిపారు. ప్రపంచ శాంతి, ప్రపంచ బంధుత్వం నినాదంతో ఈ యాత్ర కొనసాగుతుందని అన్నారు. ఈ బృందంలో దమ్మ కమిటీ సభ్యులు దమ్మా ధర్మేంద్రన్, ఉపాసకులు రాజేంద్రన్, కేరళ రాజ గోపాలన్, తదితరులు ఈ బృందంలో ఉన్నారు.

## అంగన్‌వాడీ ఆయాలు, టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/దేవరకొండ:** అంగన్‌వాడీ ఆయాలు, టీచర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్‌ను కలిసిన అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ)రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎడమ సుమతమ్మ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు రూ. 2లక్షలు, ఆయాలకు రూ. 1లక్ష ఇస్తామని మంత్రి సీతక్క అనేక సందర్భాల్లో మాట్లాడారని అమలు చేసి ఆయాలను, టీచర్లను ఆదుకోవాలని అన్నారు. ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం కనీస వేతనం రూ. 18వేలు ఇచ్చి, ప్రతినెల మొదటి వారంలోనే జీతాలు ఇవ్వాలనికోరారు. బిఎల్‌వో, అదనపు డ్యూటీలను తొలగించాలని, అంగన్‌వాడీ లబ్ధిదారులకు మెను చార్జీలు పెంచాలని, నాణ్యమైన సరుకులు ఇవ్వాలని, రిటైర్ అయినటువంటి ఆయాలకు, టీచర్లకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎంఎల్ఏ బాలునాయక్ సిఎం రేవంత్‌రెడ్డి, సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు.

## వెంకటస్వామి నిస్వార్థ ప్రజా సేవకుడు

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్







**ప్రజాపక్షం/సూర్యాపేట:** మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి నిస్వార్థ ప్రజా సేవకుడని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో వెంకటస్వామి జయంతి సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాస్, ఆర్‌డిఓ వేణుమాధవరావు, తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, సానిటరి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** పేదల కోసం కడవరకు పోరాడిన మహానీయుడు గడ్డం వెంకటస్వామి(కాకా)అని జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత అన్నారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో కాక 95వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిఎండబ్ల్యూఓ నరసింహారావు, డివైఎఫ్ఓ రాంచందర్ రావు, డిఎస్‌సిడబ్ల్యూఓ లత, పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, సూపరింటెండెంట్ పద్మారావు, డిటిడిఓ శంకర్, టిఎన్‌జిఓ కార్యదర్శి శ్యామ్ పాల్గొన్నారు.

**జిల్లా పోలీస్ కార్యాలయంలో:** జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి(కాకా) జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి నాగేశ్వర్ రావు, జనార్దన్ రెడ్డి, డిఎస్‌పి మట్టయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వీర రాఘవులు, సిఐ చలమందరాజు, ఆర్ఐ నారాయణ రాజు, ఆర్ఐ నరసింహ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నల్లగొండ :** కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యునిగా జి. వెంకటస్వామి దళిత, బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేశారని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర అన్నారు. కేంద్ర మాజీ మంత్రి జి వెంకటస్వామి జయంతిని పురస్కరించుకుని శనివారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కార్యాలయ విభాగాల అధికారులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిటి రోడ్డు శంకుస్థాపనలు



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** ఎన్నో ఏళ్లుగా కలగానే మిగిలిపోయిన బీబీనగర్ మండలం జంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని చందునాయక్ తండా నుండి వాయ పచ్చర్లబోడుతండా, సూరెపల్లి వరకు బీటి రోడ్డు నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనీల్ కుమార్ రెడ్డికి శంకుస్థాపన చేశారు. భువనగిరి మండలంలో సూరెపల్లి, ఆకుతోటబావితండా, పచ్చర్లబోడు తండా కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు చెవ్వల నరేష్, కెతావత్ ఉమ్లా నాయక్, బానోతు నరసింహ నాయక్ అధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వేరు వేరుగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సూరెపల్లి, ఆకుతోటబావితండా గ్రామశాఖ అధ్యక్షులు నరేష్, ఉమ్లా నాయక్ మాట్లాడుతూ భువనగిరి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలు పిట్టల రజిత, మాజీ ఎంపీటీసీ గోవర్ధన్, మాజీ ఉపసర్పంచ్ కాసుల పాండురంగం, గ్రామ శాఖ ఉపాధ్యక్షులు మధుగాని వెంకటేష్, రామకృష్ణ, మద్ది వెంకట నరసింహ రెడ్డి ఎండీ.గులాం రసూల్, చెవ్వాల హరికృష్ణ పాల్గొన్నారు.

## సూర్యాపేట జట్టు ప్రతిభ



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** జిల్లా కేంద్రం కుడ కుడలోని ఎన్‌జిఎం క్రికెట్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా అండర్ 14 బాలుర క్రికెట్ ఎంపిక పోటీల్లో సూర్యాపేట జిల్లా జట్టు ఉత్తమ ప్రతిభను కనబర్చింది. యాదాద్రి భువనగిరి జిల్లా జట్టుపై నల్గొండ జట్టు గెలవగా నల్గొండ జిల్లా జట్టుపై సూర్యాపేట జిల్లా జట్టు అద్భుతమైన ప్రదర్శనతో ఘన విజయం సాధించింది. సూర్యాపేట జిల్లా జట్టులో అఖిలేష్ యాదవ్, కుషిశేశ్వర్, కౌషిక్, హర్షిత్‌లు అద్భుతమైన ప్రతిభను చూపారు.

# వేటు వీరిపైనేనా...?



**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** ఇసుక అక్రమ, రేషన్ బియ్యం రవాణాలను కట్టడి చేయడంలో విఫలం, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ మల్టీ జోన్2 ఐజీ సత్యనారాయణ జిల్లాలోని పలువురు పోలీస్ అధికారులపై వేటు వేయడం పోలీస్ శాఖలో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. జిల్లాలోని తిరుమలగిరి, జాజిరెడ్డిగూడెం, నాగారం, చింతలపాలెం ఎస్ఐలకు గత కొద్ది రోజుల క్రితం స్థానచలనం చేసిన ఆయన తాజాగా పెన్‌పహాడ్, తుంగతుర్తి, ఆత్మకూర్(ఎస్) ఎస్ఐలను విఆర్‌కు ఎటాచ్ చేశారు. దీంతో కేవలం వీరిపైనేనా.. వేటు అసలు కారకులపై ఎందుకు చర్యలు తీసుకోలేదంటూ ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగడంతో పాటు రేషన్ బియ్యం పెద్ద ఎత్తున పక్కదారి పట్టే ప్రాంతాలు జిల్లాలో అనేకం ఉన్నాయి. వీటిలో ప్రధానంగా సూర్యాపేట రూరల్, నూతనకల్, మోతె, మద్దిరాల, అనంతగిరి, కోదాడ, నేరేడుచర్ల, మఠంపల్లి, పాలకవీడు, గరిడేపల్లి మండలాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణా, రేషన్ బియ్యం దందాలపై ఆయా పత్రికల్లో పతాక శీర్షికలు ప్రచురితం కానీ రోజు అంటూ ఉండవు. ఆయా మండలాల్లో పని చేస్తున్న కొందరు పోలీస్ అధికారులు అక్రమ వసూళ్ల కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నట్లు ఆరోపణలు మొదటి నుండి వెల్లువెత్తుతున్నాయి. కానీ ఇక్కడ అక్రమ వసూళ్లకు పాల్పడే అధికారులపై వేటు పడ్డ సందర్భాలు అరుదు. ప్రస్తుతం వేటు పడిన ప్రాంతాల అధికారులపై ఆరోపణలు చాలా తక్కువనే చెప్పాలి. అయినా వారిపై వేటు పడడం అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తుంది.

**రాజకీయ వత్తిళ్ళతో కొంత మందిపై చర్యలు లేవా..?**

అక్రమ ఇసుక రవాణా, రేషన్ బియ్యం పక్కదారి పట్టే దందాలో ప్రధాన ప్రాంతాల్లో పని చేస్తున్నా కొంతమంది పోలీస్ అధికారులపై ఉన్నతాధికారులు వేటు వేయకపోవడం పోలీసు శాఖలో పెద్దఎత్తున చర్చకు దారి తీసింది. రాజకీయ వత్తిళ్ళతోనే అక్రమ వసూళ్లలో అగ్రస్థానంలో ఉన్న వారిపై ఉన్నతాధికారులు వేటు వేసే సాహసం చేయలేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. వారి పోస్టులకు ప్రజాప్రతినిధులకు లక్షలు ముట్టజెప్పి పోస్టింగులు తెచ్చుకోవడంతోనే వారి స్థానాలు పదిలంగా ఉన్నాయని కొంత మంది నిజాయితీగల పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా అసలు అక్రమ దందాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## రోడ్డు నిర్మాణంలోనాణ్యత ప్రమాణాలు పాటించాలి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. శనివా రం వార్డు ఆఫీస్ పరిసరాల్లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను జిహెచ్ఎంసి అసిస్టెంట్ ఇంజనీర్ హేము నాయక్‌తో కలిసి పనులను పరిశీలించారు. ఈ సం దర్భంగా కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణంలో సంబంధిత కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు.

# మహానగరి

హైదరాబాద్ రంగారెడ్డి

## వెంకటస్వామి సేవలు చిరస్మరణీయం



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం గడ్డం వెంకటస్వామి చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి జె.రామారావు అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల సముదాయంలోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో గడ్డం వెంకట్ స్వామి జన్మదిన వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి జె.రామారావు,సిబ్బంది, పాల్గొన్నారు.

## సంక్షేమ సంఘాలతోనే కాలనీ అభివృద్ధి : సుధీర్‌రెడ్డి



ప్రజాపక్షం/ ఎల్‌బి నగర్ : కాలనీ సంక్షేమ సంఘాలతోనే కాలనీలు అభివృద్ధి చెందుతాయని ఎల్‌బి నగర్ నియోజకవర్గ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం మన్సూరాబాద్‌లోని శ్రీరాజ రాజేశ్వరి వెల్ఫేర్ అసోసియేషన్ నూతన నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను స్థానిక కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం వాసులతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి కాలనీలో ప్రధానమైన సమస్యలను గుర్తించి వాటిని ఒక్కొక్కటిగా పరిష్కారం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షులు టంగుటూరి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పది



ప్రజాపక్షం/ చంపాపేట: సమాజం భవిష్యత్తు ఉపాధ్యాయులు పోషించే పాత్రపై ఆధారపడి ఉందని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా, టిపియుఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ కార్తిక్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై, ప్రైవేటు ఉపాధ్యాయులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... నవ సమాజం నిర్మాణంలో ఉపాధ్యాయులే కీలకం అన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జగన్‌బాబు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రభాస్ దాస్, ఉపాధ్యాయులు స్వప్న, భాగ్యలత, ఫరీన్, భవనీ తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే ఆర్థిక సంవత్సరానికి మండలంలో ఉపాధి పనులను గుర్తించాలి : ఎంపిడిఒ



ప్రజాపక్షం/యాచారం : వచ్చే ఆర్థిక సంవత్సరానికి మండలంలో ఉపాధి పనులను గుర్తించాలని ఎంపిడిఒ నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమిక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పథకం పనులను సమర్ధవంతంగా అమలు చేయాలంటే ఉపాధిలో పనులను గుర్తించాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందరు కలిసి కట్టుగా పనిచేస్తే మంచి ఫలితాలు ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిఒ శ్రీలత, ఉపాధి ఎపిఓ లింగయ్య, ఇంజనీర్ శివశంకర్‌రెడ్డి, ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గోన్నారు.

## దళిత క్రిస్టియన్లకు ఎస్‌సి హోదా కల్పనకు కృషి చేస్తా

తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్



ప్రజాపక్షం/ ఖైరతాబాద్ : దళిత క్రిస్టియన్లకు ఎస్‌సి హోదా కల్పించాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ హామీనిచ్చారు. శనివారం వాయిస్ ఆఫ్ క్రిస్టియన్ యూనిట్ ఆధ్వర్యంలో రాధా మాథ్యూ అధ్యక్షతన బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మతం కారణంగా రిజర్వేషన్లు కోల్పోయిన దళితులకు న్యాయం చేసే విధంగా కృషి చేస్తానని తెలిపారు. రిటైర్డ్ ఎడిజిపి అధికారి కె బాబూరావు మాట్లాడుతూ 1950 ఆగస్టు 10న రాష్ట్రపతి జారీ చేసిన ఆర్డర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నవంబర్‌లో జస్టిస్ బాలకృష్ణ కమిషన్ పర్యటన నేపథ్యంలో దళిత క్రైస్తవులు తమ డిమాండ్ల సాధనకు వినతి పత్రాలు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో యూనిట్ అధ్యక్షులు రెబెక్కా కిశోర్, ప్రధానకార్యదర్శి గ్రెస్ వనీలా, సంయుక్త కార్యదర్శి లీలా జెస్సీ, కోశాధికారి స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణదేవిగా దుర్గామాత

భక్తిశ్రద్ధలతో అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు అన్నపూర్ణపూ దేవిగా దర్శనమిచ్చారు. శనివారం పట్టణ సమీపంలోని ఎంతో ప్రాచీనం విశిష్టి కలిగిన కట్ట మైసమ్మ దేవాలయంలో దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు అంత్యత వైభవంగా ప్రారంభమయ్యాయి. బిఆర్‌ఎస్ మాజీ గ్రంథాలయ అభివృద్ధి కమిటి డైరెక్టర్ అందె జంగరాజు ముదిరాజ్ ,సరిత దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది కట్ట మైసమ్మ దేవాలయంలో అమ్మవారికి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామ శివారులో ఉన్న అంబా భవాని మాత దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్దలతో ఎంతో అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. ముందుగా ఆలయ కమిటి చైర్మెన్‌తోపాటు పాలక మండలి సభ్యులు అమ్మవారికి పూజ కార్యక్రమాలను నిర్వహించారు. షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో ప్రతిష్టించిన అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, అందె ఫైలయ్య, అందె రాజు, మంగ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



## రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి సీతక్క




ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్ : దేశ చరిత్రలో రైతులకు రూ.వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాని దని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బాటసింగారంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గం ప్రమాణ శ్రీకార కార్యక్రమానికి అమె ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ఓర్వలేక బిఆర్‌ఎస్ నాయకులు రోడ్ల మీద ధర్నలు చేస్తున్నారని విమర్శించారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రభుత్వ భూములను కబ్జాలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు ఇచ్చిన భూములు లాక్కొని ప్లాంట్లు చేయడం తప్ప రైతులకు ఏనాడు మెలు చేయలేదని అన్నారు. అర్హులైన ప్రతీ రైతుకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసిన ఘనత మాదే అన్నారు. పండ్ల మార్కెట్ నూతనంగా నిర్మాణం చేయడం కోసం తన వంతు సహకారం చేస్తానన్నారు. రైతులకు సౌక్యాలతో పాటు నాణ్యమైన సరుకులు వినియెగదారులకు అందేల చూడలని సూచన చేశారు. స్థానిక శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన తప్పిదల వలన సొంతగా గడ్డి అన్నారం మార్కెట్ కోహెడలో నిర్మాణం చేయలేదన్నారు. నెలకు రూ.70లక్షలు కిరాయి చెల్లించడంతో ఇప్పటికీ రూ.20 కోట్లు పోయాయన్నారు. కెటిఆర్ బంధువుల కోసం ప్రైవేటు స్థలంలో లీజుకు తీసుకోని మార్కెట్ పెట్టా రన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సిలు యగ్గే మల్లేష్, దయనందు గుప్త, భువనగిరి ఎంపి చామల కిరాణ్ కుమార్‌రెడ్డి, శాసన సభ్యులు కబ్బల పల్లి సత్యనారాయణ పాలక వర్గానికి అంభినందనులు తెలుపుతూ తన వంతు సహకారం అందచేస్తామని హామీ ఇచ్చారు. గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చిలుక మదుసూధన్‌రెడ్డి వైస్ చైర్మన్ బాస్కరా చారి పాలక వర్గం డైరెక్టర్‌లతో ప్రమాణ శ్రీకారం చేయించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు రవాణా కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్, పెద్ద అంబర్‌పేట మున్సిపాల్ చైర్మన్ పందుగుల జయశ్రీ రాజు, కౌన్సిలర్‌లు చెవుల హరిశంకర్, పసుల రాజేంద్రర్‌తో పాటు నాయకులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శంషాబాద్‌ను అభివృద్ధి చేస్తాం





రాష్ట్ర ఐటి ,రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి దుదిళ్ల శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: అంతర్జాతీయంగా ప్రసిద్ధిగాంచిన శంషాబాద్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి దుదిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శనివారం శంషాబాద్ పట్టణంలో సుమారు ఆరు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన పురపాలక సంఘ కార్యాలయ భవనన్ని చేవెళ్ళ పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రాజేందర్ నగర్ శాసన సభ్యులు ప్రకాష్ గౌడ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, టియుఎఫ్ఐసి చైర్మన్ చల్లా నర్సింహా రెడ్డి, జిల్లా కలెక్టర్ శశాంక, స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మా మహేందర్ రెడ్డిలతో కలిసి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజానీకానికి మెరుగైన జీవన శైలి అందిస్తామని, చదువుకున్న పిల్లలకు రాబోయే కాలంలో స్కిల్ యూనివర్సిటీ ద్వారా వారి నైపుణ్యాన్ని బట్టి శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. మహిళలకు మెప్మాతోపాటు ఇతర గ్రూప్ లకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు ఏర్పాటు చేయుటకు వారికి స్థలం కూడా ప్రభుత్వమే కేటాయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మూసీ పరీవాహక ప్రాంతంలో నివసిస్తున్న వారికి ప్రత్యామ్నాయంగా ఇండ్లు ఇప్పించడంతో పాటు వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, మూసీ ప్రక్షాళనకు అందరూ కృషి చేయాలని మూసీ ఇరువైపులా సుందరికరణంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. శంకుస్థాపన చేసిన11 నెలల్లో మున్సిపల్ కార్యాలయ నూతన భవనం నిర్మించుకున్న భవనమును తానే ప్రారంభించడం ఆనందంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ గడ్డం రం జిత్ రెడ్డి,రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్,కౌన్సిల ర్లు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## పేదల పక్షపాతి వెంకట స్వామి

షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: కార్మికులు, పేదల పక్షపాతి గుడిసెల వెంకట స్వామి అని, వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం షాద్‌నగర్‌లో కేంద్ర మంత్రి, స్వర్గీయ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుడిసెల వెంకట స్వామి 95వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని వెంకటస్వామి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కార్మికులు, పేదల సంక్షేమం కోసం వెంకట స్వామి అనేక కార్యక్రమాలను నిర్వహించారని, వారి పక్షపాతిగా ఉంటూ అనేక ఉద్యమాలు చేశారని వివరించారు. అదే విధంగా ఉపాధ్యాయ సేవా వారధి సంస్థ ఆధ్వర్యంలో అన్నపూర్ణలయంలో రూ.10లకే భోజనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అదే విధంగా 10వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు బుచ్చయ్య, అశంబాబు, క్రాంతికుమార్, బద్య, తిరుపతయ్య, రమేష్, వెంకటయ్య, మామిడి శ్యాంసుందర్ రెడ్డి, అగ్గనూరి విశ్వం తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అకాడమీలో కొత్త చట్టాలపై వర్క్‌షాప్

ప్రజాపక్షం/హైదరాబాద్: కొత్త క్రిమినల్ చట్టాల అమలును సమీక్షించడానికి రాష్ట్ర పోలీసుల ఆధ్వర్యంలో తెలంగాణ పోలీస్ అకాడమీలో శనివారం ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. కొత్త క్రిమినల్ చట్టాలు జూలై 1 నుండి అమల్లోకి వచ్చినప్పటి నుండి మూడు నెలల మైలురాయిని పురస్కరించుకుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ పోలీస్ అకాడమీ (టిజిపిఎ) వారి పురోగతిని సమీక్షించడానికి, సవాళ్లలో ఎదురయ్యే సమస్యలపై చర్చించడానికి ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ఈ వర్క్‌షాప్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన డిజిపి డాక్టర్ జితేందర్ మాట్లాడుతూ.. కొత్త క్రిమినల్ చట్టాల అమలులో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించడానికి నిరంతర సమీక్ష అవసరమన్నారు. ఇలాంటి వర్క్‌షాప్‌లు ఇన్వెస్టిగేషన్ అధికారులుకు ఎంతగానే ఉపయోగపడతాయన్నారు. కొత్త చట్టాలు అమలులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు దర్యాప్తు అధికారులు ఎదుర్కొన్న సమస్యలపై కూలంకశంగా వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో ఐపిఎస్ అధికారులు అభిలాషా బిష్త్ మాట్లాడుతూ..కొత్త చట్టాలు సంక్లిష్టంగా ఉంటాయి వీటిపై తగిన శిక్షణ లేకుండా అమలు చేయడం సవాలుగా ఉంటుందన్నారు. ఈ వర్క్‌షాప్లో ఐపిఎస్ అధికారులు శిఖా గోయెల్, జైన్, శివధర్ రెడ్డి, సంజయ్ కుమార్ జైన్, వివి కమలాసన్‌రెడ్డి, దామోదర్, అనురాధా,స్టీఫెన్ రవీంద్ర, అవినాష్ మొహంతి, తరుణ్ జోషి, తదితర అధికారులు హాజరయ్యారు.



## అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

షాద్‌నగర్ మాజీ శాసన సభ్యులు చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి



ప్రజాపక్షం/నందిగామ: అమ్మవారి అశీస్సులు ప్రజలందరిపై ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు మాజీ శాసన సభ్యులు చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం నందిగామ మండల కేంద్రంలోరి గాంధీ సెంటర్‌లో శివాజీ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారికి మాజీ శాసన సభ్యులు చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. షాద్‌నగర్ పట్టణానికి చెందిన గౌరవరాజులు రవికుమార్ పంతులు,రేఖ దంపతులు అమ్మవారికి సన్నిధిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి కృపా, కటాక్షలు ప్రజలపై ఎల్లప్పుడు ఉండాలని, అప్పుడే గ్రామాలు బాగుండటంతోపాటు పల్లెసీమలు ఎంతో అభివృద్ధి సాధిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జంగ నర్సింలు, మాజీ ఎంపిటిసి కొమ్ము కృష్ణ, సీనియర్ నేత రాంరెడ్డి, తుమ్మల జగన్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో 'అమెరికా గంజాయి' పట్టివేత

ముగ్గురి అరెస్టు.. రెండు బైకులు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో ఇప్పటివరకు ఒడిశాలో పండిస్తున్న దేశీయ గంజాయి స్మగ్లింగ్‌ను మాత్రమే చూశాం. తాజాగా జూబ్లీహిల్స్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరధిలో 'అమెరికా గంజాయి' స్మగ్లింగ్ గుట్టు రట్టయింది. 'అమెరికా గంజాయి'ని విక్రయిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ.2లక్షల విలువైన 3.230 కిలోల గంజాయితో పాటు 34 గ్రాముల ఒసియన్ గో గంజా (ఒజికుష్)ను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ కె.వాసుదేవరావు, ఎస్‌టిఎఫ్ సిఐ చంద్రశేఖర్‌గౌడ్‌లు వెల్లడించారు. వరంగల్‌కు చెందిన దుర్గ్యాల రాజ్‌కుమార్, పాత వర్షిత్, సూర్య ఖమ్మంకు చెందిన దీపక్‌కుమార్, తుమ్మల బాను తేజారెడ్డిలు గత కొద్ది రోజుల నుంచి హైదరాబాద్‌లో గంజాయి అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్‌ఆర్‌నగర్, పంజగుట్ట తదితర ప్రాంతాలలో పబ్బులకు వచ్చిపోయే కస్టమర్లకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే దుర్గ్యాల రాజ్‌కుమార్, పాత వర్షిత్, సూర్యలు శుక్రవారం అర్ధరాత్రి బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 36లోని డౌన్టౌన్ రెస్టారెంట్ అండ్ బార్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో తిరుగుతుండగా సమాచారం అందుకున్న ఎస్‌టిఎఫ్ సిఐ చంద్రశేఖర్ గౌడ్, జూబ్లీహిల్స్ ఎక్సైజ్ సిఐ వాసుదేవరావులు తమ సిబ్బందితో కలిసి దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న 3.230 కేజీల గంజాయిని, 34 గ్రాముల ఓసియన్ గో గంజా (అమెరికాలో పండించిన గంజాయి)ను పట్టుకున్నారు. అమెరికాకు చెందిన హైబ్రిడ్ గంజాయి. ఇది ఒక గ్రాముకు రూ.3 వేల మేర అమ్మకాలు జరుపుతారు. పట్టుకున్న గంజాయి, బైకులు కలిపి రూ.రెండు లక్షలు ఉంటుంది. నిందితుల నుంచి రెండు బైక్లు, మూడు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు దీపక్‌కుమార్, తేజారెడ్డిలు పరారీలో ఉన్నారు. ఈ దాడులను ఎస్ఐ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, ప్రసాద్, కమలేష్‌లు నిర్వహించారు. గంజాయిని పట్టుకున్న సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనిల్ కుమార్‌రెడ్డిలు అభినందించారు.

### తనిఖీలు ముమ్మరం చేశాం: సిఐ వాసుదేవరావు

'బంజారాహిల్స్, జూబీహిల్స్‌తో పాటు తమ పరిధిలోని ప్రాంతాలలో గంజాయిపై వరుస దాడులు నిర్వహిస్తున్నాం గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా తమ పరిధిలో గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నాం. పాత నేరస్తులపై నిఘా పెంచాం' అని సిఐ వాసుదేవరావు 'ప్రజాపక్షం'కు తెలిపారు.

## రైతుల సంఘటితమైతే హేమాహేమీలే మట్టికరిచారు

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: రైతుల సంఘటితం అయితే పెద్ద పెద్ద వాళ్ళే కతం అయ్యారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా కందుకూర్‌లో చేపట్టిన రైతు ధర్నాలు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, బిఆర్‌ఎస్ యువ నాయకులు పటోళ్ల కార్తీక్ రెడ్డితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ కందుకూరులో మనం చేసే లొల్లి ప్రపంచానికి తెలియకుండా ఫాక్స్ కాన్ కంపెనీకి రేవంత్ వస్తున్నారు. రైతులకు కనీస మద్దతు ధరకు అదనంగా వరికి రూ.500 ఇస్తామని చెప్పి మోసం చేస్తున్నారు.రాష్ట్రంలోని అన్ని వర్గాలను రేవంత్ మోసం చేస్తున్నరని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు కడతా అంటే ఓట్లు వేశారు. కులగొడతా అంటే ఓట్లు వేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలుకు పైసలు లేవు.. కానీ మూసీ సుందరీకరణ చేస్తారట అని కెటిఆర్ ఎద్దేవ చేశారు. మూసీ సుందరీకరణతో కమిషన్లు కొట్టేయాలని చూస్తున్నారని ఆయన ఆరోపించారు. పథకాలు అమలు చేస్తే.. కమీషన్ రాదు.. అందుకే మూసీ అంటున్నారు. రైతుల సంఘటితం అయితే పెద్ద పెద్ద వాళ్ళే కతం అయ్యారు. కందుకూరు రైతు ధర్నా స్పూర్తితో ప్రతి పల్లెలో ఆందోళనకు సిద్ధం కావాలని కెటిఆర్ పిలుపునిచ్చారు.

**రేవంత్‌కు ఆగస్టు 15 ఇంకా రాలేదా?: సబిత**

అనంతరం మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ రుణమాఫీపై అన్ని దేవుళ్ళ మీద ఒట్లు పెట్టిన రేవంత్‌కు ఆగష్టు 15 ఇంకా రాలేదా..? అని ప్రశ్నించారు. మైక్ తీసుకుంటే చాలు కెసిఆర్,కెటిఆర్,హరీష్‌ను తిట్టడమే సిఎం రేవంత్ రెడ్డి పనిగా పెట్టుకున్నారు.కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు వదిలేది లేదని హెచ్చరించారు. ఫాక్స్‌కాన్ కంపెనీ తెచ్చింది కెసిఆరే, లక్ష ఉద్యోగాలు తెచ్చిన ఘనత కూడా ఆయన కే దక్కుతుందన్నారు. నాకు ముగ్గురు కొడుకులతో పాటు ఒక కూతురు సైతం ఉందని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. సబితా ఇంద్రారెడ్డి ముగ్గరు కొడుకులకు మూడు ఫామ్ హౌస్ లు ఉన్నాయని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన దాని బదులుగా సబితా ఇంద్రారెడ్డి తనకు ముగ్గు రు కొడుకులు మాత్రమే కాదు...ఒక కూతురుతో సహా తనకు నలుగురికి నాలుగు ఫార్మ్ హౌస్ లు కడతా కదా.. అవి ఎక్కడ ఉన్నా కూల్చుకోవచ్చు అని పేర్కొన్నారు.

## మెట్రో ప్రయాణికులకు ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించాల్సిందే

మెట్రో రైల్ ఎండికి యువజన సంఘాల వినతి



ప్రజాపక్షం /హైదరాబాద్ : మెట్రో స్టేషన్ల వద్ద ప్రయాణికులకు ఉచిత వాహన పార్కింగ్‌ను యాధావిధిగా కొనసాగించాల్సిందేనని వామపక్ష యువజన సంఘాల నాయకులు అన్నారు. మెట్రో ప్రయాణ చార్జీలే అధికంగా ఉన్నాయని మళ్లీ వాహన పార్కింగ్ వసూళ్లు చేయడం అక్రమమని ఎల్ అండ్ టి సంస్థ తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర,పివైఎల్ రాష్ట్ర నేత బి.కృష్ణ,డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ లు డిమాండ్ చేశారు. ఈనెల 6 నుంచి (ఆదివారం) నుంచి మెట్రో స్టేషన్ల వద్ద ఉచిత పార్కింగ్ ఎత్తివేసి పేయిడ్ ఛార్జీలు వసూళ్లు చేయాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకంగా శనివారం నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద యువజన సంఘాలు, మెట్రో ప్రయాణికులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు .ఈ సందర్భంగా యుజవన సంఘాల నేతలు మాట్లాడుతూ మెట్రో ప్రయాణికులకు ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత ఎల్ అండ్ టి సంస్థదే అన్నారు. ప్రభుత్వ భూములను ఉచితంగా తీసుకుని, వాటిలో ఎటువంటి కనీస వసతులు కల్పించకుండా, ప్రయాణికులు వాహనాలు నిలిపితే పార్కింగ్ చార్జీల పేరుతో దండుకోవడం సరికాదన్నారు. ప్రయాణికుడు అప్పటికే వందల రూపాయలు చార్జీలు మెట్రో ట్రైన్‌కి చెల్లిస్తున్నారని, మళ్లీ పార్కింగ్ పేరుతో వసూలు చేయడం, అది కూడా రవాణా చార్జీలతో సమానంగా, అధిక మొత్తంలో వసూలు చేయడం దుర్మార్గమన్నారు. తక్షణమే నాగోల్, మియాపూర్, మిగతా అన్ని స్టేషన్లలో ఉచిత పార్కింగ్ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. చిన్నపాటి వర్షానికే నాగోల్ మెట్రో పార్కింగ్ స్థలంలో చిత్తడిగా మారిందని, అదేవిధంగా ప్రయాణికుల వాహనాలకు ఎటువంటి రక్షణ లేదని, మౌలిక సదుపాయాలు లేవని వారు విమర్శించారు. దీనిపై ఎల్ అండ్ టి సంస్థ సానుకూల నిర్ణయం తీసుకోకపోతే యువజన సంఘాలు ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎల్ అండ్ టి సంస్థ పరిధిలోగల అనుబంధ సంస్థ అయిన ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్మెంట్ ద్వారా మెట్రో రైల్ సౌకర్యాల నిర్వహణకు సంబంధించిన బాధ్యతలు చూస్తున్నదని వారు అన్నారు. అయితే మెట్రో సంస్థ ఎల్ అండ్ టీ సంస్థకు 30 సంవత్సరాల లీజు అగ్రిమెంట్ ఇచ్చిందని, నిబంధనలకు లోబడే నిర్వహణ విషయం లో ఎల్ అండ్ టీ వ్యవహరించాలి.కానీ నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ ఛార్జీలను వసూళ్ళు చేస్తున్నదని వారు ఆరోపించారు. ఛార్జీలు వసూళ్ల చేయాలంటే పార్కింగ్ స్థలంలో పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలని, షెడ్లు, సీసీ కెమెరాలు, టాయిలెట్స్, సెక్యూరిటి తదితర సౌకర్యాలు కల్పించకుండా ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్, గిరి బాబు,కళ్యాణ్, (ఏ.ఐ.వై.ఎఫ్), కొల్లూరు భీమేష్, బంగారి శ్రీనివాస్, జీ. మహేష్, శంకర్, బి. సాయి, రాజు (పి.వై.ఎల్) నాయకులు పాల్గొన్నారు.

## విశ్రాంతి ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాపక్షం/షాబాద్ : అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా శనివారం షాబాద్ మండల కేంద్రంలోని విశ్రాంతి ఉద్యోగుల కార్యాలయంలో మండల విశ్రాంతి ఉపాధ్యాయులను పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విశ్రాంతి ఉపాధ్యాయులు లింగప్ప మాట్లాడుతూ.. సమాజంలో మార్పు రావాలంటే నేటి ఉపాధ్యాయుల బోధనలో మార్పే రావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండ ల విశ్రాంతి ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



## పారదర్శకంగా ఓటరు జాబితా నమోదు

**ప్రజాపక్షం /కొడంగల్ :** పారదర్శకంగా ఓటరు జాబితాను నమోదు చేయాలని దుద్యాల్ మండల తహశీల్దార్ వెంకటేష్ ప్రసాద్ అన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌వోలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గ్రామాలలో బిఎల్‌వోలు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేసి ఎలాంటి తప్పు వోప్పులు లేకుండా సరిచేయాలాని సూచించారు. అనంతరం బిఎల్‌వోలకు సలు సలహాలు సూచనలు అందజేస్తు కిట్లను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్‌లు, కార్యాలయ సిబ్బంది తదితరులున్నారు.

# మహానగరి

మేడ్చల్ మల్కాజ్‌గిరి  వికారాబాద్

## కలెక్టరేట్ ప్రాంగణంలో బతుకమ్మ



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** దసరా పర్వదినోత్సవాల్లో భాగంగా జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో శనివారం వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన మహిళా ఉద్యోగినులు బతుకమ్మ సంబురాలను వైభవంగా నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ పాల్గొన్న ఈ కార్యక్రమంలో రెవెన్యూ, వైద్యారోగ్య శాఖ ఉద్యోగినుల బతుకమ్మలతో ఆట, పాటలు అలరించాయి.



## రూ.27లక్షలతో సిసి రోడ్డు పనులు

**ప్రజాపక్షం/అల్వాల్ :** మచ్చ బొల్లారం డివిజన్ లోని అభివృద్ధి పరుగులు తీస్తుందని కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ అన్నారు. శనివారం హెచ్ఎంటి కాలనీలో 27 లక్షల వ్యయంతో కూడిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన కార్పొరేటర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్లోని అన్ని కాలనీలలో బస్తీలలో ప్రజలనకు కావాల్సన మౌలిక సదుపాయాలను అందిస్తూ దశలవారీగా ప్రణాళిక బద్ధంగా డివిజన్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, అశోక్ రెడ్డి, సంతోష్ రెడ్డి, శకుంతల నాయుడు, లక్ష్మి, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## అన్నదాన కార్యక్రమంలో ఎంఎల్ఏ బిఎల్ఆర్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉప్పల్ ఎంఎల్ఏ బండారి లక్ష్మారెడ్డి పలు డివిజన్లో మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమల్లో పాల్గొన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని చక్రీపురం జై భవానీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి లో భాగంగా అమ్మవారికి పూజలు చేసి అన్నాదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏను శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో అన్నదాత నరేందర్‌రెడ్డి,మహేష్‌గౌడ్,రాఘవరెడ్డి, అశోక్, మాన్సింగ్, జగన్మోహన్,ప్రసాద్, వెంకటేష్, సహదేవ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**అమ్మవారి శిలా విగ్రహ ప్రతిష్టాపన**

హెచ్‌బి కాలనీ డివిజన్‌లోని భక్తిగూడ ప్రాంతంలో పోచమ్మ ఆలయంలో శనివారం అమ్మవారి శిలా విగ్రహ పున:ప్రతిష్టా కార్యక్రమం వందలాది మంది భక్తుల సంక్షేమంలో అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితుల వేదోచ్ఛారణలతో విగ్రహ శిఖర స్థాపనలు, అర్చన, నివేదన,నీరాజన, మంత్ర పుష్ప తదితర పూజలు జరిగిన అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాసరెడ్డి, బండారి నీలంరెడ్డి, బుచ్చిరెడ్డి, జంపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొని పూజలు చేసారు.

## మమత ఆసుపత్రికి విజయలక్ష్మి మృతదేహం అప్పగింత



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** శేరిలింగం పల్లి నియోజకవర్గం, మదీనా గూడ, మియాపూర్‌కి చెందిన సింగమనేని హనుమంతరావు భార్య సింగమనేని విజయ లక్ష్మి అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందారు. బాచుపల్లిలోని మమత అకాడమి ఆఫ్ మెడికల్ సైన్స్‌కు విజయ లక్ష్మి శరీరాన్ని కుటుంబ సభ్యులు దానం చేశారు. మృతదేహాన్ని అకాడమికి దానం చేయడం వలన వైద్య విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుందని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హరికృష్ణ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నవీన్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

**తుర్కపల్లిలో కేర్ ఆన్ వీల్స్ సేవలు డిఎంహెచ్ఓ ప్రారంభం**




**ప్రజాపక్షం/శామీర్‌పేట:** గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడమే కాకుండా ఉచితంగా మందులను పంపిణి చేయడమే లక్ష్యంగా కేర్ ఆన్ వీల్స్ సేవలు అందించడం గొప్ప విషయమని జిల్లా వైద్యధికారి (డిఎంహెచ్‌వొ) రఘునాధస్వామి అన్నారు. శనివారం శామీర్‌పేట మండలం తుర్కపల్లిలోని జినోమ్‌వ్యాలీలోని బీఈ కంపెనీ ఆవరణలో డాట్ల ఫౌండేషన్, ఇంపాక్ట్ గురు ఫౌండేషన్‌ల సహకారంతో కేర్ ఆన్ వీల్స్ ఉచిత వైద్య సేవలు, మందుల పంపిణి కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంబించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌వో రఘునాధస్వామి మాట్లాడుతు డాట్ల ఫౌండేషన్, ఇంపాక్ట్ గురు ఫౌండేషన్‌ల సంయుక్త ఆద్వర్యంలో ప్రారంబించిన కేర్ ఆన్ వీల్స్ సర్వీస్‌లను ప్రజలకు అందుబాటులో తీసుకరావడం అభినందనీయమని చెప్పారు. అనంతరం త్రీశాన్యరాజు, సందీప్ తల్వార్‌లు మాట్లాడుతు బిఈ కంపెని డాట్ల ఫౌండేషన్ సిఎస్ఆర్ సేవల ద్వార ప్రజలకు ఉచితంగా వైద్యం, మందుల పంపిణి చేపడుతున్నట్లు తెలిపారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో దాదాపు 30 గ్రామాల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకవచ్చామని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఇంటి వద్దకే వైద్య సేవలు తీసుకరావడం ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. అత్యవసర వేళల్లో అవసరం ఉన్న ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యం అందిస్తామని చెప్పారు. శామీర్‌పేట, గగన్‌పహాడ్, పఠాన్‌చెరువు ప్రాంతాల్లో కేర్ ఆన్ వీల్స్ సేవలు అందుబాటులో ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, విజయ్, అమృత్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులను అన్యాయం చేయొద్దు : డికె అరుణ



**ప్రజాపక్షం/కొడంగల్:** ఫార్మ కంపెని పేరు తో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని న్యాయం చేసే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడుగులు వేయాలని పాలమూర్ ఎంపి డికె అరుణ అన్నారు. గత 20 రోజులుగా కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల్ మండలం హకీంపేట గ్రామంలో ఫార్మ భూ బాధిత రైతులు గ్యో బ్యాక్ ఫార్మ అంటు నిరహార దీక్ష చేయడం జరుగుతుంది. రైతులకు మద్దతుగా పాలమూర్ ఎంపి డికె అరుణ దీక్షలో పాల్గొని రైతులకు మద్దతుగా నిలిచారు. రేవంత్‌రెడ్డి పాలనపై తీవ్ర విమర్శలు చేస్తు రైతులకు అండగా ఉంటామని ఏ ఆపద వచ్చిన నేను ఉన్నా అంటు రైతులకు బరోసా కల్పించారు. డికె అరుణ మద్దతుగా ఉన్నారనే అక్కసుతో రైతులపై ద్వేషం అక్కసు కక్కతు వారి జీవితాలతో ఆడుకోవద్దని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## మానవ వనరులు తీర్చిదిద్దటంలో హెచ్ఆర్ విభాగం కీలకం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** భవిష్యత్ తరంలో నైపుణ్యత ఆధారంగా మానవ వనరులను పెంపొందించటంలో హెచ్ఆర్ విభాగం కీలకంగా మారుతుందని ఉస్మానియా విశ్వ విద్యాలయ ప్రొఫెసర్ డా.వెంకటయ్య, భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ సెంట్రల్ హెచ్ఆర్ అధిపతి సి. హెచ్ దక్షిణామూర్తి అన్నారు. సైనిక్‌పురిలోని భవన్స్ కాలేజిలో శనివారం వివేకానంద కళాశాల ప్రిన్సిపాల్ డా.జిఎస్‌వి చౌదరి అధ్యక్షతన హెచ్ఆర్ ప్రొఫెషనల్ డే ఈవెంట్‌ను నిర్వహించారు. ఆధునిక ఉద్యోగ మార్కెట్ డిమాండ్‌ల మేరకు యువతరాలను మెరుగైన రీతిలో సన్నిద్ధం చేసేందుకు విద్యా సంస్థలు, కార్యాలయ శిక్షణ ప్రాముఖ్యత వహిస్తాయన్నారు. పలు కళాశాల విభాగ అధిపతులు, సంస్థ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కాకా వెంకటస్వామి సేవలు మరువలేనివి

### ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్



**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట :** కీర్తిశేషులు కాక వెంకటస్వామి రాష్ట్రానికి దేశానికి చేసిన సేవలు మరువలేని వని ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడా ఐలయ్య గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మాజీ కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు గూడ వరమ్మ ఆధ్వర్యంలో కీర్తిశేషులు కేంద్రమంత్రి కాక వెంకటస్వామి 95వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలయ్య గౌడ్ మాట్లాడుతూ, కీర్తిశేషులు కాక వెంకటస్వామి కేంద్రమంత్రిగా భారతదేశంలో ఉన్న కోట్లాదిమంది కార్మికులకు పింఛన్ ఇప్పించారు. బొగ్గు గనుల కార్మికుల కోసం ప్రత్యేక రక్షణ చట్టాన్ని కల్పించారు. హైదరాబాద్ నగరంలో లక్షలాదిమంది గ్రామీణ ప్రాంతం నుంచి వలస వచ్చిన నిరుపేదలకు అండగా నిలబడి గుడిసెలు వేయించి లక్షలాది మందికి ఇళ్ల స్థలాలు ఈపించారు. దేశవ్యాప్తం గా అఖిలభారత నిరుపేద లగుడిసెల సంఘం ఏర్పాటు చేసి వసతి కల్పించారు. విద్యతోటే భవిష్యత్తు మారుతుందని విద్యా సంస్థల స్థాపించి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ పిల్లలకు ఉచితంగా విద్యను అందించారు. తెలంగాణ సాధనకోసం అనేకమార్లు ఉద్యమం చేశారు. తెలంగాణ వచ్చినాకనే చస్తానని చెప్పారు. నేటి ప్రభుత్వం బిజెపి ప్రభుత్వం కార్మికచట్టాలను రద్దు చేసింది. దీనిపై కాకస్ఫూర్తి తీసుకొని నేడు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఢిల్లీ సదస్సు ఏర్పాటు చేయనున్నమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిఎం రేవంత్ రెడ్డి కాకా జయంతిని అధికారికంగా ప్రభుత్వం ఏర్పాటు చేయడాన్ని కార్మికలోకం ఐఎన్‌టియుసి అభినందిస్తుందని కాకకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి నాయకులు ఏం జనార్ధన్, బండి యాదగిరి, మంగ, తదితరులు పాల్గొన్నా రు.

**నాగారంలో:** శనివారం నాగారం మున్సిపాలిటీ కార్యాలయంలో జి వెంకటస్వామి(కాక) 95వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి చైర్మన్ పూలమాలలువేసి నివాళులర్పించారు. పేదల పెన్నిధి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వెంకట్‌స్వామి అని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్ యాద వ్, మేనేజర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

**దమ్మాయిగూడలో :** దమ్మాయిగూడ మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో వెంకట స్వామి చిత్ర పటానికి చైర్మన్, వైస్ చైర్మన్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నాగమణి, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతలో డివిజన్‌ను ఆదర్శవంతంగా ఉంచాలి

### కార్పొరేటర్ ప్రేమ్ కుమార్



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** డివిజన్‌ను పూర్తి స్థాయిలో పారిశుధ్యంలో ఆదర్శవంతంగా తీర్చి దిద్దేందుకు ఆ విభాగ సిబ్బందితో పాటు ప్రజల సహకారం ఉండాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ అన్నారు. శనివారం ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ లోని ప్రశాంతనగర్ కమ్యూనిటీ హాలులో పారిశుద్య సిబ్బందికి చెత్త తరలించేందుకు రిక్షాలు, పుష్ కార్ట్స్‌ల పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ఉండేందుకు గాను అవగాహన సదస్సులు, ర్యాలీలు, మానవహారంలాంటి పలు కార్యక్రమాలను నిర్వహించటంతో పాటు చెత్త వేస్తున్న బహిరంగ ప్రాంతాల్లో రంగోలి ముగ్గులు వేస్తూ నిలువరిస్తున్నామన్నారు. తమ ఇళ్లల్లోని చెత్తను విధిగా ప్రతి రోజు తెల్లవారు జామునే వచ్చే స్వచ్ఛ ఆటోల్లో మాత్రమే వేస్తూ తీసుకొని వెళ్లే వారికి ప్రతి నెలా వంద రూపాయలు చెల్లించాలన్నారు. సత్యమూర్తి, బాబు, సత్యనారాయణ, బ్రహ్మయ్య, సుబ్రహ్మణ్యం, శానిటరీ సూపర్‌వైజర్ రాములు, పద్మ, శేఖరయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బలహీన వర్గాల ఆశాజ్యోతి గడ్డం వెంకటస్వామి

### మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి దివంగత గడ్డం వెంకటస్వామి అని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కేంద్ర మాజీ మంత్రి దివంగత గడ్డం వెంకటస్వామి 95వ జయంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి గడ్డం వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంక టస్వామి పేద ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్య క్రమంలో డిప్యూటీ మేయర్ దన్‌రాజ్ యాదవ్, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

## డాక్టర్ జయప్రసాద్ కుటుంబానికి బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి పరామర్శ

**ప్రజాపక్షం/తాండూరు:** ప్రముఖ వైద్యుడు డాక్టర్ జయప్రసాద్ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్‌బిఎల్ సిఈఓ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి పరమార్శించారు. డాక్టర్ జయప్రసాద్ తండ్రి పరంధాములు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి శనివారం వారి నివాసానికి చేసుకుని పరందాములు బౌతిక దేహనికి పూలమాలలు సమర్పించిన ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం డాక్టర్ జయప్రసాద్ కుటుంబాన్ని బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి పరమార్శించారు. పరమార్శించిన వారిలో తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ్ళ బాల్‌రెడ్డి, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

## పచ్చదనంపై గొడ్డలి వేటు !



**ప్రజాపక్షం/అల్వాల్ :** పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వేచించి హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి ఏడాది వాన కాలంలో ప్రజలందరినీ భాగస్వాములను చేస్తూ అధికారులు ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం ప్రవేట్ ఖాళీ స్థలాలతో పాటు ఇండ్ల మధ్యల చెరువుల గట్లపై ప్రతిష్టాత్మకంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని అట్టహాసంగా చేపడుతున్నారు. అవి పెరిగి పెద్దవి కాగానే అక్రమార్కులు నరికి వేస్తుంటే పట్టించుకునే నాధుడే కరువయ్యారని అల్వాల్ సర్కిల్ పరిధిలోని రెడ్డి ఎంక్లేవ్ రోడ్ నెంబర్ 05 లో అక్రమంగా ప్రైవేటు వ్యక్తులు వ్యాపారం కోసం నాలుగు పెద్ద చెట్లను నరికి వేస్తుంటే జిహెచ్ఎంసి అధికారులు అడవిశాఖ అధికారులు పట్టించుకున్న దాఖలు లేవని కాలనీవాసులు మా పోతున్నారు.

పట్టించుకోని మున్సిపల్ అడవి శాఖ అధికారులు రహదారుల వెంట నాటిన మొక్కలపై అల్వాల్ మున్సిపల్ అడవి శాఖ అధికారులు పర్యవేక్షణ లేకుండా పోయింది. దీంతో రహదారి వెంట పెరిగిన చెట్లను నరికి వేస్తున్న ఒక్కరు కూడా పట్టించుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏపుగా పెరిగిన చెట్లు గొడ్డలి వేటుకు నాశనం అవుతున్నాయి. ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన వ్యాపారం కోసం పెరిగిన చెట్లను నరికి వేస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా చెట్లను నరికి వేస్తున్న అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు అడవి శాఖ అధికారులు స్పందించి రహదారుల వెంట చెట్లను నరికి వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వృక్ష ప్రేమికులు కోరుతున్నారు.

## కొడంగల్ అభివృద్ధిపై సిఎం సెక్రటరి ప్రత్యేక సమావేశం



**ప్రజాపక్షం / కొడంగల్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోంత నియోజకవర్గం అయిన కొడంగల్ అభివృద్ధిపై సిఎం సెక్రటరి మాణిక్ రాజ్ కర్ణన్ శనివారం కొడంగల్ కడ కార్యాలయంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, నారాయణపేట సబ్ కలెక్టర్‌లతో పాటు ఆయా శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య మంత్రి నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై ఆరా తీశారు. వ్యవసాయ శాఖ, రోడ్లు, గ్రామాల అభివృద్ధిపై కలెక్టర్‌లను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులు ఎందుకు ప్రారంబం కావడం లేదని ఆరా తీశారు. వెంటనే త్వరితగతిన పనులను పూర్తి చేయాలని పనులలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అప్పాయిపల్లి శివారులోని మెడికల్ కాలేజ్ స్థలాన్ని పరిశీలించారు. హకీంపేటలో ఏర్పాటు అయ్యే ఫార్మ భూసేకరణపై ఆరా తీసి నష్టపోయిన బాధితులకు నష్టపరిహారం అందించాలని ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులను ఆదుకోవాలని సూచించారు. రైతుల ఆకాంక్ష మేరకు పనులను చేపట్టాలని సూచించారు. సమావేశంలో సబ్ కలెక్టర్‌లు, కడ ప్రత్యేకాధికారి, ఆయా శాఖల అధికారులు పాల్గోన్నారు.

## సివరేజీ ఓవర్‌ఫ్లోను శాశ్వతంగా పరిష్కరించాలి

### జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జలమండలి ఓ అండ్ ఎం డివిజన్4 లోని ఖైరతాబాద్, ఏ.సి. గార్డ్స్‌లో సమస్యాత్మకమైన ప్రాంతాలను ఎం.డి. అశోక్ రెడ్డి పరిశీలించారు. మొదటగా ఓల్డ్ సిబిఐ క్వార్టర్స్‌లో వర్షం పడినప్పుడు ఔట్ లెట్ లేక, ఆ వర్షపు నీరు కాలనీల్లో నిలిచి ఇబ్బంది పడేవాళ్లు. దాంతో జిహెచ్ఎంసి వాననీటి కాలువను నిర్మించి ఐమాక్స్ వైపు మళ్లించింది. అందులో పూడిక పేరుకుపోయి, మరికొన్ని సీవరేజ్ లైన్లు సైతం కలిశాయి. ఆ మురుగు నెక్లెస్ రోడ్ లేక్‌వ్యూలోకి చేరుతుంది. దీంతో స్థానికులు లేక్‌ను పరిరక్షించడం కోసం ఎప్పటి నుంచో ప్రయత్నాలు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో సిబిఐ కాలనీ, బడా గణేశ్, సైఫాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి ఐమాక్స్, అక్కడి నుంచి ఎన్‌టిఆర్ గార్డెన్ ముందు రహ దారిపై ఉన్న ఏట్రంక్ మెయిన్‌లోకి చేరుతున్న సీవరేజ్ లైన్‌లను అధికారులతో కలిసి ఎం.డి. పరిశీలించారు. హెచ్ఎండిఏ ప్రత్యేక కార్య క్రమాలు నిర్వహించినప్పుడు పార్కింగ్ కోసం ఏర్పాటు చేసినప్పుడు అక్క దున్న మ్యాన్ హోళ్లు పూడుకుపోయినట్లు గుర్తించారు. దాంతో పాటు ఆ పైకి ఉన్న సీవరేజ్ లైన్‌లో పూడిక నిండి, మురుగు ప్రవాహానికి ఆటంకం కలిగేది. దీనికి శాశ్వత పరిష్కారంగా ధ్వంసమైన మ్యాన్ హోళ్లను పునర్నించి, రోడ్డులో పూడికుపోయిన మ్యాన్ హోళ్లను గుర్తించి, పూడికతీసి చూడాలని, అయినప్పటికీ సమస్య ఇంకా ఉంటే కొత్త వాటిని నిర్మించు కోవడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం గవర్నర్ గారు దత్తత తీసుకున్న ఇందిరా నగర్‌లో ఎం.డి. పర్యటన కొనసాగింది. కొన్ని నివాసాలకు నల్లా కనెక్షన్లకు ట్యాప్‌లు లేకుండా ఉండ టం చూసి, దూరం నుంచి తీసుకు వస్తున్న మంచినీటిని ఇలా వదిలేయడం సరికాదని ఎం.డి. చెప్పారు. అలాగే వదిలేస్తే కలుషిత నీరు సరఫరా అయ్యే అవకాశం ఉన్నందున తప్పనిసరిగా పిట్‌ట్యాప్‌లు బిగించుకోవాలని సూచించారు. ఆ తర్వాత ఏసి గార్డ్స్ పిటిఐ బిల్డింగ్‌కు ఆనుకుని ఉన్న బిస్తి వాడ నుంచి లక్డీకాపూల్ వరకు చాలా కాలం నుంచి రహదారులపై మురుగు పొరడం, నిత్యం సీవరేజ్ సమస్యలు నమోదయ్యేవి. ఈ సమస్యను పరిష్కరించేందుకు సమాంతరంగా మరో సీవరేజ్ లైన్ ను నిర్మించి, పాత సీవరేజ్ లైన్ ఓవర్ ఫ్లోను కొత్త లైన్‌లో కలిపారు. ఈ సమస్యను తాత్కాలికంగా పరిష్కరించడానికి రహదారిపై ఉన్న రెయిన్ వాటర్ డ్రెయిన్‌ను డీసిల్టింగ్ చేసి రోడ్డు మీద పారుతున్న మురుగును ఈ డ్రెయిన్ కి మళ్లించి శాశ్వత పరిష్కారంగా రోడ్డు అవతల వైపున్న జలమండలి సీవరేజ్ లైన్‌కు కొత్త కనెక్టివిటీ పైపు లైన్‌ను నిర్మించాలన్నారు. పైపు లైన్ నిర్మాణం కోసం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా టన్నెలింగ్ ద్వారా విస్తరణ పనులు చేపట్టాలన్నారు. ఇది సాధ్యం కాకుంటే, రాత్రి సమయాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పనులు పూర్తి చేయాలన్నారు. ఈ పర్యటనలో డైరెక్టర్ ఆపరేషన్స్1 విజయరావు, సిజిఎం ప్రభు, జిఎం, డిజిఎం, మేనేజర్ పాల్గొన్నారు.



## వీర మరణం చెందిన ఆర్‌టిసి కార్మికులకు నివాళులు

**ప్రజాపక్షం/పరిగి రూరల్ :** ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మికులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి హనుమంతు ముదిరాజ్ అన్నారు. మెహదీపట్నం డిపోలో 2019 అక్టోబర్ 5వ తేదీ నుంచి 55 రోజులు సమ్మె సమయంలో 38 మంది ఆర్టీసీ కార్మికులు అమరులైన సందర్భంగా పరిగి డిపోలో నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా హనుమంతు ముదిరాజ్ మాట్లాడుతూ ఆర్టీసీ ని ప్రభుత్వంలో విలీనం చేయాలని, పేస్కేల్ అమలు చేయాలని, రావలసిన బకాయిలు ఇవ్వాలని, పొదుపు చేసుకున్న డబ్బులు చెల్లించాలని, రిటైర్మెంట్ అయిన వారికి అన్ని బెనిఫిట్స్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్య మంత్రి ఆర్టీసీ ని ప్రభుత్వంలో విలీనం చేయు అపాయింట్మెంట్ డేట్ ను ప్రకటించాలని, యూనియన్లను అనుమతించాలని, సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరిగి డిపో నాయకులు వెంకట్ రాములు, బోయిని కృష్ణ, శంషాద్దీన్, ప్రసాద్, సురేష్, బీవీ బాబు, వెంకటేశ్, జంగయ్య, లక్ష్మీ, ఐనాపూర్ కృష్ణ, మక్బుల్, నబి, శ్రీను, గోపాలకృష్ణ, రఘు తదితరులు పాల్గొన్నారు.




## దుర్గామాత శోభాయాత్రకు డిజె అనుమతి లేదు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** దుర్గామాత శరన్నవరాత్రుల్లో బాగంగా నిర్వహించే ఊరేగింపులకు డిజె అనుతులు లేవని ఎవరైన నిబంధనలను ఉల్లంగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయని శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ అన్నారు. శనివారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్టించిన మండప నిర్వాహకులు, డిజె ఆపరేటర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతు ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శోభాయాత్ర చేసుకోవాలన్నారు. డిజె ఆపరేటర్స్ తమ డిజె సౌండ్‌లకు సంబందించి బిజినెస్ లైసెన్స్ మేడ్చల్ డిసిపి వద్ద తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు పరుషరామ్, మండప నిర్వాహకులు, సౌండ్ ఆపరేటర్స్ పాల్గొన్నారు.



## కల్లు గీత కార్మికులు భద్రతా ప్రమాణాలు పాటించాలి : ఎంఎల్ఏ కెపి వివేకానంద

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కల్లు గీత కార్మికులు భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పేట్‌బషీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన కల్లు గీత కార్మికులందరికి జిల్లా ఎక్సైజ్ శాఖ నుండి మంజూరైన కాటమయ్య కిట్‌లను ఎమ్మెల్యే కెపి వివేక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని కల్లు గీత కార్మికులకు ఎక్సైజ్ శాఖ నుండి కాటమయ్య కిట్‌లను అందజేస్తున్నామని, కార్మికులు ఈ రక్షణ కవచాలను తప్పనిసరిగా వినియోగించుకుని ప్రమాదాలకు గురికాకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ యాదయ్య, ఎస్సై రవి రాథోడ్, బిసి కార్పొరేషన్ అధికారులు రాజేశ్వరి, మోహిద్ ఖాన్, కమల్ దాస్, కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్, శ్రీనివాస్, గౌడ సంక్షేమ సంఘం సభ్యులు నరేందర్ గౌడ్, సురేశ్ గౌడ్, బాల కృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

## సిఐ స్తైదులు సస్పెన్షన్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** హత్యకేసులో ఓ ప్రదాన నిందితున్ని తప్పించినట్లు ఆరోపణలు ఎదుర్కోంటున్న ఘట్‌కేసర్ సీఐ స్తైదులును శనివారం పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ యేడాది జూన్15న ఘట్‌కేసర్ మాజీ ఎంపీటీసీ గడ్డం మహేష్ హత్యకు గురైన విషయం తెలిసిందే హత్యకేసు దర్యాప్తులో భాగంగా సీఐ స్తైదులు నిందితులతో పాటు హత్యకు సహకరించిన 6మందిని రిమాండ్‌కు తరలించారు. మృతుని బంధువుల ఫిర్యాదు ఆధారంగా సీపీ సీఐ స్తైదులును సస్పెండు చేస్తూ అదేశాలు జారీచేశారు. ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌లో స్తైదులు సీఐగా ఆరునెలలు విధులు నిర్వహించారు.

